


ESTD: 1999 www.voodayam.com

# వుదయం

కరీంనగర్ 26-05-2026 మంగళవారం | సంపుటి : 14 | సంచిక :164 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 4.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Karimnagar, Hyderabad, Adilabad, Khammam, Guntur & Warangal | Follow us on




* మూసీ నిర్వాసితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. స్థానికంగానే నివాసాలు మంజూరు చేస్తాము. ఈ విషయంలో పార్టీలు రాజకీయం చేయడం తగదు. మూసీ పునరుజ్జీవం చేసి అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నాము. మూసీ కాలుష్యంతో నల్గొండ జిల్లా ప్రజలకు జీవన్మరణ సమస్యగా మారింది. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు వల్ల యువతకు ఉపాధి లభించడమే కాకుండా నగర ప్రజల జీవన విధానం మెరుగవుతుంది. ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేస్తున్నాము. నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని, అందులో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన బ్రేక్‌ఫాస్ట్, భోజనం అందిస్తున్నాం.

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి


సిపిఎం బృందంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## రైతులు పండించిన ప్రతి గింజ

# కొనుగోలు చేస్తాం

కేంద్రం మద్దతు ధరలు ప్రకటించడమే తప్ప పంటను కొనుగోలు చేయడం లేదు

హమాలీలు బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లడంతో ఇక్కడ కొరత ఏర్పడింది

ఎండల కారణంగా మధ్యాహ్నం పని జరగడం లేదు

మూసీ నిర్వాసితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

మూసీ కాలుష్యంతో నల్గొండ జిల్లా ప్రజలకు జీవన్మరణ సమస్య

నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాము

మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు యువతకు ఉపాధి

నగర ప్రజల జీవన విధానం మెరుగవుతుంది

సీపీఎం బృందంతో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మే 25 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. కేంద్రం మద్దతు ధరలు ప్రకటించడమే తప్ప రాష్ట్రంలో పంటను కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. కనీసం 30 శాతం కూడా సేకరించడం లేదని విమర్శించారు. సోమవారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సీఎం రేవంత్ రెడ్డిని రాష్ట్ర సచివాలయంలో సమావేశమైంది. రాష్ట్రంలో సుదీర్ఘ కాలం పెండింగ్ ఉన్న కార్మికుల కనీస వేతనాల పెంపు నిర్ణయంపై ఆ ప్రతినిధి బృందం సీఎం కు ధన్యవాదాలు తెలిపింది. ఈ సందర్భంగా వివిధ అంశాలపై సీఎం స్పందిస్తూ, రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నామన్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కారణంగా హమాలీలు తరలివెళ్లడంతో ఇక్కడ కొంత కొరత ఏర్పడిందన్నారు. ఎండల కారణంగా మధ్యాహ్నం సమయంలో పని జరగడం లేదన్నారు. ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం సమీక్ష చేస్తున్నానని తెలిపారు. సన్నవడ్లకు రూ. 500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తున్నామన్న సీఎం.. మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. మూసీ నిర్వాసితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. స్థానికంగానే నివాసాలు మంజూరు చేస్తామన్నారు. ఈ విషయంలో పార్టీలు రాజకీయం చేయడం తగదన్నారు. మూసీ పునరుజ్జీవం చేసి అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని అన్నారు. మూసీ కాలుష్యంతో నల్గొండ జిల్లా ప్రజలకు జీవన్మరణ సమస్యగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ ఎదురవుతున్న పరిస్థితులను వివరించారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు వల్ల యువతకు ఉపాధి లభించడమే కాకుండా నగర ప్రజల జీవన విధానం మెరుగవుతుందని చెప్పారు. ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేస్తున్నామని, చేపడుతున్న కార్యక్రమాలను వారికి వివరించారు. నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో

మిగతా 2లో

## ఒక్క ఇందిరమ్మ ఇల్లు

# నిర్మించలేదు

## నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా



కాంగ్రెస్ ప్రభుత్వానికి కూల్చివేతలే తప్ప నిర్మించడం తెలియదు

మేం నిర్మించిన ఆస్పత్రులకే సిఎం రిబ్బన్లు కట్ చేస్తున్నారు

ఎపిలో కాంగ్రెస్ మొత్తం తుడిచిపెట్టుకుపోయింది

కాంగ్రెస్, బీజేపీ నమోదు చేసిన దొంగ ఓట్ల పైన ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ప్రతి బూత్ నుంచి తగిన ప్రణాళికతో ముందుకు పోవాలి

బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే.. హైదరాబాద్ నగరంలో 24 గంటల తాగు నీరు ప్రతి ఇంటికి సరఫరా

దగ్గరుండి హైదరాబాద్ నగరానికి 24 గంటల తాగునీటిని అందించే బాధ్యత నేను తీసుకుంటా

నగరంలో రియల్ ఎస్టేట్ పూర్తిగా కాంగ్రెస్ తోనే దెబ్బతిన్నది

**హైదరాబాద్, మే 25 (వుదయం ప్రతినిధి) :** కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో ఒక్క ఇందిరమ్మ ఇల్లు నిర్మించలేదని, ఒకవేళ నిర్మించినట్లు నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ చేశారు. గతంలో తాము నిర్మించిన ఆస్పత్రులకే సీఎం రిబ్బన్లు కట్ చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కూల్చివేతలే తప్పా నిర్మించడం తెలియదన్నారు. సోమవారం హైదరాబాద్ లోని కూకట్‌పల్లిలో జరిగిన పార్టీ శ్రేణుల సమావేశంలో స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ ఓట్ల సవరణ కార్యక్రమంపై కేటీఆర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ ప్రజలంతా కాంగ్రెస్ అనే దరిద్రాన్ని దూరం చేసుకున్నారన్న కేటీఆర్.. తెలంగాణలో మాత్రం ప్రజలు అధికారం ఇస్తే రెండేళ్లుగా ఆ దరిద్రం మన నెత్తిన కూర్చుందన్నారు పక్కన ఏపీలో కాంగ్రెస్ మొత్తం తుడిచిపెట్టుకుపోయిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ నమోదు చేసిన దొంగ ఓట్ల పైన ప్రత్యేక శ్రద్ధ వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దీంతోపాటు ఏ ఒక్కరి ఓటు కూడా పోకుండా పార్టీ శ్రేణులు ప్రజలకు అండగా ఉండాలని కోరారు. దీనికోసం ప్రతి బూత్ నుంచి తగిన ప్రణాళికతో ముందుకు పోవాలని కోరారు.

మిగతా 2లో



## హైదరాబాద్ మెట్రోకు

# రూ. 13,600 కోట్లు

## ఐఆర్ఎఫ్‌సీతో హైదరాబాద్ మెట్రో రీఫైనాన్సింగ్ ఒప్పందం

ఒప్పంద పత్రాలపై న్యూ ఢిల్లీలో సీఎస్, ఐఆర్ఎఫ్‌సీ సీఎండీ సంతకాలు

హైదరాబాద్ మెట్రో రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని ప్రజా రవాణా ఆస్తిగా మారనుంది

హైదరాబాద్‌కు సమర్థవంతమైన, సుస్థిరమైన ప్రజా రవాణా వ్యవస్థను విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యం : సీఎస్

మెట్రో కనెక్టివిటీతో తగ్గనున్న ట్రాఫిక్ రద్దీ

రీఫైనాన్సింగ్ ద్వారా హైదరాబాద్ మెట్రోపై ఉన్న ఆర్థిక భారం తగ్గడమే కాకుండా, భవిష్యత్తులో విస్తరణ ప్రణాళికలకు కూడా ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని అభిప్రాయపడ్డారు. మరో కీలక పరిణామంగా, లార్సెన్ అండ్ టూబ్రో నుంచి ఎల్ అండ్‌టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ వంద శాతం యాజమాన్యం తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ కానుందన్నారు. దీంతో హైదరాబాద్ మెట్రో రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని ప్రధాన ప్రజా రవాణా ఆస్తిగా మారనుందని చెప్పారు.

**న్యూఢిల్లీ, మే 25 (వుదయం బ్యూరో) :** హైదరాబాద్ మెట్రో రైలుకు భారీ ఆర్థిక ప్రయోజనం చేకూరింది. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్‌తో (ఐఆర్ఎఫ్‌సీ) హైదరాబాద్ మెట్రో రూ.13,600 కోట్ల రీఫైనాన్సింగ్ ఒప్పందం కుదుర్చుకుంది. ఐఆర్ఎఫ్‌సీ సీఎండీ మనోజ్ కుమార్ దూబె, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు సమక్షంలో ఈ రుణ సదుపాయానికి సంబంధించిన ఈ ఒప్పందంపై సోమవారం ఢిల్లీలో సంతకాలు జరిగాయి. అధికారులు ఈ ఒప్పందాన్ని హైదరాబాద్ మెట్రోకు దీర్ఘకాలిక ఆర్థిక బలం చేకూర్చే కీలక అడుగుగా అభివర్ణించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పట్టణ రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. హైదరాబాద్ దేశ ఆర్థిక వృద్ధికి కీలక కేంద్రంగా ఎదుగుతోందని, మెట్రో కనెక్టివిటీ విస్తరణతో ట్రాఫిక్ రద్దీ తగ్గి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుతాయని పేర్కొన్నారు. ఈ ఒప్పందం ప్రకారం ప్రస్తుతం ఉన్న రుణాలను రీఫైనాన్స్ చేసేందుకు రూ.13,600 కోట్ల రుణం మంజూరు చేయనున్నట్లు చెప్పారు. నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్లు, కమర్షియల్ పేపర్లు, వర్కింగ్ కాపిటల్ రీఫైనాన్సింగ్ కోసం ఈ నిధులను వినియోగిస్తామన్నారు. 20 ఏళ్ల కాలపరిమితితో త్రైమాసిక చెల్లింపుల విధానంలో ఈ రుణ సదుపాయం ఇవ్వనున్నట్లు వివరించారు. రీఫైనాన్సింగ్ ద్వారా హైదరాబాద్ మెట్రోపై ఉన్న ఆర్థిక భారం తగ్గడమే కాకుండా, భవిష్యత్తులో విస్తరణ ప్రణాళికలకు కూడా ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని అభిప్రాయపడ్డారు. మరో కీలక పరిణామంగా, లార్సెన్ అండ్ టూబ్రో నుంచి

మిగతా 2లో

## నౌకాయాన పన్ను మాత్రమే,

# టోల్ కాదు



హార్ముజ్ గుండా ప్రయాణించడానికి ఎటువంటి రుసుములు అవసరం లేదు

ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ

వాణిజ్య నౌకల నుండి ఇరాన్ రుసుములను వసూలు చేయడం ప్రారంభించిందని వార్తల నేపథ్యంలో మంత్రి వివరణ

5

## అంతర్ రాష్ట్ర సమన్వయంతో త్రాగునీటి సమస్యకు

# శాశ్వత పరిష్కారం

సాగునీటి హక్కులు, భవిష్యత్ అవసరాలకు చర్యలు

కృష్ణా జలాల సమన్యాయ వినియోగంపై హక్కులను కాపాడుకునేలా చర్చలు

- కృష్ణానదిపై ప్రతిపాదిత బ్యారేజ్ నిర్మాణ అంశాలపై సాంకేతిక అంశాలపై విస్తృతంగా చర్చ
- తెలంగాణ రైతాంగం సాగునీటి అవసరాలకు చర్చల్లో పూర్తి ప్రాధాన్యత
- పరస్పర అవగాహనతోనే కృష్ణా జలాల వినియోగం
- తెలంగాణ-కర్ణాటక రాష్ట్రాల మధ్య సాగు, తాగునీటి వినియోగంపై సానుకూల చర్చలు
- ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2

దేశీయ వృద్ధిని పరిరక్షించేందుకే ప్రభుత్వ విధాన ప్రతిస్పందన రూపొందించాము. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాల తగ్గింపు వల్ల రూ. 1 లక్ష కోట్ల ఆదాయ నష్టం వాటిల్లుతుంది. పెరిగిన ముడి చమురు ధరలతో పాటు, ఎరువుల ధరలు ఊహించలేని స్థాయికి పెరిగాయి. అదే సమయంలో అధిక బంగారం ధరలు విదేశీ మారకద్రవ్యాల రంగంలో కొన్ని సవాళ్లను సృష్టిస్తున్నాయి. ఇవన్నీ 3ఎఫ్‌లను విధానపరమైన దృష్టిలో కేంద్రంగా ఉంచాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతున్నాయి.

– కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



## ఇంధనం, ఎరువులు, ఫారెక్స్ అనే

# 3ఎఫ్‌లపై దృష్టి సారించాలి

- నిరాశావాద, విద్వేషపూరిత కథనాన్ని ప్రచారం చేస్తున్న వ్యతిరేకులు
- భారతదేశ దేశీయ, ఆర్థిక పునాదులు పటిష్టంగానే ఉన్నాయి
- భయాందోళనలను రెచ్చగొట్టడం ఎంతమాత్రం తగదు
- పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ఆర్థిక మంత్రి సీతారామన్

**న్యూఢిల్లీ, మే 25 (వుదయం బ్యూరో) :** పశ్చిమాసియా సంక్షోభం ప్రపంచ వస్తు మార్కెట్లపై ఒత్తిడిని కొనసాగిస్తున్న నేపథ్యంలో, భారత ఆర్థిక వ్యవస్థ ఇంధనం, ఎరువులు, విదేశీ మారకద్రవ్యం అనే మూడు కీలక ఒత్తిడి అంశాలపై దృష్టి సారించాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం నొక్కి చెప్పారు. వీటినే ఆమె 3ఎఫ్లుగా అభివర్ణించారు. ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ, ప్రపంచ అనిశ్చితులు ఉన్నప్పటికీ భారతదేశ దేశీయ ఆర్థిక పునాదులు పటిష్టంగానే ఉన్నాయని సీతారామన్ పునరుద్ఘాటించారు. ఈ సవాళ్లు ఎక్కువగా బాహ్య కారకాల వల్ల తలెత్తుతున్నాయని మనం గుర్తించాలి. అంతేకాకుండా, భారతదేశపు అంతర్గత ఆర్థిక పరిస్థితి నేటికీ

మిగతా 2లో



## తెలంగాణలో 37 లక్షల గృహ ఎల్‌పీజీ సిలిండర్ల పంపిణీ

మే నెలలో డీజిల్ విక్రయాల్లో 12.6 శాతం, పెట్రోల్ విక్రయాల్లో 9 శాతం పెరుగుదల

ధరలు తక్కువ ఉండటంతో ప్రైవేట్ బంకుల వినియోగదారులు సైతం ప్రభుత్వ రంగ పెట్రోల్ బంకుల వైపు మొగ్గు

12 జిల్లాల్లో 15 నుంచి 25 శాతం మధ్య వృద్ధి

2

# ధరలు పెంచి దోచుకుంటారా?

- చమురు పెంపు నిత్య దోపిడీగా మారింది
- దీంతో ఎవరు బాగుపడుతున్నారు
- రెండు వారాల్లో నాలుగోసారి ఇంధన ధరల పెంపు
- కేంద్రం సామాన్యులను పొదుపును దహించివేస్తోంది
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శలు



**హైదరాబాద్, మే 25 (వుదయం ప్రతినిధి) :** పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం నడుమ ఇంధన ధరల పెంపును ప్రస్తావిస్తూ, ఈ రోజువారీ దోపిడీ వల్ల ఎవరు లాభపడుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సోమవారం ప్రశ్నించారు. సోమవారం నాడు పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు సుమారు రూ. 2.60 నుండి రూ. 2.70 వరకు పెరిగాయి. కేవలం రెండు వారాల లోపే ఇంధన ధరలు పెరగడం ఇది నాలుగోసారి. పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరుగుతుండటంతో, ప్రభుత్వ రంగ సంస్థలు ధరలను పెంచుతున్నాయి. ఎక్స్ వేదికగా ఖర్గే ప్రభుత్వాన్ని విమర్శించారు. ధరల పెంపును ఆయన నిత్య దోపిడీగా అభివర్ణించారు. కేవలం 10 రోజుల్లోనే పెట్రోల్ ధర మొత్తం రూ. 7.35, డీజిల్ ధర రూ. 7.53 మేర పెరిగిందని ఆయన ఎత్తిచూపారు. మోడీ ప్రభుత్వం సామాన్య ప్రజల పొదుపును దహించివేస్తోందని ఆయన పేర్కొన్నారు.

**యుపిఎ, బిజెపి ప్రభుత్వాల హయాంలో ఇంధన ధరలను పోల్చిన ఖర్గే**

యుపిఎ అధికారంలో ఉన్నప్పుడు, ప్రపంచ చమురు ధరలు 175 శాతానికి పైగా పెరిగినప్పటికీ, తాము దేశీయ ధరలను అదుపులోనే ఉంచామని ఖర్గే పేర్కొన్నారు.

మిగతా 2లో

# బోగస్‌కు చెక్

## తెల్లరేషన్ కార్డుల దుర్వినియోగంపై రాష్ట్ర సర్కార్ ఉక్కుపాదం

డేటా విశ్లేషణ ద్వారా ఏరివేత ముమ్మరం

తప్పుడు సమాచారంతో పొందిన కార్డులు రద్దు

ప్రభుత్వ ఉద్యోగులు, సాఫ్ట్ వేర్ ఇంజనీర్లకూ తెల్లరేషన్ కార్డులు ఉన్నట్టు నిర్ధారణ

అర్హుల కార్డులు రద్దు కాకుండా చర్యలు

అర్హులకు అన్యాయం జరగకుండా జాగ్రత్తలు

ఆదాయ పన్ను చెల్లిస్తున్న వారి కార్డులను రద్దు



**హైదరాబాద్, మే 25 (ఎఎంఎస్) :** రాష్ట్రంలో నిరుపేదలకు అందాల్సిన తెల్లరేషన్ కార్డులను దుర్వినియోగం చేస్తున్న అనర్హులపై పౌరసరఫరాల శాఖ ఉక్కుపాదం మోపుతోంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు సమాచారంతో కార్డులు పొంది ఇన్నాళ్లూ దర్జాగా రేషన్ బియ్యాన్ని, ఇతర ప్రభుత్వ సదుపాయాలను అనుభవిస్తున్న వారి కార్డుల ఏరివేత ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. అయితే ఈ తనిఖీల్లో కీలక విషయాలు వెలుగుచూశాయి. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న కొందరితో పాటు, నెలకు రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షల వరకు

మిగతా 2లో



# రైతులు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేస్తాం

మొదటి పేజీ తరువాయి

ముందుకు వెళ్తున్నామని, అందులో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన బ్రేక్‌ఫాస్ట్, భోజనం అందిస్తున్నాం తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు, ఆరుట్ల పాఠశాలను ఒకసారి సందర్శించాలని సీపీఎం నాయకులను కోరారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, పి. సుదర్శన్, జ్యోతి, నున్నా నాగేశ్వరరావు, మల్లు లక్ష్మి , సామినేని స్వరాజ్యం, ఎం. గోపాలరావు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# హైదరాబాద్ మెట్రోకు రూ.13,600 కోట్లు

మొదటి పేజీ తరువాయి

ఎల్అండ్‌టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ వందశాతం యాజమాన్యం తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ కానుందన్నారు. దీంతో హైదరాబాద్ మెట్రో రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని ప్రధాన ప్రజా రవాణా ఆస్తిగా మారనుందని చెప్పారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వం, ఐఆర్ఎఫ్‌సీ, ఎల్అండ్‌టీ, హైదరాబాద్ మెట్రో రైలు బృందాలకు సీఎస్ రామకృష్ణరావు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌కు సమర్థవంతమైన, సుస్థిరమైన ప్రజా రవాణా వ్యవస్థను విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎస్ స్పష్టం చేశారు.

# తెలంగాణవ్యాప్తంగా 37 లక్షల గృహ ఎల్‌పీజీ సిలిండర్ల పంపిణీ

**హైదరాబాద్, మే 25 (ఎఎంఎస్) :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అంతరాయం లేకుండా పెట్రోల్ (ఎంఎస్), డీజిల్ (హెచ్ఎస్‌డీ), ఎల్‌పీజీ అందుబాటులో ఉండేలా చూసేందుకు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లు.. తమ కార్యకలాపాలు, రవాణా ఏర్పాట్లను రాత్రింబవళ్లు సమన్వయం చేసుకుంటున్నాయి. వివిధ రంగాల్లో ఇంధన డిమాండ్ ఒక్కసారిగా పెరిగినప్పటికీ సరఫరా వ్యవస్థ ఎటువంటి అంతరాయం లేకుండా సాఫీగా సాగుతోంది. ముఖ్యంగా 2026 మే నెలలో తెలంగాణలో పంట కోత, వ్యవసాయ పనులు ఊపందుకోవటంతో పాటు భారీ ఎత్తున ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోంది. దీనివల్ల ఇటీవల కాలంలో చమురు ఉత్పత్తులకు డిమాండ్ గణనీయంగా పెరిగింది. ధరలు తక్కువ ఉండటంతో ప్రైవేట్ బంకుల వినియోగదారులు సైతం ప్రభుత్వ రంగ పెట్రోల్ బంకుల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ రంగ విక్రయ కేంద్రాల్లో ధరల ప్రయోజనం ఉండటంతో సంస్థాగత, వాణిజ్య వినియోగదారులు సైతం వీటి నుంచే ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. 2026 మే నెలలో తెలంగాణలో ఇంధన విక్రయాలు బలమైన వృద్ధిని నమోదు చేశాయి. సాధారణ వృద్ధి రేటు కంటే చాలా ఎక్కువగా.. డీజిల్ (రిటైల్) విక్రయాలు 12.6 శాతం, పెట్రోల్ (రిటైల్) విక్రయాలు 9 శాతం పెరిగాయి. రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో ప్రభుత్వ రంగ (పీఎస్‌యూ) పెట్రోల్ బంకుల్లో జరిగిన డీజిల్ అమ్మకాలు 25 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేయగా.. 12 జిల్లాల్లో 15 నుంచి 25 శాతం మధ్య వృద్ధి నమోదైంది. మే నెలలో చమురు మార్కెటింగ్ సంస్థలు (ఓఎంసీ) తెలంగాణవ్యాప్తంగా 37 లక్షలకు పైగా గృహావసరాల ఎల్‌పీజీ సిలిండర్లను సరఫరా చేశాయి. పెరిగిన డిమాండ్‌ను సమర్థవంతంగా అధిగమించడానికి ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు నిరంతరం నిల్వల స్థితిగతులను సమీక్షిస్తున్నాయి. దీనితో పాటు రవాణా, పంపిణీ ప్రణాళికలను అవి నిశితంగా సమన్వయం చేసుకుంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ తగినంత అందుబాటులో ఉన్నాయని వినియోగదారులకు భరోసా ఇస్తున్న చమురు పరిశ్రమ.. కేంద్ర పెట్రోలియం శాఖ, రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ నిరంతర సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేసింది. ఇంధన లభ్యతకు సంబంధించిన కచ్చితమైన తాజా సమాచారం కోసం వినియోగదారులు కేవలం అధీకృత సంస్థలు, చమురు మార్కెటింగ్ సంస్థలు (ఓఎంసీ) ఇచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాల్సిందిగా సూచన.

## 31న నాగర్‌కర్నూల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు

**27న నామినేషన్లు, 28న ఉపసంహరణ గడువు**

**షెడ్యూల్ విడుదల చేసిన జిల్లా కన్వీనర్ మాచిపెద్ది శివకుమార్**



**నాగర్ కర్నూల్, మే 25 (వుదయం ప్రతినిధి) :** నాగర్‌కర్నూల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ ఎన్నికలకు షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 31న వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్ మాచిపెద్ది శివకుమార్ సోమవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న అభ్యర్థుల నామినేషన్లు స్వీకరిస్తారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు సమర్పించవచ్చు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు పరిశీలన పూర్తిచేసి, 5 గంటలకు పోటీలో నిలిచిన అభ్యర్థుల జాబితాను వెల్లడిస్తామన్నారు. ఈనెల 28 28న ఉదయం 10 నుంచి సా యంత్రం 4 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు, అనంతరం తుది అభ్యర్థుల జాబితా విడుదల చేస్తారు. 31న పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.ఆశావాహులు 27న నిర్ణీత సమయంలో నామినేషన్లు దాఖలు చేయాలని కన్వీనర్ శివకుమార్ కోరారు.

## మహిళా సంఘం భవనా నిర్మాణానికి భూమి పూజ

**నారాయణఖేడ్, మే 25 (వుదయం ప్రతినిధి) :** నారాయణఖేడ్ మండల పరిధిలోని పిప్రీ గ్రామంలో మహిళ సంఘం భవనాన్ని భూమి పూజ చేసిన గ్రామ సర్పంచ్ మాలిపటల్ మారుతి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని అభివృద్ధి చేయడానికి ఎప్పుడూ ముందుంటానన్నాడు. ప్రభుత్వం నుండి వచ్చిన ప్రతి పనిని త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందిస్తానన్నారు. నానితో కూడిన పనులను చేసి అభివృద్ధి వైపు నడిపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, వార్డు నెంబర్లు, ఐకెపి అధికారులు, అధికారులు డ్వాక్రా మహిళ సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# ఒక్క ఇందిరమ్మ ఇల్లు నిర్మించలేదు

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తే.. హైదరాబాద్ నగరంలో 24 గంటల తాగునీటిని ప్రతి ఇంటికి సరఫరా చేస్తామని ప్రకటించారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోత, నీటి కోత తీవ్రంగా ఉండేదన్న ఆయన పట్టుదలతో 24 గంటల నిరంతర కరెంట్‌ను హైదరాబాద్ నగరానికి, రాష్ట్రానికి అందించిన విషయాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. అదేవిధంగా తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే హైదరాబాద్ నగరంలో ప్రతి ఇంటికి 24 గంటల సురక్షిత తాగునీరు అందిస్తామని తెలిపారు. దగ్గరుండి మరి హైదరాబాద్ నగరానికి 24 గంటల తాగునీటిని అందించేందుకు బాధ్యత నేను తీసుకుంటానన్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు అడ్డగోలుగా హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రతి వర్గాన్ని మోసం చేసిందన్నారు. పెన్షన్ల నుంచి మొదలుకొని.. మహిళలకు రూ.2,500 వరకు ప్రతి ఒక్క





వర్గానికి.. హామీలు ఇచ్చి మోసం చేసిందని దుయ్యబట్టారు. హైదరాబాద్ నగరానికి రెండున్నర సంవత్సరాల పరిపాలనలో కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమీ లేదన్నారు. అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా హైదరాబాద్ నగరానికి ఒక్కటంటే ఒక్క రూపాయి కూడా అదనంగా ఖర్చు చేయలేని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు. హైదరాబాద్ నగరంలో రియల్ ఎస్టేట్ పూర్తిగా కాంగ్రెస్ తోనే దెబ్బతిందనీ దీనితోని లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులకు, సెంట్రింగ్ కార్మికులకు ఉపాధి లభించకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ కార్మికులతో పాటు సెంట్రింగ్ కార్మికుల కోసం బీమాతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని కేటీఆర్ తెలిపారు. ఈసారి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం డిజిటల్ రూపంలోనే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సభ్యత్వ నమోదుకు సంబంధించిన.. కార్యక్రమం, కమిటీల ఏర్పాటు దాదాపు 50 నుంచి 60 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. సభ్యత్వ నమోదుకు సంబంధించి కూడా పార్టీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ పార్టీ తరఫున ఇస్తామని తెలిపారు.

# ధరలు పెంచి దోచుకుంటారా?



మొదటి పేజీ తరువాయి

దీనికి భిన్నంగా, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ప్రపంచ చమురు ధరలు మొత్తంగా పెరగకపోయిన ప ్పటికీ, ప్రభుత్వం మాత్రం ప్రజల నుండి అధిక ధరలను వసూలు చేస్తోందని ఆయన ఆరోపించారు. అనంతరం ఖర్గే మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం 2014లో లీటరుకు రూ. 71.41 ఉన్న పెట్రోల్ ధరలను, 2026 నాటికి లీటరుకు రూ. 102.12కు పెంచిందని పేర్కొన్నారు. ఇది 43.01 శాతం పెరుగుదల కాగా, డీజిల్ ధరలు లీటరుకు రూ. 56.71 నుంచి రూ. 95.20కి పెరిగాయని, ఇది 67.87 శాతం పెరుగుదల అని తెలిపారు. మోడీ ప్రభుత్వం గత 12 ఏళ్లుగా భారతదేశాన్ని పాలిస్తోంది. ఈ కాలంలో అది రూ. 43 లక్షల కోట్లను దోచుకుంది. అంటే రోజుకు రూ. 1000 కోట్ల చొప్పున దోపిడీకి పాల్పడింది. పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగోసారి పెరగడంతో, ఈ రోజు హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్, ఐఒసి సంస్థల షేర్లు వరుసగా 5.8%, 4.44% మరియు 3.90% మేర లాభపడ్డాయి. ప్రజల కంటే లాభాలకే ప్రాధాన్యత ఇవ్వడం బీజేపీ నైజం (డిఎన్ఎ)! అని ఆ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వ్యాఖ్యానించారు. సుదీర్ఘ విరామం తర్వాత, పెట్రోల్, డీజిల్ ధరలలో ప్రస్తుతం జరిగిన సవరణతో లీటరుకు మొత్తం రూ. 7.50 పెరుగుదల నమోదైంది. ఇది ఆర్థిక వ్యవస్థ అంతటా ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, రవాణా ఖర్చులు పెరగవచ్చనే ఆందోళనలను రేకెత్తిస్తోంది. ఈ తాజా ధరల సవరణ ఫలితంగా, ఢిల్లీలో ఇంతకుముందు లీటరుకు రూ. 99.51 ఉన్న పెట్రోల్ ధర రూ. 102.12కు పెరిగింది, అదే సమయంలో డీజిల్ ధరలు లీటరుకు రూ. 92.49 నుండి రూ. 95.20కి పెంచారు.

# మహిళా సాధికారతకు పెద్దపీట

**రూ.60 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ**

**రుణాలతో ప్రజా ప్రభుత్వం రికార్డు**

**వడ్డీ లేని రుణాల పరిమితి**

**రూ.10 లక్షలకు పెంపు**

**ఒకేసారి 8 వేల స్వయం సహాయక**

**సంఘాల భవనాలకు భూమిపూజ**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



**హైదరాబాద్, మే 25 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 8వేల సంఘాల భవన నిర్మాణాలకు వర్చువల్ విధానంలో జరిగిన భూమిపూజ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి తో కలిసి అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చారిత్రాత్మక నిర్ణయాలను వివరించారు. గతంలో మహిళా సంఘాలకు సొంత కార్యాలయాలు లేకపోవడంతో గ్రామాల్లో తీవ్ర ఇబ్బందులు పడేవారని భట్టి గుర్తుచేశారు. పంచాయతీ కార్యాలయాల్లోనో, సభ్యుల ఇళ్లల్లోనో, చివరకు స్థలం లేక చెట్ల కింద కూర్చొని సమావేశాలు నిర్వహించుకునే దుస్థితి ఉండేదన్నారు. ఈ పరిస్థితిని మారుస్తూ, మహిళలకు గౌరవప్రదమైన రీతిలో శాశ్వత భవనాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ 8 వేల కార్యాలయాల నిర్మాణం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆయన ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించినప్పుడు.. గత పదేళ్లుగా మహిళా సంఘాలను గాలికి వదిలేసిన బీఆర్ఎస్ నాయకులు హేళన చేశారని డిప్యూటీ సీఎం మండిపడ్డారు. ఏడాదికి రూ.20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్ల రుణాలు ఇప్పిస్తామని చెప్తే విపక్షాలు నవ్వాయన్నారు. "మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం అని మా నిబద్ధతతో నిరూపించాం. కేవలం రెండున్నర సంవత్సరాల కాలంలోనే ఏకంగా రూ.60,000 కోట్ల రూపాయలను బ్యాంక్ లింకేజీ ద్వారా మహిళలకు అందించి చారిత్రాత్మక రికార్డు సృష్టించాం. రాబోయే రెండున్నర ఏళ్లలో ఈ మొత్తం రూ.లక్ష కోట్లే కాదు.. రూ.1,25,000 కోట్లకు పైబడేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. మా సాధించిన ఈ విజయమే నాడు విమర్శించిన వారికి చెంపపెట్టు" అని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. మహిళా సంఘాలకు మరింత ఆర్థిక ఊతం ఇచ్చేందుకు వడ్డీ లేని రుణాల పరిమితిని పెంచుతూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని ఆయన తెలిపారు. గతంలో ఉన్న రూ.5 లక్షల పరిమితిని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కల చొరవతో రూ.10 లక్షలకు పెంచినట్లు వెల్లడించారు. ఈ నిర్ణయం పట్ల రాష్ట్రవ్యాప్తంగా మహిళల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందన్నారు./'కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం' అనే లక్ష్యం కేవలం కాగితాలకే పరిమితం కాకుండా.. దీనిపై రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ పథకానికి సంబంధించి నిర్దిష్టమైన టార్గెట్లు (లక్ష్యాలు) నిర్దేశించి, ఒక స్పష్టమైన టైమ్ క్యాలెండర్‌ను రూపొందించాలని సీఎం ఆదేశించారన్నారు. ఇది ప్రభుత్వం యొక్క సంకల్ప బలానికి, చిత్తశుద్ధికి నిదర్శనమని భట్టి విక్రమార్క కొనియాడారు.

# ఇంధనం, ఎరువులు, ఫారెక్స్ అనే 3ఎఫ్‌లపై దృష్టి సారించాలి

మొదటి పేజీ తరువాయి

సానుకూలంగానూ, పటిష్టంగానూ ఉందని కూడా మనం గుర్తించాలి, అని ఆమె అన్నారు.

*ఎక్సైజ్ సుంకం తగ్గింపుతో రూ. 1 లక్ష కోట్ల ఆదాయ నష్టం*

దేశీయ వృద్ధిని పరిరక్షించేందుకే ప్రభుత్వ విధాన ప్రతిస్పందన రూపొందించామని సీతారామన్ అన్నారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాల తగ్గింపు వల్ల రూ. 1 లక్ష కోట్ల ఆదాయ నష్టం వాటిల్లుతుందని ఆమె పేర్కొన్నారు. పెరిగిన ముడి చమురు ధరలతో పాటు, ఎరువుల ధరలు ఊహించలేని స్థాయికి పెరిగాయని, అదే సమయంలో అధిక బంగారం ధరలు విదేశీ మారకద్రవ్యాల రంగంలో కొన్ని సవాళ్లను సృష్టిస్తున్నాయని, ఇవన్నీ 3ఎఫ్‌లను విధానపరమైన దృష్టిలో కేంద్రంగా ఉంచాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతున్నాయని ఆమె అంగీకరించారు.



*నిరాశావాద కథనాన్ని తిప్పికొట్టిన ఆర్థిక మంత్రి*

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజలు సంయమనం పాటించాలని, పరోపకారం చేయాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో, నిరాశావాద, విద్వేషపూరిత కథనాన్ని ప్రచారం చేస్తున్న వ్యతిరేకులను సీతారామన్ లక్ష్యంగా చేసుకున్నారు. సామాన్య ప్రజలు స్వయంగా చేస్తున్న మంచి పనులన్నీ మర్చిపోతున్నారు. దాని స్థానంలో నిరాశావాద, విద్వేషపూరిత కథనాన్ని సృష్టిస్తున్నారు, ఇది ఎంతమాత్రం సరికాదు, అని ఆమె అన్నారు. ఈ తరుణంలో భయాందోళనలను రెచ్చగొట్టడం భారతదేశానికి ఎంతమాత్రం తగదని ఆర్థిక మంత్రి అన్నారు. భయాందోళనలను రెచ్చగొట్టడం భారతదేశానికి తగదు. మన మాటలతో, చేతలతో ప్రజలకు విశ్వాసం కలిగించాలి, అని ఆమె అన్నారు.

# బోగస్ కు చెక్

మొదటి పేజీ తరువాయి

భారీ వేతనాలు తీసుకునే సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల పేరిట కూడా తెల్ల రేషన్ కార్డులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయి ప్రత్యేకంగా కొత్త కార్డులు మంజూరు చేయించుకున్న వారిలో ఈ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అధికంగా ఉన్నారు. ఇన్నాళ్లూ వీరంతా తమ తల్లిదండ్రుల రేషన్‌కార్డుల్లో సభ్యులుగా కొనసాగడంతో వీరి అసలు వివరాలు, ఆదాయం బహిర్గతం కాలేదు. ప్రస్తుతం డేటా విశ్లేషణ ద్వారా వీరి గుట్టు రట్టవడంతో అలాంటి వారి కార్డులను అధికారులు తొలగిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన తాజా నిబంధనల ప్రకారం.. లబ్ధిదారుల వార్షిక ఆదాయం రూ. 6 లక్షల కంటే ఎక్కువగా ఉండి, ఆదాయ పన్ను చెల్లిస్తున్న వారి కార్డులను తక్షణమే రద్దు చేస్తున్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో 3.20 ఎకరాల కంటే ఎక్కువ తరి భూమి లేదా 7.20 ఎకరాల కంటే ఎక్కువ కుష్కి భూమి ఉన్న వారి రేషన్ కార్డులను కూడా ఏరివేస్తున్నారు. ప్రభుత్వ విచారణతో ఇన్నాళ్లూ లబ్ధి పొందిన అనర్హులైన కార్డుదారుల్లో ప్రస్తుతం తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.



**అర్హుల కార్డులకు భరోసా..!**

అనర్హుల ఏరివేత ప్రక్రియలో నిజమైన పేదలకు, అర్హులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం పంపిన లబ్ధిదారుల ప్రాథమిక జాబితాలో సాంకేతిక పొరపాట్లతో కొందరు అర్హుల పేర్లు కూడా నమోదయ్యాయి. వార్షిక ఆదాయం రూ. 6 లక్షలుగా తప్పుగా చూపిస్తున్న వారి వివరాలను అధికారులు క్షేత్రస్థాయిలో పునఃపరిశీలిస్తున్నారు. మరి కొందరు లబ్ధిదారులు బ్యాంకుల నుంచి వ్యాపార, వ్యక్తిగత రుణాలు పొందటం కోసం ఐటీ రిటర్న్స్‌లో లేని ఆదాయాన్ని ఉన్నట్లుగా చూపించినట్లు విచారణలో వెల్లడైంది. ఇలాంటి వారికి అధికారులు నేరుగా ఫోన్ చేసి వివరాలు సేకరిస్తున్నారు. లబ్ధిదారులు చెప్పిన సమాధానాలు, వారు సమర్పించిన పత్రాలపై విచారణ అధికారి సంతృప్తి చెందితే వారి కార్డులను యథావిధిగా కొనసాగిస్తున్నారు. అనుమానాస్పద కార్డుల విషయంలో అధికారులు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారు చెప్పిన సమాచారం వాస్తవమా కాదా అనే అంశాన్ని అన్ని కోణాల్లో ఆరా తీస్తూ నివేదికలు సిద్ధం చేస్తున్నారు.

# అంతర్ రాష్ట్ర సమన్వయంతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**హైదరాబాద్, మే 25 (వుదయం ప్రతినిధి) :** నీటి వినియోగం పై తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.రెండు రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షణకు అనుకూలంగా ఉండే విధంగా రెండు రాష్ట్రాల మధ్యన ఒడంబడిక కుదుర్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ -కర్ణాటక రాష్ట్రాల మధ్యన కృష్ణా జలాల వినియోగం,త్రాగు,సాగునీటి అవసరాలపై కర్ణాటక రాష్ట్ర చిన్ననీటి తరహా శాఖామంత్రి బోసురాజు సోమవారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో రాష్ట్ర సచివాలయంలో రోజు భేటి అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణా జలాలను రెండు రాష్ట్రాల వినియోగంపై పరస్పర అవగాహనతో స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు నిర్వహించామన్నారు. భవిష్యత్తులో అనుసరించ బోయే విధానాలు ఉభయ రాష్ట్రాలకు ప్రయోజనాకారిగే ఉండేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు భంగం వాటిల్ల కుండా ఉండేలా అనుసరించాల్సిన ప్రతిపాదనలను కర్ణాటక చిన్న నీటి తరహా శాఖామంత్రి బోసురాజు కు సమగ్రంగా వివరించినట్లు ఆయన తెలిపారు. కృష్ణా నదిపై ప్రతిపాదిత



బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించిన సాంకేతికత అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణ సాగునీటి, త్రాగునీటి హక్కులు పరిరక్షణ భవిష్యత్ అవసరాలకు అనుసరించాల్సిన విధి విధానలపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు ఆయన తెలిపారు. అంతర్ రాష్ట్ర సమన్వయంతో త్రాగునీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కారానికి రూపొందించిన ప్రతిపాదనలు కర్ణాటక ముందుంచినట్లు ఆయన చెప్పారు. కృష్ణా నది జలాశయాల వినియోగంపై జరిగిన ఉభయ రాష్ట్రాల చర్చలలో తెలంగాణా రైతాంగం సాగునీటి అవసరాలకు పూర్తి స్థాయిలో ప్రాధాన్యత ఇచ్చి చర్చించినట్లు ఆయన తెలిపారు. సాగునీటి, త్రాగునీటి విషయంలో రాష్ట్ర హక్కులకు భంగం వాటిల్లకుండా ఉభయ రాష్ట్రాలకు సానుకూలంగా ఉండే విదంగా కృష్ణా జలాల వినియోగం పై కూలంకషంగా రెండు రాష్ట్రాల మధ్య చర్చలు జాతిగాయని ఆయన తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్యన జరిగిన చర్చలను సీఎం రేవంత్ రెడ్డికి వివరించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ భేటీలో రాష్ట్ర ఎక్సయిజ్ శాఖామంత్రి జూపల్లి కృష్ణారావు, పశుసంవర్ధక, క్రీడల శాఖామంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళికా శాఖా సంఘం వైస్ చైర్మన్ జీ. చిన్నారెడ్డి రాయచూరు లోకసభ సభ్యులు జీ. కుమార్ నాయక్,నాగర్ కర్నూల్ లోకసభ సభ్యులు మల్లు రవి లతో పాటు రాయచూరు రూరల్ శాసనసభ్యులు బసన్నగౌడ ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి,మేఘారెడ్డి,శివకుమార్ రెడ్డి,వంశీకృష్ణ,రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్,సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్, ఇ. ఎన్.సి రమేశ్ బాబు,కర్ణాటక రాష్ట్ర చిన్నతరహా నీటిపారుదల శాఖా కార్యదర్శి బి.కే పవిత్ర పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ నాగేశ్వర్ ను అరెస్ట్ చేస్తే చంద్రబాబు ఇంటిని ముట్టడిస్తాం

**ఏపీ ప్రభుత్వానికి**

**టీఆర్ఎస్ చీఫ్ కవిత హెచ్చరిక**

**హైదరాబాద్, మే 25 (వుదయం ప్రతినిధి) :** ప్రొఫెసర్ నాగేశ్వర్ ను ఏపీ ప్రభుత్వం హైదరాబాద్ లో అరెస్ట్ చేయాలని ప్రయత్నిస్తోందని.. అదే జరిగితే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఇంటిని ముట్టడిస్తామని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ పై జనసేన పార్టీ, ఏపీ పోలీసులు, ఆ రాష్ట్ర ప్రభుత్వం కేసుల పేరుతో వేధింపులకు గురి చేస్తోందని సోమవారం "ఎక్స్" వేదికగా మండిపడ్డారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ కు కవిత మద్దతు ప్రకటించారు. పార్టీలకు అతీతంగా రాజకీయ విశ్లేషణలు చేసే నాగేశ్వర్ పై కావాలనే అక్రమ కేసులు బనాయిస్తూ కుట్రలు



చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ సమాజం, తెలుగు ప్రజలు ఎంతగానో గౌరవించే మేధావి, ప్రొఫెసర్ నాగేశ్వర్ పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసులు నమోదు చేసి వేధింపులకు గురి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఏపీ పోలీసులు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ ను అక్రమ కేసులతో వేధిస్తున్నారని కవిత విమర్శించారు. ఆయన విశ్లేషణలతో ఏకీభవించకపోతే ఖండించాలే తప్ప ఇలా కేసులు పెట్టటం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. గతంలో తన పై ఆయన చేసిన విశ్లేషణలను కూడా వ్యక్తిగతంగా విభేదించానని కవిత గుర్తు చేశారు. అభిప్రాయ బేధాలు ఉన్న సరే రాజ్యాంగం కల్పించిన "భావప్రకటన స్వేచ్ఛ"ను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడే విషయంలో టీఆర్ఎస్ ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడదని చెప్పారు. ఈ విషయంలో ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ కు అండగా ఉంటామని చెప్పారు. ప్రొఫెసర్ ను అరెస్ట్ చేసేందుకు ఏపీ పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తుందని... అదే గనుక నిజమైతే దీన్ని తెలంగాణ మేధావులపై ప్రత్యక్ష దాడిగా పరిగణించాల్సి ఉంటుందన్నారు. ఏపీ పోలీసుల ప్రయత్నాలకు తెలంగాణ పోలీసులు సహకరిస్తున్నారని వార్తలు వస్తున్నాయని అలాంటి ప్రయత్నాలను తెలంగాణ పోలీసులు మానుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని పరిహాసించేలా ఏపీ పోలీసులు అధికార దుర్వినియోగానికి పాల్పడితే దాన్ని తెలంగాణ ప్రభుత్వం అడ్డుకోవాలన్నారు. లేదంటే తాము హైదరాబాద్ లోని ఏపీ సీఎం చంద్రబాబు ఇంటిని ముట్టడిస్తామని కవిత హెచ్చరించారు.

**రేవంత్ రెడ్డిది అమానవీయ ప్రభుత్వం**

వడదెబ్బతో చనిపోయిన వ్యక్తి కుటుంబానికి భద్రాచలం గవర్నమెంట్ హాస్పిటల్ లో మార్చురీ వాహనం ఇవ్వకపోవటంతో కిలోమీటర్ కు పైగా మృతదేహాన్ని కుటుంబ సభ్యులు భుజాలపై మోసుకెళ్లిన సంఘటనపై కవిత తీవ్ర విచారణం వ్యక్తం చేశారు. ఇంతకన్నా అమానుషం, అమానవీయం ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల పట్ల ఎంత నిర్దయగా ఉందో ఈ ఉదంతంతో అర్థమవుతుందన్నారు.



" కృత్రిమ మేధను ఇప్పుడు నిరాయుధీకరించాలి, దానిని ఆధిపత్యం, బహిష్కరణ, మరణానికి సాధనంగా మార్చే తర్కాల నుండి విముక్తి కల్పించాలి. నైతికతను కేవలం సిద్ధాంతపరంగా ప్రస్తావించడం సరిపోదు. పటిష్టమైన చట్టపరమైన వ్యవస్థలు, స్వతంత్ర పర్యవేక్షణ, అవగాహన ఉన్న వినియోగదారులు, తన బాధ్యత నుండి వైదొలగని రాజకీయ వ్యవస్థ అవసరం. ఆ నైతికతను కొద్దిమంది నిర్ణయిస్తే, మరింత నైతికమైన కృత్రిమ మేధ సరిపోదు. అధిక లాభాల కోసం చేసే ప్రయత్నం, క్రమపద్ధతిలో ఉద్యోగాలను బలిచ్చే ఎంపికలను సమర్థించలేదు, ఎందుకంటే మానవుడు ఒక అంతిమ లక్ష్యం, సాధనం కాదు, ఆర్థిక వ్యవస్థ మానవ గౌరవానికి, ప్రజా శ్రేయస్సుకు లోబడి ఉండాలి. "

* – పోప్ లియో XIV

## వే'మన'పద్యం



రాముడొకడు పుట్టి రవికుల మీడేర్చె
కురుపతి జనియించి కులము జెరచె
ఇలను రుణ్యపాప మీలాగు కాదొకో
విశ్వదాభిరామ! వినురవేమ

# భారత్ విశ్వాసాన్ని యుఎస్ తిరిగి పొందగలదా?

భారత్–అమెరికా సంబంధాలలో అశాంతి, అనిశ్చితి నెలకొన్న తరుణంలో, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో దౌత్యంతో పాటు భరోసా ఇచ్చే లక్ష్యంతో న్యూఢిల్లీకి విచ్చేశారు. క్వాడ్ పట్ల నిబద్ధత అని ప్రచారం జరిగినా, ఈ పర్యటనకు వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం మాత్రం సుస్పష్టం. ఇటీవలి నెలల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో బలహీనపడిన వ్యూహాత్మక విశ్వాసాన్ని పునరుద్ధరించడమే. రూబియో పర్యటన సందర్భంగా ఆత్మీయత వ్యక్తమైనప్పటికీ, అనేక నిర్మాణాత్మక సవాళ్లు భారత్–అమెరికా సంబంధాలను క్లిష్టతరం చేస్తూనే ఉన్నాయి. వాటిలో మొదటిది వాణిజ్యం. ట్రంప్ ఆర్థిక విధానంలోని సంరక్షణావాద ధోరణులు ఒక ప్రధాన సమస్యగా మిగిలిపోయాయి. భారతదేశం మరింత మార్కెట్ ప్రాప్యతను, స్థిరమైన సుంకాల విధానాలను, ఆకస్మిక వాణిజ్య జరిమానాల నుండి రక్షణను కోరుకుంటోంది. మరోవైపు, అమెరికా తన వ్యవసాయ, సాంకేతిక, ఉత్పాదక రంగ ఎగుమతులకు విస్తృత ప్రవేశాన్ని కోరుతోంది. ఒక సమగ్ర వాణిజ్య ఒప్పందం కుదరకపోతే, ఆర్థిక అపనమ్మకం వ్యూహాత్మక ఏకీకరణపై నీడలా కమ్ముకోవచ్చు. రెండవ సవాలు రష్యా. భారతదేశం రష్యా చమురును కొనుగోలు చేయడం కొనసాగించడం వాషింగ్టన్‌లో ఒక సున్నితమైన అంశంగా మిగిలిపోయింది. ప్రపంచ ఇంధన అంతరాయాల కారణంగా యునైటెడ్ స్టేట్స్ తాత్కాలికంగా తన వైఖరిని సడలించినప్పటికీ, పరిస్థితులు స్థిరపడిన తర్వాత ఒత్తిడి తిరిగి రావచ్చు. అయితే, ఇంధన భద్రత, రక్షణ సరఫరాల కోసం రష్యా చాలా అవసరమని భారతదేశం భావిస్తోంది. మూడవదిగా, వలస, వీసా విధానాలు భారతీయ నిపుణులను, విద్యార్థులను ఇబ్బంది పెడుతూనే ఉన్నాయి. కఠినమైన అమెరికన్ గ్రీన్ కార్డ్, హెచ్1బి నిబంధనలు భారతదేశంలోని నైపుణ్యం గల శ్రామిక వర్గంలో అసంతృప్తిని సృష్టిస్తున్నాయి. ఈ శ్రామిక వర్గమే సాంప్రదాయకంగా ఈ రెండు ప్రజాస్వామ్య దేశాల మధ్య బలమైన వారధులలో ఒకటిగా ఉంది. నాలుగవ సవాలు వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి. భారతదేశం ఏ చైనా వ్యతిరేక సైనిక కూటమిలోనూ భాగం కావాలని కోరుకోవడం లేదు. అది కూటమి బాధ్యతలు లేని భాగస్వామ్యాలను కోరుకుంటుంది. వాషింగ్టన్ తరచుగా స్పష్టమైన వ్యూహాత్మక పొత్తును ఆశిస్తుండగా, భారతదేశం విధాన స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలని పట్టుబడుతోంది. ఈ క్రమంలో, రూబియో భారత పర్యటన చైనా, పాకిస్తాన్ రెండింటికీ స్పష్టమైన భౌగోళిక రాజకీయ సందేశాన్ని కూడా అందించింది. చైనా విషయానికొస్తే, తాత్కాలిక హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ, ఇండో–పసిఫిక్‌లో భారతదేశ వ్యూహాత్మక పాత్రను బలోపేతం చేయాలనే ఉద్దేశం వాషింగ్టన్‌కు ఇప్పటికీ ఉందని ఈ పర్యటన పునరుద్ఘాటించింది. భారతదేశం మూలస్తంభం అని రూబియో పదేపదే నొక్కి చెప్పడం పాక్షికంగా బీజింగ్‌ను ఉద్దేశించినదే. సరఫరా గొలుసులు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, సముద్ర భద్రత వంటి రంగాలలో భారత్–అమెరికా మధ్య మరింత సన్నిహిత సహకారం చైనా ప్రాంతీయ ఆకాంక్షలను నేరుగా ప్రభావితం చేస్తుంది. మరోవైపు, పాకిస్తాన్ మరింత సంక్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఇరాన్ సంక్షోభ సమయంలో ఇస్లామాబాద్‌తో వాషింగ్టన్ ఇటీవల జరిపిన సంప్రదింపులు నిస్సందేహంగా పాకిస్తాన్ వ్యూహాత్మక ప్రాముఖ్యతను పునరుద్ధరించాయి. కానీ, న్యూఢిల్లీని దూరం చేసుకోవడం ద్వారా పాకిస్తాన్ పునరుద్భవం జరగాలని అమెరికా కోరుకోవడం లేదనే విషయాన్ని రూబియో భారత పర్యటన స్పష్టం చేసింది. అంతిమంగా, భారత్–అమెరికా సంబంధాలలో స్పష్టంగా కనిపిస్తున్న దూరాన్ని తగ్గించడంలో రూబియో పర్యటన విజయవంతం కావచ్చు, కానీ అది అంతర్లీన వైరుధ్యాలను తొలగించలేదు. నేటి ఈ సంబంధం భావోద్వేగపూరిత వ్యూహాత్మక ఏకీకరణ కన్నా పరస్పర అవసరంతోనే ఎక్కువగా నడుస్తోంది. ఆసియాలో చైనాను సమతుల్యం చేయడానికి అమెరికాకు భారతదేశం అవసరం కాగా, భారతదేశానికి అమెరికా సాంకేతికత, పెట్టుబడులు, భౌగోళిక రాజకీయ మద్దతు అవసరం. అంతకంతకూ అస్థిరంగా మారుతున్న ప్రపంచ క్రమంలో, ఈ లావాదేవీల ఏకీకరణను దీర్ఘకాలిక వ్యూహాత్మక విశ్వాసంగా మార్చగలరా లేదా అన్నదే ఇరు దేశాల ముందున్న సవాలు. సంక్షిప్తంగా చెప్పాలంటే, వాణిజ్యం, ఇంధనం, భద్రత వంటి ఉమ్మడి ప్రయోజనాలను ఉపయోగించుకుని సంబంధాలను చక్కదిద్దే క్రమంలో, రూబియో పర్యటన అమెరికా–భారత సంబంధాలలో ఒక ఆచరణాత్మక పునఃప్రారంభానికి నాంది పలికింది. ఈ ఫలితాలు క్వాడ్ కూటమికి ఊపునిచ్చినప్పటికీ, దీర్ఘకాలిక సవాళ్లను జాగ్రత్తగా ఎదుర్కోవాలని సూచిస్తుంది. ఈ విజయం మెరుగైన ఆర్థిక స్థితిస్థాపకత, మరింత స్థిరమైన ఇండో–పసిఫిక్ వ్యవస్థ ద్వారా ఇరు దేశాలకు ప్రయోజనం చేకూరుస్తుంది. దీని ప్రభావం ప్రత్యర్థుల ఎత్తుగడలను కట్టడి చేస్తుంది. ఈ మరమ్మతు ఒక శాశ్వతమైన, అధిక విశ్వాసం గల భాగస్వామ్యంగా రూపుదిద్దుకుంటుందా లేదా అనేది రాబోయే నెలల్లో తెలుతుంది.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

*బొద్దింకలను చూసి భయపడుతున్న 56 అంగుళాల ఛాతి ! అభిజిత్ దెబ్బ నుంచి పార్టీలు నేర్చుకోవాల్సిన పాఠాలేమిటి !!*

# అసంబద్ధ వాదనలు, అడ్డగోలు మాటలు

ఇప్పటి వరకు బొద్దింకలను చూసి కొంత మంది ఎలా భయపడతారో చూశాం గానీ ఇప్పుడు ఆ పేరును చూసి కళవళపడుతున్న రాజకీయ పార్టీలను చూస్తున్నాం. ఇలాంటి రోజు వస్తుందని ఎవరైనా ఊహించారా ! ఫాసిజం మరోమారు తలెత్తుతున్నదంటే హిట్లర్, ముస్సోలినీ, టోజో వంటి దుర్మార్గులే తిరిగి జన్మించారని కాదు. వారి వారసులు ప్రజాస్వామ్య వేషాలతో మనమధ్య తిరిగే వారే ఆపని చేస్తున్నారు.లేకపోతే బొద్దింకల జనతా పార్టీ (సిజెపి) ఎక్స్ ఖాతా నిలిపివేయటం ఏమిటి ! దాని ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను ఖరాబు చేశారు, చివరికి వెబ్‌సైట్‌లో ఇప్పుడు ఆ పేజీని కూడా కనపడకుండా చేశారు. అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఎలా ఆపలేరో దీన్ని కూడా అంతే. ఇలాంటి చేష్టలతో యువతను మరింతగా రెచ్చగొట్టటం, సిజెపికి మద్దతుదార్లను పెంచటం తప్ప మరొకటి కాదు. ఇది నిరంకుశ చర్య అని ఉద్యమాన్ని ప్రారంభించిన అభిజిత్ డిప్కే వ్యాఖ్యానించాడు. సామాజిక ఉద్యమనినాదం రూపంలో ఉన్న ఆ పార్టీ ముందుకు తెచ్చిన ఐదు అంశాలు దేశంలో ఉద్రిక్తతలను రెచ్చగొట్టేవిగా ఉన్నాయట, ఆ విషయాన్ని కేంద్ర ఇంటిలిజెన్స్ బ్యూరో (ఐబి) ప్రభుత్వానికి నివేదించిందట, దేశ రక్షణ కోసం సదరు సిజెపి సామాజిక మాధ్యమ ఎక్స్ ఖాతాను మోడీ సర్కార్ నిలిపివేయించిందట. నేపాల్లో అధికారంలో ఉన్న పార్టీ సామాజిక మాధ్యమాలపై విధించిన ఆంక్షలే తమకు నష్టం అని భావించిన పాలకపార్టీ ఆంక్షలు పెట్టింది, దానిపై యువత ఎలా స్పందించిందో చివరికి అధికార మార్పిడికి దారితీయటాన్ని ప్రపంచం చూసింది. చరిత్రలో మోడీ మరొక పేజీకి నాంది పలికారా ? భారత్‌లో నిషేధాలు, ఇతర చర్యలతో సిజెపి పేజీలను అడ్డుకోవచ్చు, కానీ విదేశాల్లో చేరే అనుచరులను మోడీ అడ్డుకోగలరా ? ప్రపంచవ్యాపితంగా మోడీ పలుకుబడి గురించి బిజెపి గొప్పలు చెప్పుకుంటుంది. అలాంటి మోడీ పాలనలో యువత గురించి దేశ అత్యున్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలు, దేశంలో ఉన్న స్థితిగతుల గురించి విదేశాల్లో ఉన్నవారికి ఆసక్తి కలిగినట్లు ఈ పరిణామం స్పష్టం చేస్తోంది. ఇదీ ఒకందుకు మంచిదే. మోడీ ప్రజాస్వామ్య బండారం ప్రపంచానికి తెలుస్తుంది. విమర్శకుల సంగతి సరే, మోడీని అభిమానించే వారందరూ మతోన్మాదులు లేదా మరొకరో అనుకోనవసరం లేదు. ప్రజాస్వామిక ప్రియులకు ఈ వార్త వీనుల విందుగా ఉందా ? ఈ పరిణామాలను జీర్ణించుకోగలుగుతున్నారా !!

ఇంతకూ సిజెపి తన అజెండాలో ప్రకటించిన అంశాలేమిటి ? పదవీ విరమణ చేసిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులను రాజ్యసభకు పంపకూడదు, తొలగించిన ఓట్లకు గాను ఉపా చట్టం కింద కేంద్ర ఎన్నికల కమిషన్‌పై విచారణ, మహిళలకు 55శాతం రిజర్వేషన్లు, ఓట్ల తొలగింపును ఎన్నికల కమిషన్ నిర్ణీత వ్యవధిలో జరపాలి, భారతీయ యువతకు రాజకీయ విద్యగరపాలి.పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారిని దీర్ఘకాలం ఎన్నికల్లో పాల్గొనివ్వకూడదు. ఆసక్తి కలిగిన వారు ఆ పార్టీ వెబ్‌సైట్ అందుబాటులోకి వస్తే లేదా వేరే రూపంలో తిరిగి ప్రారంభమైతే ఈ అంశాల మీద వారి వివరణను చదువుకోవచ్చు.ఈ అజెండాను ఎవరైనా అందరూ ఆమోదించాలనేమీ లేమీ లేదు, అది వారికి ఉన్న హక్కు. అలాగే సమర్థించటానికీ హక్కు ఉంది. దానిలో రెచ్చగొట్టే అంశాలేమున్నాయి, వాటితో దేశ భద్రతకు వచ్చిన ముప్పేమిటి ? వెంపలి చెట్లకు నిచ్చెనవేసుకు ఎక్కేవారు పుడతారన్నట్లుగా పోతులూరి వీరబ్రహ్మం చెప్పారని ప్రచారంలో ఉంది. అది నిజమో కాదో తెలియదు గానీ కేంద్ర ప్రభుత్వం తలచుకుంటే ఏ నివేదిక కావాలంటే దాన్ని క్షణాల్లో తెప్పించుకోవచ్చు, ఇడి, ఐటి, సిబిఐతో పాటు దేశ భక్తిని గుత్తకు తీసుకున్నామని చెప్పేవారి దాడులు కూడా ఎవరిమీదైనా ఎప్పుడైనా జరగవచ్చు.

సిజెపి సృష్టికర్త అభిజిత్ దిప్కే గురించి టీవీ చర్చల్లో, సామాజిక మాధ్యమాల్లో బిజెపివారు ధ్వజమెత్తుతున్నారు. మూడు పదుల వయస్సున్న ఆ యువకుడి వెనుక బిజెపిని వ్యతిరేకించే అన్ని పార్టీలు, శక్తులు ఉన్నాయని, కుట్ర చేశాయని బిజెపి నేతలు దేశభక్తి గీతాలాపన ప్రారంభించారు. పందుగాడి దెబ్బ తగిలి మైండ్ బ్లాంక్ అయినవారు తప్ప మరొకరు ఇలా మాట్లాడరు.సిజెపి ఎక్స్ ఖాతాను అనుసరించేవారు కోట్లలో ఉండటంతో బిజెపి తట్టుకోలేకపోయింది.భారత్‌ను వ్యతిరేకించే దేశాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో అనుసరించుతున్నారని, వారంతా భారతీయులు కాదని ఇదంతా కుట్రలో భాగంగా జరుగుతోందని బిజెపి ప్రతినిధులు టీవీ చర్చల్లో చెబుతున్నారు.బోడి గుండుకు మోకాలికి ముడిపెట్ట గల సమర్థులకు మాత్రమే ఇలా మాట్లాడటం సాధ్యం. తమ నేత, పార్టీకి విదేశాల్లో కూడా అనుచరులు పెద్ద సంఖ్యలో ఉన్నారని కాషాయ నేతలు గొప్పలు చెప్పుకోవటాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి. సామాజిక మాధ్యమ ఖాతా అంటే ఒక బ్యాంకు ఖాతా వంటిది కాదు. ప్రపంచంలో ఇంటర్నెట్ సౌకర్యం ఉన్నవారెవరైనా ఎక్కడి నుంచైనా చేరవచ్చు. ఉచితం ఉన్నాయి, డబ్బు వసూలు చేసేవీ ఉన్నాయి.కుట్ర అంటే చేతివేళ్ల మీద లెక్కించ చదగిన వారు చేసేది తప్ప కోట్లాది మంది భాగస్వాములు అవుతారా ? మోడీ, బిజెపి, కాంగ్రెస్ సామాజిక మాధ్యమ ఖాతాను అనుసరించేవారిలో ఎక్కువ మంది నకిలీలే అనే అభిప్రాయం ఉంది, గొప్పలు చెప్పుకొనేందుకు పార్టీలు, వ్యక్తులు అలాంటి చర్యలకు పాల్పడతారు.లోకోభిన్న రుచి అన్నట్లుగా సినితారలు, ఇతర ప్రముఖులను అనుసరించేవారు కూడా పెద్ద సంఖ్యలో ఉండే సంగతి తెలిసిందే.

అసలు మే 15వ తేదీ ఒక కేసు విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ వివాదాస్పద బొద్దింకలు, పరాన్న జీవుల వ్యాఖ్యలు చేయటం, మరుసటి రోజునే అభిజిత్ బొద్దింకల జనతా పార్టీ అంటూ వ్యంగ్యాస్త్రంతో సామాజిక మాధ్యమంలో పోస్టు పెట్టటం, లక్ష నుంచి కోట్ల సంఖ్యలో అనుచరులు చేరటం అంతా మూడు నాలుగు రోజుల్లోనే జరిగిపోయింది. బిజెపి వారు చెప్పేదాన్ని బట్టి కుట్ర ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలకు ముందే రూపొంది ఉండాలి.సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలు చేయటం కూడా కుట్రలో భాగం అయి ఉండాలి. లేకపోతే ఎలా సాధ్యం. ఒక నేత ఫలానా రోజు ఫలానా ప్రాంతంలో పర్యటిస్తారని ముందే ప్రకటిస్తారు గనుక తెలుస్తుంది తప్ప ఏ సెలవిస్తారో ఊహించగలరా ? ఆ రోజు ఫలానే కేసు విచారణకు వస్తుందని తెలియవచ్చు ప్రధాన న్యాయమూర్తి అలాంటి వివాదాస్పద మాటలు మాట్లాడతారని కుట్రదారులకు ముందే తెలుసా ? బొద్దింకల జనతా పార్టీ పోస్టులను పెట్టగానే అనుచరులుగా మారండని కోట్లాది మందికి ముందుగానే వర్తమానాలు పంపుతారా ? ఆరోపణలు చేసే ముందు తర్కానికి అవి నిలిచేవిగా ఉండాలి. వారు చెప్పేదాని ప్రకారం సుప్రీం కోర్టు ప్రధాన న్యామూర్తి కూడా బిజెపి వ్యతిరేక కుట్రలో భాగమే అనుకోవాలి.తల మీద మెదడు ఉన్నవారెవరూ






ఇలా చెప్పరు. నిజంగా కుట్ర జరిగిందని నమ్మితే కేంద్ర ప్రభుత్వం విచారణ జరిపి నిజా నిజాలను నిగ్గుతేల్చాలి. ఆపని చేయలేదు. తాను అలాంటి వ్యాఖ్యలను యువతమొత్తాన్ని ఉద్దేశించి చేయలేదని ప్రధాన న్యాయమూర్తి వివరణ ఇచ్చుకున్నప్పటికీ ఎవరూ దాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. ఆయన అంతరంగంలోంచి వచ్చిన అవాంఛనీయ వ్యాఖ్యలుగానే చూస్తున్నారు.ఎందుకంటే ఫిబ్రవరి నెలలో కార్మిక సంఘాలను కూడా ఆయన ఇదే విధంగా తూలనాడారు. ఇటీవలి కాలంలో హైకోర్టు, సుప్రీం కోర్టులలో అనేక మంది న్యాయమూర్తులు తీర్పులతో సంబంధం లేని వ్యాఖ్యలు చేస్తూ మీడియాలో సంచలనాలకు కారకులౌతున్నారు.గతంలో ఇలా ఉండేవారు కాదు. తాము నిరుద్యోగులుగా ఉన్నందున శారీరకంగా సోమరిపోతులం తప్ప మెదళ్లు పనిచేస్తూనే ఉన్నాయని కూడా సిజెపి వ్యంగ్యాస్త్రం విసిరింది. ఇది ఎంత మంది పెద్దలకు అర్థం అవుతుందో తెలియదు.

సిజెపిని ముందుకు తెచ్చిన అభిజిత్ అమెరికాలో ఉండి ఇదంతా చేస్తున్నాడని, గతంలో ఆమ్ ఆద్మీపార్టీలో పని చేశాడని బిజెపి నేతలు ధ్వజమెత్తుతున్నారు.ఎక్కడ ఉండి చేశారు, చేస్తున్నారని కాదు, ఏం చేశారనేదే ముఖ్యం. లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ అమెరికాలో విద్యార్థిగా ఉండగానే రాజకీయాల్లోకి వచ్చారు. అక్కడే 1923లో అమెరికా హిందూస్థాన్ అసోసియేషన్ సభకు అధ్యక్షత వహించాడు. తరువాత ఆరేండ్లకు భారత్ వచ్చి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. సంఘపరివార్ ఆరాధించే విడి సావర్కర్ లండన్‌లో చదువుకొనేందుకు వెళ్లి అక్కడ రాజకీయాల్లో పాల్గొన్నారు. ఇలా చెప్పుకుంటే ఎందరో. అభిజిత్ దిప్కే వయస్సు మూడు పదులు, 2023లో చదుకొనేందుకు అమెరికా వెళ్లాడు,అక్కడి నుంచే స్పందించాడు. తప్పేముంది, భారత్‌ను యావత్ ప్రపంచానికి విశ్వగురువుగా మారుస్తామని బిజెపి నేతలు చెబుతారు. ప్రపంచ కుగ్రామంలో అతను అమెరికా అనే పేటలో ఉండటం నేరం కాదు. అలా అనుకుంటే అనేక మంది అమెరికా, ఇతర దేశాల్లో ప్రవాస భారతీయులు హిందూ సంస్థలు, సంఘపరివార్ సంస్థలను ఏర్పాటు చేసి కోట్లాది డాలర్లను బిజెపికి అందిస్తున్నారు. వారంతా స్వదేశం వచ్చి ఆ పని చేయాలని బిజెపి వారు అడగటం లేదేం ? దళితులు, రిజర్వేషన్ల సమస్యల గురించి ఒక నెటిజన్ అభిజిత్‌ను ప్రశ్నిస్తే తానే ఒక దళితుడనని చెప్పాడు. ఇంకేముంది ప్రతిభకు పట్టం గట్టటాన్ని వ్యతిరేకిస్తారని, దళితకార్డు వాడుకుంటున్నారంటూ కొందరు ధ్వజమెత్తుతున్నారు.బరాబర్ హిందూమతం కోసం పని చేస్తాం, కరడు గట్టిన సనాతన వాదులం అంటూ వీరంగం వేస్తున్నమాదిరి అతన తన సామాజిక తరగతిని ముందుగా వెల్లడించలేదు. అన్నింటికీ మించి అతనేమీ రిజర్వేషన్ సౌకర్యంతో అమెరికా వెళ్లలేదు. తెలివితేటలు ఎవడబ్బ సొమ్ము కాదు, బలహీనవర్గాలకు తెలివితేటలు ఉండవా ! స్వయంకృషితో ఎదిగిన అంబేద్కర్ జన్మించిన గడ్డ మీద అభిజిత్ పుట్టాడు. ఒక మేధావి, సంస్కరణ వాదిగా, మనుధర్మ వ్యతిరేకిగా అనేక మందికి అంబేద్కర్ స్ఫూర్తి ప్రదాతగా ఉన్నారు. దళితులను సామాజికంగా ఎలా వేధిస్తున్నారో నిత్యం చూస్తున్నాం, అలాంటి వారి భావజాల వారసులు ఇప్పుడు అభిజిత్‌ను కూడా అవమానించేందుకు పూనుకున్నారు. ఇది మనువాదులకు మరింత మంది వ్యతిరేకులను తయారు చేస్తుంది, తెలిసో తెలియకో వారిని అనుసరిస్తున్న దళితులు, అణచివేతకు గురైన గిరిజనులు, ఇతర బలహీనవర్గాలు కూడా తామెటు ఉండాలో నిర్ణయించుకొనేట్లు చేస్తుంది, ఇప్పటికిప్పుడు మార్పురాకపోవచ్చు, ఆలోచన మొదలైతే చాలు ఆచరణ ఎలా ఉండాలో తెలుస్తుంది. సిజెపిని వదలి బిజెపిలో చేరాలని లేకపోతే నీ తలిదండ్రులు ఎక్కడ ఉన్నారో కూడా తెలుసు అంటూ బెదిరింపులు కూడా వచ్చాయి.ఇది అనూహ్యమేమీ కాదు. కేంద్ర ప్రభుత్వ విధానాలను విమర్శించటం, ప్రశ్నించటాన్ని దేశద్రోహంగా చిత్రించి దాడులు చేయటం తెలిసిందే, అభిజిత్ భారత్‌కు తిరిగి వస్తే అదే జరుగుతుందా ? చూద్దాం ! దేశంలో సమస్యలు, సంక్షోభం తలెత్తినపుడు యువత స్పందిస్తూనే ఉంది.కాంగ్రెస్ పార్టీలో చీలిక వచ్చిన తరువాత జరిగిన 1971లో జరిగిన తొలి లోక్‌సభ ఎన్నికల్లో ఇందిరా గాంధీ నాయకత్వంలోని పార్టీ 352 సీట్లతో అఖండ మెజారిటీ సాధించింది, అప్పుడు సిపిఐ(ఎం) 25 సీట్లతో పెద్ద ప్రతిపక్ష పార్టీగా ఎన్నికైంది. వాజ్‌పాయి నాయకత్వంలోని భారతీయ జనసంఘం 35 సీట్ల నుంచి 22కు పడిపోయింది. ఆ ఎన్నికల్లోనే ఇందిరాగాంధీ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారనే కేసు రుజువు కావటంతో 1975లో అత్యవసర పరిస్థితిని ప్రకటించిన సంగతి తెలిసిందే. అంతకు ముందు రెండు సంవత్సరాల ముందు, గుజరాత్, బీహార్‌లో ధరల పెరుగుదల, కాంగ్రెస్ అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమాలు ప్రారంభమై ఇందిరా గాంధీని ఇరుకున పెట్టాయి.1977 ఎన్నికల్లో ఇందిరా గాంధీ కూడా ఎన్నికల్లో ఓడిపోయి జనతా పార్టీ అధికారానికి వచ్చింది. ఆ సమయంలో యువకులుగా రంగంలోకి వచ్చిన అనేక మంది తరువాత కాలంలో వివిధ పార్టీల నేతలుగా ఎదిగారు. బొద్దింకల జనతా పార్టీ ప్రస్తుతానికి సామాజిక మాధ్యమ ఉద్యమంలో భాగం తప్ప భౌతిక ఉనికిలో లేదు. పార్టీని నమోదు చేస్తారో లేదో తెలియదు. ఒక సంచలనం. గతంలో ఎన్‌టి రామారావు ఆంధ్రప్రదేశ్‌లో, తాజాగా విజయ్ తమిళనాడులో సృష్టించిన ప్రభంజనంలో యువత ప్రముఖ పాత్రపోషించిన సంగతి తెలిసిందే.యువత మార్పును కోరుతున్నారు. సాంప్రదాయ పార్టీలు చేసిన మోసాలు, వాగ్దాన భంగాలతో విసిగిపోయి ఉన్నారు.తీవ్రమైన రాజకీయ, సామాజిక అంశాలను వ్యంగ్యంగా ముందుకు తెచ్చినట్లు కొందరు తప్పుపడుతున్నారు. పిల్లి నల్లదా తెల్లదా అని కాదు, ఎలుకలను పడుతుందా లేదా అన్నదే గీటురాయి. జనం దృష్టిని ఆకర్షించటంలో నవరసాలు ఉంటాయి, వాటిలో హాస్యం, వ్యంగ్యం ఒకటి.కొన్ని సందర్భాల్లో తీవ్రమైన సమస్యల గురించి చెబితే జనంలో ఎలాంటి స్పందన ఉండటం లేదు. అందుకని ఏ రూపాన్ని ఎంచుకున్నారన్నది కాదు, యువత, ఇతర తరగతులను కదిలించాడా లేదా అన్నదే గీటురాయిగా ఉండాలి. ఇదేదో కొంపముంచేట్లుంది చూడండయ్యా అన్నట్లుగా కేంద్ర మంత్రివర్గ సమావేశాలో నరేంద్రమోడీ చివాట్లు వేశారన్న వార్తలు వచ్చాయి, యాభైఆరు అంగుళాల ఛాతికి ఏదో జరగకుండా అది జరుగుతుందా ! కాంగ్రెస్, బిజెపి, వాటిని ఆదరించిన డిఎంకె, అన్నాడిఎంకె పార్టీలు విజయ్ దెబ్బను చవిచూశాయి. అందుకే ఇప్పటివరకు సినిమాలో పండుగాడి దెబ్బతో పోలిక బదులు ఇప్పుడు దేశవ్యాపితంగా రాజకీయంగా అభిషేక్ దెబ్బ గురించి చెప్పుకోవాల్సి వస్తోంది !



ఎం కోటేశ్వరరావు
8331013288

# నిప్పు గొడుగు



ధరణి గుండెల్ని చీల్చేస్తూ
పడింది సూర్యుడి తొలి అడుగు
ఆకాశపు నడిబొడ్డున
విచ్చుకుంది నిప్పు గొడుగు

అగ్ని బాణాలకు
నదీ చైతన్యం ఆగిపోయింది
పచ్చదనమంతా
వెలిసిపోయింది

కత్తులు నూరుతున్నట్లుగా
వీస్తోంది కటిక వేడిగాలి

నిప్పు గొడుగు కింద జీవం
ఊపిరికై పోరాడుతోంది
కాలం పెట్టే ఈ అగ్ని పరీక్ష కు
రేపటి ని శాసిస్తూ
సృష్టి సాగుతోంది
వర్షపు చినుకు కై ఎదురు చూస్తూ
కొత్త జీవన రాగాన్ని ఆలాపిస్తూ –

మండాది గోపీనాథ్
ముక్కుడు దేవులపల్లి
98850 45344

# ఆధునిక మహిళ : అస్తిత్వ పోరాటం - అంతర విప్లవం

మహిళ అంటే త్యాగానికి ప్రతిరూపమో, ఓరిమికి నిలువెత్తు నిదర్శనమో అని పొగిడే సంప్రదాయ పడికట్టు పదాల కాలం దాటిపోయాం. నేడు మహిళలు కార్పొరేట్ సామ్రాజ్యాలను శాసిస్తున్నారు, అంతరిక్షంలోకి రాకెట్లను పంపుతున్నారు, సరిహద్దుల్లో తుపాకులు పట్టి దేశాన్ని రక్షిస్తున్నారు. సమాజం ఈ బాహ్య మార్పును చూసి 'ఆధునిక మహిళ' అని మురిసిపోతోంది. కానీ, ఈ బాహ్య విజయాల వెనుక ఎంతటి మానసిక సంఘర్షణ ఉందో, సమాజం ఆమెపై మోపుతున్న కొత్త బాధ్యతల బరువు ఎంతలా నలిపేస్తోందో విశ్లేషిస్తే కానీ అసలు సత్యం బోధపడదు.

బాహ్య ప్రపంచంలో సాధిస్తున్న విజయాలు, సంపాదిస్తున్న హోదాలు కేవలం ఒక సామాజిక మార్పు మాత్రమే కాదు, అవి ఆమె అంతరంగంలో జరుగుతున్న ఒక విప్లవాత్మక అస్తిత్వ పరిణామం. ఒక వైపు శతాబ్దాల నాటి అణచివేత సంస్కారాలు, మరోవైపు ఆధునికత తెచ్చిన అపరిమిత స్వేచ్ఛ, ఈ రెండింటి మధ్య నలిగిపోతున్న నేటి మహిళా అంతరంగంలో ఒక తీవ్రమైన సైకలాజికల్, ఫిలాసఫికల్ యుద్ధం నడుస్తోంది.

మనోవిజ్ఞాన శాస్త్రం ప్రకారం ప్రతి మనిషి ప్రవర్తన వెనుక శతాబ్దాలుగా సమాజం వారి మైండ్‌లో నింపిన 'కండిషనింగ్' (సామాజిక సంస్కారాలు) ఉంటుంది. స్త్రీ అంటే త్యాగం చేయాలి, అణిగిమణిగి ఉండాలి, ఇతరుల ఆనందంలోనే తన ఆనందాన్ని వెతుక్కోవాలి అని చిన్నతనం నుంచే మనసు పొరల్లోకి ఎక్కించారు. కానీ ఇవాళ ఆధునిక విద్య, ఆర్థిక స్వేచ్ఛ... "నువ్వు కూడా ఒక స్వతంత్ర వ్యక్తివి, నీకూ కలలు ఉన్నాయి" అని ఆమెకు గుర్తుచేశాయి. ఇక్కడే అసలు ఘర్షణ మొదలైంది. ఆధునికత మహిళకు ఆర్థిక స్వేచ్ఛను ఇచ్చింది కానీ, పాత సామాజిక చట్రాల నుంచి విముక్తిని ఇవ్వలేదు. ఫలితంగా నేటి వర్కింగ్ ఉమెన్‌పై 'డబుల్ డ్యూటీ' భారం పడింది. ఆఫీసులో ఎనిమిది గంటలు మెదడుకు పదును పెట్టి, టార్గెట్లను రీచ్ అయి ఇంటికి రాగానే... మళ్లీ వంటింట్లోకి దూరి వంటపని, ఇల్లు సర్దడం, పిల్లల చదువులు, వృద్ధులైన అత్తమామల లేదా తల్లిదండ్రుల సంరక్షణ అన్నీ ఆమె బాధ్యతలే అవుతున్నాయి. సమాజం మహిళకు 'సూపర్ ఉమెన్' అనే ఒక అద్భుతమైన బిరుదు తగిలించి చేతులు దులుపుకుంది. అటు ఉద్యోగంలోనూ 'నెంబర్ వన్' గా ఉండాలి, ఇటు ఇంట్లోనూ 'ఆదర్శ గృహిణి' గా మార్కులు కొట్టేయాలి. ఈ రెండు పాత్రల మధ్య సమతూకం కుదరక, తనను తాను నిరూపించుకునే తాపత్రయంలో నేటి మహిళ తీవ్రమైన మానసిక ఒత్తిడికి, అలసటకు లోనవుతోంది. మమ్మల్ని దేవతలుగా పూజించవద్దు, సూపర్ ఉమెన్‌గా అలిసిపోయేలా చేయవద్దు... కలలు, పరిమితులు ఉన్న సాధారణ మనుషులుగా చూడమని మాత్రమే మహిళా లోకం కోరుకుంటోంది. దీనికి తోడు, ఒక ఆధునిక వర్కింగ్ ఉమెన్ తను ఉద్యోగంలో ఎంత ఎదిగినా, ఇంటి వద్ద పిల్లలకు కొద్ది సమయం కేటాయించలేకపోయినా తీవ్రమైన 'గిల్ట్' (నేరభావన) కు లోనవుతోంది. ఇది సమాజం ఆమె మనసుపై రుద్దిన ఒక సైకలాజికల్ ట్రాప్. ఎంత ప్రతిభ చూపించినా, ఉన్నత పదవుల పెంపకంలో అలిఖిత వివక్ష ఎదురవుతూనే ఉంది. పెళ్లి, ప్రసవం అనేవి ప్రకృతి సహజమైన మైలురాళ్లు. కానీ, కార్పొరేట్ ప్రపంచం వీటిని కెరీర్‌కు పడిన 'బ్రేకులు' గా చూస్తోంది. ప్రసవం తర్వాత ఉద్యోగంలోకి తిరిగి వచ్చే క్రమంలో ఎంతోమంది మహిళలు తమ సీనియారిటీని, అర్హత గల పదవులను కోల్పోవాల్సి రావడం వ్యవస్థాగత లోపానికి నిదర్శనం.

తాత్విక కోణంలో చూస్తే, సమాజం స్త్రీని ఎప్పుడూ ఒక తీవ్రమైన అతివాదంలోనే చూసింది. అయితే ఆమెను లక్ష్మి గా, సరస్వతిగా, దుర్గగా 'దేవత'ను చేసి పీఠం మీద కూర్చోబెట్టింది, లేదా కేవలం ఒక భోగవస్తువుగా, శ్రామికురాలిగా చూసింది. కానీ, ఈ రెండు కోణాల్లోనూ ఆమెకు దక్కనిది ఒకటే: "మనిషిగా గుర్తింపు".

ప్రముఖ తత్వవేత్త ఓషో అన్నట్టు—"స్త్రీ, పురుషులు ఇద్దరూ ఒకే సృష్టి యొక్క రెండు సమాన శక్తులు. ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ కాదు." స్త్రీ సాధికారత అంటే పురుషుడిపై ఆధిక్యత సాధించడం కాదు, లేదా పురుషుడిలా మారిపోవడం కాదు. స్త్రీ తనలోని సహజసిద్ధమైన 'స్త్రీత్వాన్ని' కోల్పోకుండానే తన అస్తిత్వాన్ని చాటుకోవడం.

ఇక సాంప్రదాయ సమాజం స్త్రీని 'డిపెండెంట్' (ఆధారపడేదానిగా) గా చూసింది. నేటి ఆధునికత ఆమెను 'ఇండిపెండెంట్' (స్వతంత్రురాలిగా) మార్చింది. కానీ, పరమ సత్యం ఎక్కడుందంటే పరస్పర సహకారంలో ఉంది. ప్రకృతిలో ఏదీ ఒంటరిగా మనలేదు. భార్యాభర్తలు లేదా స్త్రీపురుషులిద్దరూ ఒకరికొకరు పూరకాలు కావాలి తప్ప, పోటీదారులు కాకూడదు. మరోవైపు, టెక్నాలజీ పెరిగి ప్రపంచం చేతిలోకి వచ్చాక భద్రతకు కొత్త ముప్పులు వచ్చాయి. సోషల్ మీడియాలో ట్రోలింగ్, డీప్‌ఫేక్ టెక్నాలజీతో ఫోటోల మార్ఫింగ్, సైబర్ వేధింపులు ఆధునిక మహిళను నిరంతరం భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పూర్వం వీధిలోకి రావడానికి భయపడే పరిస్థితి ఉంటే, నేడు స్మార్ట్‌ఫోన్ ఆన్ చేయాలన్నా గుండె జారే వాతావరణం కనిపిస్తోంది. ఇది శారీరక భద్రత కంటే ఆమె మానసిక ప్రశాంతతను, ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోంది. ఈ సమస్యలన్నింటికీ కేవలం చట్టాలు, కోర్టులు మాత్రమే పరిష్కారం చూపలేవు. మూలాల్లో మార్పు రావాలి. సమస్య మనస్సులో, ఆలోచనలో ఉన్నప్పుడు పరిష్కారం కూడా అక్కడే వెతకాల్సిన అవసరం ఉంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఆధునిక మహిళ ప్రయాణం ఇవాళ సంకెళ్ల నుంచి స్వేచ్ఛ వైపు సాగుతోంది. కానీ ఆ స్వేచ్ఛ కేవలం ఆర్థికపరమైనదిగా మిగిలిపోతే అది పూర్తి సాధికారత అనిపించుకోవు. బాహ్య ప్రపంచపు విజయాలతో పాటు అంతర్గతంగా ఒత్తిడి లేని, గిల్ట్ లేని, ఆత్మవిశ్వాసంతో కూడిన మనస్సే నిజమైన స్వేచ్ఛ. "రెక్కలు కత్తిరించి నన్ను ఎగరమంటే ఎలా..? గగనమంతా నాదే అన్నప్పుడు నాకు కావలసింది సానుభూతి కాదు, కాస్త సహకారం, అంతకుమించిన గుర్తింపు..!" ఇది ప్రస్తుతం మహిళలకు కావాల్సినది. స్త్రీ సాధికారత అంటే పురుషాధిక్యతపై చేసే యుద్ధం కాదు. ఇద్దరు కలిసి, సమాన గౌరవంతో, ఒకరికొకరు తోడుగా నవ సమాజ నిర్మాణంలో అడుగులు వేయడం. బాహ్య ప్రపంచపు చీకట్లను చట్టాలతో గెలవొచ్చు... కానీ అంతరంగపు సంకెళ్లను తాత్వికమైన ఎరుకతో, మనోబలంతో మాత్రమే ఛేదించగలం..! ఆ అడుగులకు అడ్డుపడకుండా, తోడుగా నిలిచే మనసులున్నప్పుడే ఈ సమాజం నిజమైన ఆధునిక సమాజం అవుతుంది. ఆ మార్పు మన ఇళ్ల నుంచే, మొదలు కావాలి..!



– కస్తూరిదారా



# జాతీయం-అంతర్జాతీయం



## అంత భావోద్వేగంతో తీసుకోవద్దు



**సిజెపిపై అత్యవసర విచారణను తిరస్కరించిన సుప్రీం**

**న్యూఢిల్లీ, మే 25 (వుదయం):**

సోషల్ మీడియాలో వేగంగా ఆదరణ పొందిన వ్యంగ్య డిజిటల్ ఉద్యమమైన 'కాక్రోచ్ జనతా పార్టీస (సిజెపి)కి సంబంధించిన కార్యకలాపాలు, నకిలీ న్యాయవాదులపై వచ్చిన ఆరోపణల విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్లపై అత్యవసర విచారణ జరపడానికి సుప్రీం కోర్టు సోమవారం నిరాకరించింది. ఈ విషయాంలో అంత భావోద్వేగానికి లోనుకావద్దని భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం, పిటిషనర్లలో ఒకరి తరపున హాజరైన న్యాయవాది ఎన్.కె. గోస్వామితో చెప్పింది.ప్రధాన న్యాయమూర్తి గతంలో స్పష్టత ఇచ్చినప్పటికీ, గత కోర్టు విచారణ సందర్భంగా చేసిన వివాదాస్పద బొద్దింక వ్యాఖ్యలకు సంబంధించి వక్రీకరించిన, దురుద్దేశపూరిత కథనం ఇప్పటికీ ప్రచారంలో ఉందని ఆ న్యాయవాది వాదించిన తర్వాత ఈ వ్యాఖ్య వెలువడింది.తీవ్రమైన ఆవశ్యకత ఏమీ లేదు సీజేఐఈ విషయంలో అంత భావోద్వేగానికి లోనుకావద్దు, అని విచారణ సందర్భంగా సీజేఐ వ్యాఖ్యానించారు.నకిలీ న్యాయ డిగ్రీల ఆరోపణలపై సీబీఐ విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్లలో ఒకటి ఉందని, అలాగే కోర్టు గదిలో జరిగే సంభాషణలను వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదని వాదించే పిటిషన్ ఉందని మరో న్యాయవాది కోర్టుకు తెలియజేశారు.ఈ వాదనలకు స్పందిస్తూ, అంత తీవ్రమైన ఆవశ్యకత ఏమీ లేదు. చూద్దాం, అని సీజేఐ అన్నారు. తగిన సమయంలో సుప్రీంకోర్టు ఈ పిటిషన్లను పరిశీలిస్తుందని ఆయన సూచించారు.ప్రచారం, వాణిజ్య ప్రయోజనాల కోసం కోర్టులో మౌఖిక పరిశీలనలను వాడుకుంటున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కూడా పిటిషన్లలో కోరారు. నకిలీ డిగ్రీలు, ఆన్‌లైన్ ప్రచారాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్న పిటిషన్లునకిలీ డిగ్రీలతో న్యాయవాద వృత్తిని కొనసాగిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న నకిలీ న్యాయవాదులపై విచారణ జరపాలని పిటిషన్లలో ఒకటి కోరింది.న్యాయ విచారణ ప్రక్రియలను దుర్వినియోగం చేస్తున్నారని, కోర్టు విచారణల సమయంలో చేసిన వ్యాఖ్యలను ఆన్‌లైన్‌లో ప్రచార కార్యక్రమాలుగా మలుస్తున్నారని ఆ పిటిషన్‌లో ఆందోళన వ్యక్తం చేశారు. ఒక న్యాయవాది సీనియర్ హోదాకు సంబంధించి మే 15 విచారణ సందర్భంగా సీజేఐ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలతో ఈ వివాదం మొదలైంది. ఆయన బొద్దింకలు, పరాన్నజీవులు వంటి పదాలను ఉపయోగించడం ఆన్‌లైన్‌లో విస్తృత చర్చకు దారితీసింది.బొద్దింకల' వ్యాఖ్యలపై గతంలోనే వివరణ ఇచ్చిన సీజేఐమే 16న, దేశ యువతను తాను అవమానించినట్లు వచ్చిన వార్తల పట్ల తాను బాధపడ్డానని పేర్కొంటూ, ప్రధాన న్యాయమూర్తి ఒక తీవ్రమైన వివరణను జారీ చేశారు.నకిలీ, బోగస్ డిగ్రీలతో న్యాయ వృత్తిలో ప్రవేశిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులను ఉద్దేశించే ఆ వ్యాఖ్యలు చేశానని, అయితే మీడియాలోని ఒక వర్గం వాటిని తప్పుగా ఉటంకించిందని ఆయన స్పష్టం చేశారు.ఆ సంఘటన తర్వాత కాక్రోచ్ జనతా పార్టీ ఉద్భవించడానికి, ఆ పేరుతో వ్యంగ్యాత్మక ఆన్‌లైన్ ప్రచారానికి దారితీసింది. ఇది నిరుద్యోగం, పత్రాల లీకులు, విద్యా వ్యవస్థకు సంబంధించిన ఆందోళనలపై నిరాశను వ్యక్తం చేస్తూ, శరవేగంగా ఒక విస్తృత డిజిటల్ ఉద్యమంగా రూపాంతరం చెందింది. వెబ్‌సైట్ తొలగింపు తర్వాత బెదిరింపులు వస్తున్నాయని సీజేపీ వ్యవస్థాపకుడి ఆరోపణఇదిలా ఉండగా, కాక్రోచ్ జనతా పార్టీ వెబ్‌సైట్‌ను శనివారం నాడు తొలగించినట్లు సమాచారం.ప్రభుత్వం నిరంకుశ వైఖరిని ప్రదర్శిస్తోందని వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎక్స్‌పై ఆరోపించారు. ఆన్‌లైన్‌లో తమ ప్రచారం వేగంగా పుంజుకోవడంతో తనకు ప్రాణ బెదిరింపులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు.

## ఇరాన్ చర్చలు విఫలమైతే, అమెరికా 'మరో మార్గాన్ని' వెతుక్కుంటుంది: మార్కో రూబియో



**న్యూఢిల్లీ, మే 25 (వుదయం):**

ప్రస్తుత యుద్ధానికి ముగింపు పలికే దిశగా అమెరికా, ఇరాన్‌లు ఒక ఒప్పందానికి చేరువవుతున్న తరుణంలో, అమెరికా ఇరాన్‌తో బలమైన ఒప్పందాన్ని కుదుర్చుకుంటుందని లేదా ఆ దేశాన్ని మరొక మార్గంలో ఎదుర్కొంటుందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్కొన్నారు. నిన్న రాత్రికి లేదా బహుశా ఈ రోజుకు ఏదైనా వార్త వస్తుందేమోనని మేం భావించాం. అయితే, దీనికి మరీ ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదు," అని రూబియో సోమవారం న్యూఢిల్లీలో అన్నారు.అమెరికా విదేశాంగ కార్యదర్శి తీవ్ర వ్యాఖ్యలుఇరాన్, అమెరికా ఏప్రిల్ 8 నుంచి కాల్పుల విరమణను పాటిస్తున్నాయి. హార్ముజ్ జలసంధిలో ఇరుపక్షాలు విధించిన దిగ్బంధనాలు మినహా, ఈ ఒప్పందం పటిష్టంగా కొనసాగుతున్నప్పటికీ, ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ కూటమి మధ్య సైనిక దురాక్రమణను అరికట్టగల ఈ కాల్పుల విరమణ పరిధిని విస్తరించి, దానిని ఒక పెద్ద ఒప్పందంగా మార్చేందుకు ఇరుపక్షాలు ప్రయత్నించాయి. దీనికి సంబంధించి, మార్కో రూబియో తన భారత పర్యటనలో విలేకరులతో మాట్లాడుతూ, జలసంధిని తెరిపించగల వారి సామర్థ్యం విషయంలో, మన ముందు చాలా పటిష్టమైన ప్రతిపాదన ఉందని నేను భావిస్తున్నాను అని వ్యాఖ్యానించారు.ఒక ఒప్పందం కుదిరి, ధృవీకృతమై, సంతకం చేసే వరకు అమెరికా దిగ్బంధనం పూర్తి స్థాయిలో కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్రూత్ సోషల్లో పోస్ట్ చేసిన ఒక రోజు తర్వాత ఈ వ్యాఖ్యలు వచ్చాయి. ఇరు పక్షాలు తమ సమయం తీసుకుని, దీనిని సరిదిద్దుకోవాలి అని ఆయన పేర్కొన్నారు.ఇరాన్ ప్రభుత్వం నుండి తక్షణ స్పందన ఏదీ రాలేదు. మనం ఒక మంచి ఒప్పందాన్ని కుదుర్చుకుంటాం, లేదా దీనిని మరొక విధంగా ఎదుర్కోవాల్సి వస్తుంది. అయితే, ఒక మంచి ఒప్పందం కుదరాలనేదే మా ప్రాధాన్యత, అని రూబియో ఈ క్రమంలో స్పష్టం చేశారు.అమెరికా, ఇరాన్ల మధ్య కాల్పుల విరమణ ప్రస్తుతానికి కొనసాగుతున్నప్పటికీ, పరిస్థితి మాత్రం ఇంకా ఉద్రిక్తంగా, అనిశ్చితంగానే ఉంది. ఈ తాత్కాలిక సంధి ప్రత్యక్ష, భారీ స్థాయి పోరాటాలను గణనీయంగా తగ్గించింది. అయితే, ఇరు పక్షాలు ఒక విస్తృత ఒప్పందానికి సంబంధించిన నిబంధనలపై చర్చలు కొనసాగిస్తున్నందున, ఈ కాల్పుల విరమణ శాశ్వతమైనది కాదని, ఇంకా సున్నితంగా ఉందని గుర్తుంచుకోవడం ముఖ్యం. ఇరాన్ అణు ఇంధన సుసంపన్నత కార్యక్రమం, హార్ముజ్ జలసంధి, మధ్యప్రాచ్యం అంతటా వివిధ మిలిటెంట్ సమూహాలకు ఇరాన్ అందిస్తున్న మద్దతు వంటి పలు అంశాలు ఇప్పటికీ వివాదాస్పదంగానే కొనసాగుతున్నాయి.

## మంగళవారం రాహుల్ గాంధీ సహా అగ్ర నాయకులను కలువనున్న సిద్దరామయ్య



**వుదయం డెస్క్, మే 25:**

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంగళవారం నాడు ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్టానాన్ని కలవనున్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో కూడా ఆయన సమావేశమయ్యే అవకాశం ఉంది. కర్ణాటకలో నాయకత్వ మార్పు జరగవచ్చనే ఊహాగానాలు మళ్లీ ఊపందుకున్న నేపథ్యంలో, పార్టీ అగ్ర నాయకత్వం ముఖ్యమంత్రిని చర్చలకు ఆహ్వానించింది.కర్ణాటకలో మూడేళ్ల పాలన పూర్తి; కొనసాగుతున్న నాయకత్వ పోరుకర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తి చేసుకోనున్న తరుణంలోనే ముఖ్యమంత్రికి ఈ పిలుపు అందింది. రాష్ట్రంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ల మధ్య నాయకత్వం కోసం సాగుతున్న పోరు ఈ మూడేళ్ల కాలమంతటా నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంది. ఈ దృష్ట్యా కూడా, ప్రస్తుత సమావేశం అత్యంత కీలకమైనదిగా పరిగణిస్తున్నారు.కర్ణాటకలో నాయకత్వానికి సంబంధించిన చర్చతో పాటు, రాబోయే రాజ్యసభ ఎన్నికల గురించి కూడా ముఖ్యమంత్రి చర్చించే అవకాశం ఉంది. ఈ సమావేశం రాబోయే శాసన మండలి ఎన్నికలకు సంబంధించి కూడా ఉండవచ్చు. కాబట్టి, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ నాయకత్వం మధ్య జరిగే ఈ సమావేశపు అజెండా అంత స్పష్టంగా లేదు.గత 18 నెలలుగా, డి.కె. శివకుమార్ మద్దతుదారులు ఆయన త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తారని పదేపదే చెబుతూ వచ్చారు. అయితే, ఇవన్నీ కేవలం పుకార్లు, ఊహాగానాలుగానే మిగిలిపోయాయి. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత, పదవీకాలం మధ్యలో నాయకత్వ మార్పుకు సంబంధించి ప్రణాళిక ఉందన్న విషయాన్ని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అంగీకరించలేదు.కర్ణాటకలోని పలువురు అగ్ర పార్టీ నాయకులు అంతులేని ఊహాగానాలతో సంతృప్తిగా లేరు. ఈ గందరగోళానికి తెరదించి, నాయకత్వ విషయంపై తమ వైఖరిని స్పష్టంగా చెప్పాలని వారు కాంగ్రెస్ అగ్ర నాయకత్వాన్ని కోరారు. కొద్ది రోజుల క్రితమే కాంగ్రెస్ ఎమ్మెల్యే బేలూరు గోపాల్ కృష్ణ పీటీఐతో మాట్లాడుతూ, కనీసం 30 నుంచి 35 మంది పార్టీ శాసనసభ్యులు మే 28 లేదా 29 తేదీల్లోగా ఢిల్లీ చేరుకుని పార్టీ అగ్ర నాయకత్వాన్ని కలవడానికి ప్రణాళిక వేస్తున్నారని చెప్పారు.కృష్ణ ప్రకారం, రాష్ట్రంలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణను డిమాండ్ చేయడం కోసమే ఈ సమావేశం జరగనుంది. ఈ పునర్వ్యవస్థీకరణ 15 రోజుల్లోపే జరగాలని తాము కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. గత నెల ఆరంభంలో, రాష్ట్రానికి చెందిన కనీసం 30 మంది ఎమ్మెల్యేలు రాహుల్ గాంధీని కలిసేందుకు ఢిల్లీ చేరుకున్నారు. రాష్ట్రంలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణను డిమాండ్ చేసే ఉద్దేశంతో వారు రాహుల్ గాంధీని కలవాలని ప్రణాళిక వేసుకున్నారు. రాష్ట్రంలో జరిగిన రెండు ఉప ఎన్నికల అనంతరం ఈ సమావేశం ఖరారైంది.

## టివికెలో చేరిన ముగ్గురు ఎఐఎడిఎంకె ఎమ్మెల్యేలు

**చెన్నై, మే 25 (వుదయం):**

సంక్షోభంలో కూరుకుపోయిన ఎఐఎడిఎంకెకు సోమవారం మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. సి. వి. షణ్ముగం నేతృత్వంలోని తిరుగుబాటు వర్గానికి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు పార్టీని వీడి, సి. జోసెఫ్ విజయ్ స్థాపించిన 'తమిళగ వెట్రి కజగంస (టివికె)లో చేరారు.కె. మరకతం, డి. జయ కుమార్, వి. సత్యభామ సోమవారం తమిళనాడు శాసనసభాపతిని కలిసి, తమ రాజీనామాలను సమర్పించారు. వీరి రాజీనామాలతో, శాసనసభలో ఎఐఎడిఎంకె బలం 44కు తగ్గింది. ఈ మూడు నియోజకవర్గాలతో పాటు, తిరుచిరాపల్లి (తూర్పు) నియోజకవర్గానికి కూడా ఉప ఎన్నికలు రాబోయే ఆరు నెలల్లో జరిగే అవకాశం ఉంది.2026 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పేలవ ప్రదర్శన కనబరిచిన తర్వాత, ఎడప్పాడి కె. పళనిస్వామి నాయకత్వంలోని ఎఐఎడిఎంకె ఎదుర్కొంటున్నసంక్షోభాల జాబితాలో ఈ ఫిరాయింపులు తాజా పరిణామంగా నిలిచాయి. మే 13న జరిగిన కీలకమైన బలపరీక్ష సమయంలో, కనీసం 24 మంది తిరుగుబాటు ఎఐఎడిఎంకె ఎమ్మెల్యేలు పార్టీ విప్‌ను ధిక్కరించి, విజయ్ ప్రభుత్వానికి మద్దతు తెలిపారు.ఓటమి, అసమ్మతి, ఫిరాయింపులుతమిళనాడులోని మొత్తం 234 స్థానాలకు గాను, ఎఐఎడిఎంకె కేవలం 47 స్థానాలను మాత్రమే దక్కించుకోగలిగింది. మరోవైపు, 108 స్థానాలతో ఏకైక అతిపెద్ద శక్తిగా అవతరించి, విజయ్ నేతృత్వంలోని టివికె రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా కుదిపేసింది. అయితే, మెజారిటీ మార్కును చేరుకోవడానికి ఆ పార్టీకి ఇంకా 10 స్థానాల కొరత ఏర్పడటంతో, ఎన్నికల అనంతర తీవ్రమైన సంప్రదింపులు, కూటమి ఏర్పాటు ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి.ఈ ఫలితాలు తమిళనాడు రాజకీయాల్లో డిఎంకె వ్యతిరేక కూటమికి తిరుగులేని ముఖచిత్రంగాఇపిఎస్‌కున్న హోదాను బలహీనపరిచాయి. అంతేకాక, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఎఐఎడిఎంకె అధినేత తన చిరకాల ప్రత్యర్థి అయిన డిఎంకెతో చేతులు కలిపారని షణ్ముగం ఆరోపించడంతో, పార్టీలో అపూర్వమైన తిరుగుబాటుకు ఇవి దారితీశాయి.కనీసం 24 మంది ఎమ్మెల్యేలు పార్టీ ఆదేశాలను ధిక్కరించి, విప్‌ను బేఖాతరు చేస్తూ టివికె ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేశారు. దీనితో విజయ్ మద్దతుదారుల సంఖ్య 144కు చేరింది. ఈ తిరుగుబాటు కారణంగా ఎఐఎడిఎంకెలో క్రమశిక్షణా చర్యలు ప్రారంభమయ్యాయి, ఇందులో ఫిరాయింపుల నిరోధక చట్టం కింద తీసుకునే చర్యలు కూడా ఉన్నాయి. పలువురు సీనియర్ నాయకులు ఇపిఎస్ నిరంకుశ పనితీరును విమర్శించడంతో పాటు, పొత్తులు, అభ్యర్థుల ఎంపిక విషయంలో ఆయన ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఎం.జి. రామచంద్రన్, జె. జయలలితాల ఆశయాలకు అనుగుణంగా పార్టీని పునరుద్ధరించాలంటే,ఇపిఎస్‌ను తప్పక తొలగించాలని తిరుగుబాటు వర్గం పేర్కొంది. టివికెఎఐఎడిఎంకె కూటమిపై సిపిఎం హెచ్చరికఅయితే, బిజెపి పాలన పరోక్షంగా ప్రవేశించకుండా అడ్డుకునేందుకే వామపక్షాలు టివికె ప్రభుత్వానికి బయటి నుండి మద్దతు ఇచ్చాయని పేర్కొంటూ, ఒకవేళ ఆ ప్రభుత్వంలో తిరుగుబాటు నాయకులకు చోటు కల్పిస్తే, తన పార్టీ ఇస్తున్న మద్దతును పునఃపరిశీలించాల్సి వస్తుందని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) విజయ్‌ను హెచ్చరించింది.అధికార టివికె వైఖరిని తమిళనాడు మంత్రి ఆధవ్ అర్జున ఆ తర్వాత స్పష్టం చేస్తూ, కూటమి ఐక్యంగానే ఉందని, మంత్రి వర్గం ఒకే కుటుంబంలా పనిచేయాలని ముఖ్యమంత్రి కోరుకుంటున్నారని నొక్కి చెప్పారు.

## ధర్మశాల ప్రమాణ స్వీకార కార్యక్రమం

### టిబెటన్ రాజకీయాల్లో జోక్యం చేసుకోవద్దు: భారత్‌ను కోరిన చైనా



**వుదయం డెస్క్, మే 25:**

టిబెట్ స్వాతంత్ర్య కార్యకలాపాలకు వేదిక కల్పించడం నుండి విరమించుకోవాలని, అలాగే దలైలామా పునర్జన్మ ప్రక్రియలో జోక్యం చేసుకోవడం మానుకోవాలని భారతదేశాన్ని చైనా కోరింది. మే 27న, హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో, కేంద్ర టిబెటన్ పరిపాలన (సిటిఎ) 17వ కాషాగ్ (మంత్రివర్గం) సిక్యోంగ్ (రాజకీయ నాయకుడు)గా పెన్పా త్సెరింగ్ తన రెండవ పర్యాయం ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఈ దౌత్యపరమైన హెచ్చరిక వెలువడింది. ఈ కార్యక్రమానికి 14వ దలైలామా హాజరవుతారని భావిస్తున్నారు.

భారతదేశంలోని చైనా రాయబార కార్యాలయ ప్రతినిధి యు జింగ్, వారసత్వ ప్రక్రియపై బీజింగ్‌కు అధికారం ఉందని నొక్కి చెప్తూ ఎక్స్ పై పోస్ట్ చేశారు.దలైలామా పునర్జన్మ అనేది శతాబ్దాలుగా చైనా కేంద్ర ప్రభుత్వ ఆమోదం అవసరమైన, సుదీర్ఘకాలంగా స్థిరపడిన మతపరమైన ఆచారాలు, చారిత్రక సంప్రదాయాలను అనుసరిస్తుంది, అని యు రాశారు. 14వ దలైలామా కూడా ఈ ప్రక్రియ ద్వారానే గుర్తింపు పొందారని ఆమె తెలిపారు. దలైలామా పునర్జన్మ విషయం పూర్తిగా చైనా అంతర్గత విషయం, దీనిపై బాహ్య జోక్యం ఉండకూడదు అని అన్నారు.ప్రవాసంలో ఉన్న టిబెటన్ నాయకత్వం చట్టబద్ధతను తోసిపుచ్చుతూ, సెంట్రల్ టిబెటన్ అడ్మినిస్ట్రేషన్ అని పిలిచే దానిని ఏ సార్వభౌమ దేశం కూడా గుర్తించలేదు. దాని నాయకత్వానికి టిబెటన్ ప్రజలకు ప్రాతినిధ్యం వహించే చట్టబద్ధత గానీ, పునర్జన్మ ప్రక్రియకు సంబంధించి వాదనలు చేసే అధికారం గానీ లేదంటూ పేర్కొన్నారు. టిబెట్‌కు సంబంధించిన అంశాలపై భారతదేశం స్పష్టమైన హామీలను ఇచ్చింది. భారతదేశం ఈ హామీలను నిలబెట్టుకుంటూనే ఉంటుందని మేం మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాం. ఇటువంటి వైఖరి, మన ద్వైపాక్షిక సంబంధాల సమగ్ర స్థిరత్వానికి, నిర్మాణాత్మక అభివృద్ధికి సానుకూలంగా దోహదపడుతుంది, అని పేర్కొంటూ యూ, న్యూఢిల్లీకి దాని గత దౌత్యపరమైన వైఖరులను గుర్తుచేశారు.ప్రస్తుత సిక్యోంగ్ అయిన త్సెరింగ్, ఫిబ్రవరిలో జరిగిన ప్రాథమిక ఎన్నికలలో నిర్ణయాత్మక విజయాన్ని సాధించడం ద్వారా, తుది విడత ఓటింగ్‌ను దాటవేశారు.సిటిఎ ఎన్నికల సంఘం ప్రకారం, త్సెరింగ్ మొత్తం ఓట్లలో 61.025% సాధించారు. సిటిఎ ఎన్నికల నియమ నిబంధనలలోని ఆర్టికల్ 67(4) ప్రకారం, ఒక అభ్యర్థి ప్రాథమిక దశలో 60% కంటే ఎక్కువ ఓట్లు సాధిస్తే, తుది విడత ఎన్నికల అవసరం లేకుండానే వారు స్వయంచాలకంగా ఎన్నికైనట్లు ప్రకటిస్తారు. 18వ ప్రవాస టిబెటన్ పార్లమెంట్ సభ్యులకు సంబంధించిన ఫలితాలను కూడా ఎన్నికల సంఘం ప్రకటించింది.

తదుపరి ఆధ్యాత్మిక నాయకుడి ఎంపికపై ఎవరికి నియంత్రణ ఉండాలనే విషయంలో ఉన్న దీర్ఘకాలిక వివాదాన్ని ఈ భౌగోళిక రాజకీయ ఘర్షణలు ఎత్తిచూపుతున్నాయి.గత సంవత్సరం, తన 90వ జన్మదినం సందర్భంగా, 14వ దలైలామా అయిన టెన్జిన్ గ్యాత్సో, దలైలామా సంస్థ కొనసాగుతుందని ప్రకటిస్తూనే, తన వారసుడిని గుర్తించే ప్రక్రియలో బీజింగ్‌కు ఎటువంటి పాత్ర ఉండదని గట్టిగా పునరుద్ఘాటించారు. భవిష్యత్తు అవతారాన్ని గుర్తించే ఏకైక అధికార సంస్థగా, తన కార్యాలయంతో సంప్రదించి నిర్ణయం తీసుకునే బాధ్యతను ఆయన గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్ట్ కు అప్పగించారు.ఈ విషయంలో జోక్యం చేసుకునే అధికారం మరెవరికీ లేదు, అని దలైలామా కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఇది ఆయన 2011లో జారీ చేసిన ఉత్తర్వును పోలి ఉంది. ఆ ఉత్తర్వులో, పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాలోని వారితో సహా ఎవరైనా రాజకీయ ప్రయోజనాల కోసం ఎంచుకున్న అభ్యర్థికి ఎలాంటి గుర్తింపు గానీ, ఆమోదం గానీ ఇవ్వకూడదు అని హెచ్చరించారు.భారతదేశంలోని అతి పెద్ద టిబెటన్ శరణార్థుల సమూహాలలో ఒకదానికి నిలయమైన కర్ణాటకలోని బైలకుప్పెలో 1967లో జన్మించిన పెన్పా త్సెరింగ్‌కు టిబెటన్ పరిపాలనలో సుదీర్ఘ అనుభవం ఉంది.ఆయన చెన్నైలోని మద్రాస్ క్రిస్టియన్ కాలేజీ నుండి అర్థశాస్త్రంలో పట్టభద్రుడవడానికి ముందు, బైలకుప్పెలోని సెంట్రల్ స్కూల్ ఫర్ టిబెటన్స్‌లో తన 12వ తరగతి మెరిట్ జాబితాలో ప్రథమ స్థానంలో నిలిచారు. తన కళాశాల సంవత్సరాలలో, ఆయన టిబెటన్ ఫ్రీడమ్ మూవ్‌మెంట్, నైజీరియాటిబెట్ ఫ్రెండ్‌షిప్ అసోసియేషన్ రెండింటికీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.తరువాత త్సెరింగ్ 12వ, 13వ ప్రవాస టిబెటన్ పార్లమెంటుకు ఎన్నికై, 2008 నుండి 2016 వరకు రెండు పర్యాయాలు స్పీకర్‌గా పనిచేశారు. ఆయన 2001 2008 మధ్య ఢిల్లీలోని టిబెటన్ పార్లమెంటరీ అండ్ రీసెర్చ్ సెంటర్‌కు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. 2016 సికియాంగ్ ఎన్నికలలో లోబ్సాంగ్ సాంగే చేతిలో స్వల్ప తేడాతో ఓడిపోయిన తర్వాత, త్సెరింగ్ 2021 సార్వత్రిక ఎన్నికలలో తుది రౌండ్‌లో 34,324 ఓట్లు సాధించి, రాజకీయ నాయకుడిగా తన తొలిసారి ఆ అధికారాన్ని గెలుచుకున్నారు.

## చైనా కొత్త ఎగుమతి నిబంధనలు: 120 బిలియన్ డాలర్ల భారత్ ఎలక్ట్రానిక్స్ కలను అడ్డుకుంటాయా?

**వుదయం డెస్క్, మే 25:**



భారతదేశం తయారీ రంగంపై తన కృషిని రెట్టింపు చేస్తున్న తరుణంలోనే, ఆ కర్మాగారాలకు ఊతమిచ్చే సరఫరా గొలుసులపై చైనా తన పట్టును మరింత బిగించింది.కరోనా మహమ్మారి తర్వాత చైనాకు ప్రత్యామ్నాయంగా, ప్రపంచానికి ఒక సరికొత్త గ్లోబల్ తయారీ కేంద్రంగా ఎదగాలని భారత్ గట్టిగా ప్రయత్నిస్తూ వస్తోంది. అందుకు అనుగుణంగా పరిశ్రమలు సిద్ధమవుతున్న తరుణంలో చైనా తన సరఫరా గొలుసుపై పట్టును మరింత బిగించింది. ఆ దేశం తాజాగా తీసుకొచ్చిన కొత్త ఎగుమతి నిబంధనల వల్ల భారత్‌లో ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ రంగాలు భారీ కుదుపునకు లోనయ్యే అవకాశాలు ఉన్నాయి.ఎగుమతులను నియంత్రించే నిబంధనలుచైనా ప్రభుత్వం 'స్టేట్ కౌన్సిల్ డిక్రీ 834, 835' పేరుతో కొత్త నిబంధనలను అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం ఆధునిక సాంకేతికత, కీలక యంత్రాలు, ఖనిజాల ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించింది. తమ ఫ్యాక్టరీలను వేరే దేశాలకు తరలించే కంపెనీలు లేదా అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఈ కొత్త రూల్స్ ఉన్నాయి. భారత్‌లోని ఎలక్ట్రానిక్స్ రంగం ఇప్పటికీ చైనా యంత్రాలు, ముడి సరకులపైనే ఎక్కువగా ఆధారపడటం వల్ల మన కంపెనీల్లో ఇప్పుడు తీవ్ర ఆందోళన మొదలైంది.ఎలక్ట్రానిక్స్ విషయంలోనూ అంతేనా?భారతదేశ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 2015లో 8.6 బిలియన్ డాలర్ల నుంచి 2025 నాటికి 47 బిలియన్ డాలర్ల రికార్డు స్థాయికి చేరాయి. ఈ 2026 చివరి నాటికి దీన్ని ఏకంగా 120 బిలియన్ డాలర్లకు చేర్చాలని కేంద్ర ఐటీ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. అయితే యాపిల్ సప్లయర్స్ విస్తరణ, సెమీ కండక్టర్ ప్లాంట్ల వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులకు కావలసిన కీలక విడిభాగాలను చైనా అడ్డుకుంటే ఈ లక్ష్యం నెరవేరడం కష్టంగా మారుతుంది. కార్ల తయారీ రంగంలో కూడా దాదాపు 26 శాతం హైవాల్యూ ఎలక్ట్రానిక్స్ విడిభాగాలు చైనా నుంచే వస్తున్నాయి.కేంద్ర ప్రభుత్వం స్పందన?చైనా చర్యలపై కేంద్ర రక్షణ, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పందించారు. చైనా లాంటి కొన్ని నిర్దిష్ట దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించడానికి రంగాల వారీగా పెట్టుబడి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే తయారీ రంగాన్ని బలోపేతం చేయడానికి రూ.33,660 కోట్లతో 'భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన' కింద రాబోయే మూడేళ్లలో 50 ఇండస్ట్రియల్ పార్కులను ప్రారంభించాలని కేంద్రం ప్లాన్ చేస్తోంది.చైనా ఆంక్షలు భారత్‌కు ఒక రకంగా హెచ్చరిక లాంటివని పరిశ్రమ నిపుణులు అంటున్నారు. మనం కేవలం వేరే దేశాల విడిభాగాలను తెచ్చి ఇక్కడ బిగించే స్థాయి నుంచి బయటకు రావాలని సూచిస్తున్నారు. గుజరాత్‌లో భారీ యాక్టివ్ ఎల్ఈడీ డిస్‌ప్లే ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన ఎల్ఈడీఎక్స్ లాంటి కంపెనీలు ఇప్పటికే స్వదేశీ ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టాయి. కేవలం చైనాను రీప్లేస్ చేయడం మాత్రమే కాకుండా, భారత్ స్వయంసమృద్ధి సాధిస్తేనే గ్లోబల్ మార్కెట్‌లో నమ్మకమైన భాగస్వామిగా ఎదగగలదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## నౌకాయాన పన్ను మాత్రమే, టోల్ కాదు: ఇరాన్



**హొర్ముజ్ గుండా ప్రయాణించడానికి ఎటువంటి రుసుములు అవసరం లేదు**

**వుదయం డెస్క్, మే 25:**

వ్యూహాత్మకమైన హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకలపై తాము ఎలాంటి రవాణా సుంకాలు విధించడం లేదని, కేవలం నౌకాయాన సేవలకు (నావిగేషన్‌కు) మాత్రమే రుసుము వసూలు చేస్తున్నామని ఇరాన్ స్పష్టం చేసింది. సోమవారం జరిగిన పత్రికా సమావేశంలో ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ మాట్లాడుతూ, ఈ రుసుములు ఆ ప్రాంతంలో అందించే సముద్ర, పర్యావరణ సేవలకు సంబంధించినవని తెలిపారు.హార్ముజ్ జలసంధి, పర్షియన్ గల్ఫ్, ఒమన్ సముద్ర పర్యావరణాన్ని పరిరక్షించడానికి అవసరమైన చర్యలతో పాటు, అందిస్తున్న నావిగేషన్ సేవలకు గాను కొన్ని రుసుములను వసూలు చేయడం తప్పనిసరి, అని బాకాయీ పేర్కొన్నారు. ప్రాంతీయ ఉద్రిక్తతలు, సముద్ర వాణిజ్యంలో అంతరాయాలు పెరుగుతున్న నేపథ్యంలో, హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణించడానికి కొన్ని వాణిజ్య నౌకల నుండి ఇరాన్ రుసుములను వసూలు చేయడం ప్రారంభించిందని వార్తలు వచ్చిన తర్వాత ఈ వివరణ వెలువడింది.ఈ నెల ప్రారంభంలో ప్రచురించిన ఒక రాయిటర్స్ పరిశోధన నివేదిక ప్రకారం, ద్వీప చెక్‌పోస్టులు, కఠినమైన సైనిక తనిఖీలు, నియంత్రిత నౌకా మార్గాల ద్వారా ఇరాన్ ఆ వ్యూహాత్మక జలమార్గంపై తన పట్టును బిగించింది. భద్రత, నౌకాయాన సేవలకు సంబంధించిన రుసుములను కొన్ని నౌకల నుండి వసూలు చేస్తున్నట్లు కూడా ఆ నివేదిక పేర్కొంది.ప్రపంచంలోని చమురు, ద్రవీకృత సహజ వాయువు రవాణాలో దాదాపు ఐదవ వంతు హార్ముజ్ జలసంధి గుండానే జరుగుతుంది కాబట్టి, ఈ పరిణామాలు ప్రపంచ ఇంధన మార్కెట్లలో ఆందోళనను రేకెత్తించాయి. ఈ మార్గానికి సంబంధించిన ఏ అంతరాయం, ఆంక్ష లేదా అదనపు ఖర్చు అయినా ఇంధన ధరలు, ఈ అంతర్జాతీయ జలమార్గంలో సాధ్యమయ్యే రవాణా రుసుములు, నౌకాయాన పరిమితులపై వచ్చిన నివేదికల పట్ల అమెరికాతో సహా పలు ప్రభుత్వాలు, ప్రపంచ షిప్పింగ్ కంపెనీలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ జలసంధిలో ప్రతిపాదిత రుసుముల వసూలు విధా నౌకాయాన పన్ను మాత్రమే, టోల్ కాదు: ఇరాన్ నం ఏదైనా ఆమోదయోగ్యం కాదు అని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో ఇటీవల అభివర్ణించారు.ప్రపంచ చమురు మార్కెట్లపై ప్రభావంహార్ముజ్ జలసంధికి సంబంధించిన అనిశ్చితి ఇప్పటికే ప్రపంచ ఇంధన మార్కెట్లు, ఇంధన ధరలపై ప్రభావం చూపడం ప్రారంభించింది.భారతదేశం, చైనా, జపాన్, దక్షిణ కొరియాతో సహా ప్రధాన ఆసియా ఆర్థిక వ్యవస్థలు ఈ మార్గం గుండా వెళ్లే ముడి చమురు రవాణాపై ఎక్కువగా ఆధారపడి ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఏవైనా దీర్ఘకాలిక అంతరాయాలు ఏర్పడితే, అది ప్రపంచవ్యాప్తంగా రవాణా ఖర్చులు, బీమా ప్రీమియంలు, ఇంధన ధరలను పెంచగలదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## రాష్ట్రపతి భవన్‌లో పద్మ పురస్కారాలను ప్రదానం చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**న్యూఢిల్లీ, మే 25 (వుదయం):**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం నాడు మొత్తం 66 మందికి పద్మ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం రాష్ట్రపతి భవన్‌లో జరిగింది. పురస్కారాలు పొందిన వారిలో సినీ ప్రముఖులు, గాయకులతో పాటు సామాజిక సేవ, ప్రజా వ్యవహారాలు, విజ్ఞానశాస్త్రం, ఇంజనీరింగ్, వాణిజ్యం, పరిశ్రమలు, వైద్యం, సాహిత్యం, విద్య, క్రీడలు, పౌర సేవ తదితర రంగాలకు చెందిన ప్రముఖులు ఉన్నారు.ప్రస్తుత సంవత్సరానికి గాను, ఐదు పద్మ విభూషణ్, 13 పద్మ భూషణ్, 113 పద్మశ్రీ పురస్కారాలతో కలిపి మొత్తం 131 పద్మ పురస్కారాలను రాష్ట్రపతి ఆమోదించారు.సోమవారం నాడు ఈ పురస్కారాలలో 66 అవార్డులను విజేతలకు ప్రదానం చేయగా, మిగిలిన వాటిని తర్వాతి తేదీలో ప్రదానం చేసే అవకాశం ఉంది.పద్మ అవార్డులు: విజేతలు ఎవరు?పద్మ అవార్డులు వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులకు ప్రదానం చేస్తున్నారు. ఈ సంవత్సరం వాటిని అందుకున్న కొందరు ప్రముఖుల పేర్లు:ధర్మేంద్ర సింగ్ డియోల్కెటి థామస్ఎ న్ రాజం పి నారాయణన్ వి ఎస్ అచ్యుతానందన్ అల్కా యాగ్నిక్ భగత్ సింగ్ కోష్యారీ కల్లిపట్టి రామసామి పళనిస్వామి మమ్ముట్టి డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పీయూష్ పాండే ఎస్‌కెఎం మైలానందన్ శ తావధాని ఆర్ గణేష్ శిబు సోరెన్ ఉదయ్ కోటక్ ఈ పురస్కారాలు వివిధ రంగాలలో విశేషకృషి చేసిన వ్యక్తులను సన్మానిస్తాయి. వారిని అభినందించడానికి ప్రభుత్వం ఎంచుకున్న మార్గం ఇది. ఈ సంవత్సరం, పలువురు విజేతలకు ఈ పురస్కారం మరణానంతరం ప్రదానం చేయనున్నారు. ఈ జాబితాలో శిబు సోరెన్ , ధర్మేంద్ర పేర్లు ఉన్నాయి. అసాధారణమైన సేవలు అందిస్తున్న సాధారణ భారతీయులను గౌరవించే సూత్రాన్ని కొనసాగిస్తూ, ఈ ఏడాది పద్మ పురస్కారాలలో భారతదేశం నలుమూలల నుండి 45 మంది అజ్ఞాత వీరులను చేర్చినట్లు పీటీఐ నివేదిక పేర్కొందని ఆ వర్గాలు తెలిపాయి.

## ఎన్‌టిఎపై అసహనాన్ని వ్యక్తం చేసిన సుప్రీం

**న్యూఢిల్లీ, మే 25 (వుదయం):**

దేశవ్యాప్తంగా దుమారం రేపిన నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై సుప్రీం కోర్టు మండిపడింది. ఎన్ని ఆదేశాలు జారీ చేసినా, గత పేపర్ లీక్ ఘటనల నుంచి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ఎలాంటి పాఠాలు నేర్చుకోలేదని అత్యున్నత న్యాయస్థానం అసహనం వ్యక్తంచేసింది. ఈ వ్యవహారంపై ఎన్‌టీఏతో పాటు కేంద్రం, సీబీఐకి నోటీసులు జారీ చేసింది.ఈ ఏడాది మే 3వ తేదీన దేశవ్యాప్తంగా జరిగిన నీట్ యూజీ 2026 పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం లీకవడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. అంతకుముందు 2024లోనూ ఈ పరీక్ష పేపర్ లీక్ చోటుచేసుకుంది. దీంతో ఏటా ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోన్న ఎన్‌టీఏపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే వైద్య విద్య ప్రవేశపరీక్ష నిర్వహణ కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి బదులుగా ఓ స్వతంత్ర సంస్థను ఏర్పాటుచేయాలని కోరుతూ ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.దీనిపై సోమవారం విచారణ జరిపిన న్యాయస్థానం, ఎన్‌టీఏ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. 'ఎన్‌టీఏ తమ వైఫల్యాల నుంచి ఎలాంటి పాఠాలు నేర్చుకోకపోవడం విచారకరం. వాటిని ఎన్‌టీఏ అంగీకరించింది. మరి వాటి అమలు కోసం ఎలాంటి చర్యలు చేపట్టారో మేం తెలుసుకోవాలనుకుంటున్నాం. ఆ వివరాలకు సంబంధించి గురువారం లోగా అఫిడవిట్ దాఖలు చేయండి అని ధర్మాసనం ఎన్‌టీఏను ఆదేశించింది. దీంతో పాటు ఈ పిటిషన్‌పై తమ స్పందన తెలియజేయాలంటూ కేంద్రం, సీబీఐకి కూడా సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

## విమానం 30వేల అడుగుల ఎత్తులో ఉండగా.. పైలట్‌కు గుండెపోటు

విమానం గాల్లో 30,000 అడుగుల ఎత్తులో ఉండగా పైలట్‌కు గుండెపోటు వచ్చిన ఘటన స్పెయిన్‌లోని టెనెరెట్ నుంచి బర్మింగ్‌హామ్‌కు వెళుతున్న జెట్ 2 విమానంలో చోటుచేసుకుంది. దీంతో విమానాన్ని పోర్చుగల్‌లోని ఫ్రాన్సిస్కో సా కార్నీరో ఎయిర్‌పోర్టులో అత్యవసర ల్యాండింగ్ చేశారు. వెంటనే పైలట్‌కు వైద్యసాయం అందించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున జెట్ 2 విమానం ) స్పెయిన్‌లోని టెనెరెట్ నుంచి బర్మింగ్‌హామ్‌కు బయల్దేరింది. విమానం 30,000 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తుండగా.. పైలట్‌కు గుండెపోటు వచ్చినట్లు కో పైలట్ గుర్తించారు. వెంటనే దగ్గరలో ఉన్న అధికారులను అప్రమత్తం చేశారు. విమానం ఎయిర్‌పోర్ట్‌కు చేరుకునే సమయానికి అధికారులు అత్యవసర వైద్య ఏర్పాట్లు చేసి ఉస్తోంది. దాదాపు 13 గంటల పాటు టెర్మినల్‌లోనే ఉన్నామని.. అయినా అధికారులు తమకు ఎటువంటి వసతి ఏర్పాట్లు చేయలేదని వాపోయారు. శనివారం మరో విమానం ఏర్పాటు చేయడంతో బర్మింగ్‌హామ్‌కు చేరుకున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి జెట్ 2 క్షమాపణలు చెప్పింది. ప్రయాణికులు, సిబ్బంది భద్రత విషయంలో తమ ఎయిర్‌లైన్స్ ఎప్పుడూ రాజీ పడబోదని వెల్లడించింది.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## వైభవంగా 'మహిళా వారోత్సవాలు'!

**కరీంనగర్ మే 25 (వుదయం ప్రతినిధి):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా కళా భారతి లో మహిళా వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూఅంగన్వాడీ,మెప్మా, మున్సిపల్ డిపార్ట్మెంటు చేస్తున్న ఆక్టివిటీస్ చాలా బాగా ఉన్నాయి అని ప్రజలకు ఎంత గానో లబ్ధి చేకూరుతుందో వివరించారు. ప్రజలందరూ ప్రభుత్వ సేవలను పొందాలి అన్నారు. మహిళలు తమ ఆరోగ్య పట్ల శ్రద్ధ చూపాలి మహిళలు ఆరోగ్యాంగా ఉంటే నే కుటుంబం ఆరోగ్యాంగా ఉంటుంది అని తద్వారా ఆరోగ్య సమాజం నిర్మించ బడుతుంది అన్నారు. కళా భారతి లో హెల్త్ డిపార్ట్మెంట్ వాళ్ళు ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపు లో మహిళలు ఆరోగ్య పరీక్ష చేసుకోవాలి అని అన్నారు. ఏ స్కీం అయిన అది క్షేత్ర స్థాయి వరకు ప్రజల దాక చేరాలని అన్నారు.కార్యక్రమం చివర్లో జంబో చెక్ చీరల డిస్ట్రిబ్యూషన్ చేయడం జరిగింది. అంగన్వాడీ టీచర్స్ కి వంటల పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వడం జరిగింది. జంక్ తినకూడదని, ఆయిల్ షుగర్ వాడకం తగ్గించాలని పోషకహారం ప్రాధాన్యతను వివరించి ప్రతిజ్ఞ చేయించారు.కళా భారతి లో ఏర్పాటుచేసిన స్టాల్స్ ని మున్సిపల్ కమిషనర్ మేయర్ ప్రజా ప్రతినిధులు చూడడం జరిగింది 181,1098 టోల్ ఫ్రీ ప్రదర్శించారు .ఈ కార్యక్రమం లో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మున్సిపల్ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, సుడా చైర్మన్, పలుగురు కార్పొరేటర్స్, సరస్వతి, సబిత,డిప్యూటీ కమిషనర్ వేణు మాధవ్, అంగన్వాడీ టీచర్స్,ఆర్ పి ఎస్ మహిళలు పాల్గొన్నారు.

## అక్రమంగా నల్లమట్టి అక్రమ నిల్వలు



**ఆదిలాబాద్ మే 25 (వుదయం ప్రతినిధి):** ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలో నల్లమట్టిని అక్రమంగా తరలిస్తున్న వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మత్తడి వాగు ప్రాజెక్ట్ పరిధిలో రైతులు పొలాలకు వినియోగించాల్సిన నల్లమట్టిని అధికారుల అనుమతుల పేరిట తరలించి, రైతులకు కాకుం డా బడా వ్యాపారుల చేతుల్లోకి వెళ్లేలా చేసి ఇటుకల తయారీకి వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.నల్లమట్టి డంప్.. చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్న అధికారులు ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలో నల్లమట్టిని అక్రమంగా తరలిస్తున్న వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా హస్నాపూ ర్ శివారులో సుమారు 22 గుంటల విస్తీర్ణంలో దాదాపు 300ల టిప్ప ర్ల నల్లమట్టిని డంప్ చేసినప్పటికీ అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటుకల తయారీ కోసం పెద్ద ఎత్తున నల్లమట్టిని తరలించడం వల్ల వ్యవసాయ భూముల సారంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు అక్రమంగా జరుగుతున్న ఈ వ్యవహారంపై పర్యవేక్షణ లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై తాంసి తహసీల్దార్‌ను వివరణ కోరగా.. అక్రమ నల్లమట్టి డంప్ తన దృష్టికి రాలేదని విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## బాలికలకు 'పోషకాహార' అండ!



**ఆసిఫాబాద్( వుదయం ప్రతినిధి )** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట మండలంలోని అంగన్వాడి కేంద్రాల్లో గ్రామపంచాయతీ సర్పంచ్ భక్తు రామచంద్రర్ బాలికలకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ భక్తు రాంచందర్ మాట్లాడుతూ, గ్రామంలోని బాలికలు మరియు మహిళలు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా చిన్న వయస్సు నుంచే సరైన పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన భవిష్యత్తు నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు.అంగన్‌వాడీ సిబ్బంది కూడా పోషకాహార ప్రాముఖ్యతను గ్రామ ప్రజలకు వివరించి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అందరికీ చేరవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు మరియు యువతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి

- అద్దె బస్సుల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిజామాబాద్, మే 25 (వుదయం ప్రతినిధి)** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే మహోన్నత సంకల్పంతో మహిళల అభ్యున్నతి కోసం విస్తృత కార్యక్రమాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహిళా సంక్షేమ వారోత్సవాన్ని పురస్కరించుకుని మండల మహిళా సమాఖ్యలకు ప్రభుత్వం కేటాయించిన ఆర్టీసీ అద్దె బస్సులను వారికి అందజేశారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి జెండా ఊపి బస్సులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం విరివిగా రుణాలు అందించడమే కాకుండా సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దె బస్సులు, స్కూల్ యూనిఫాంల స్టిచింగ్, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ వంటి ద్వారా మహిళల ఆర్థిక ప్రగతికి తోడ్పాటును అందిస్తోందని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇళ్ళను, రేషన్ కార్డులను కూడా మహిళల పేరిట మంజూరు చేస్తోందని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాల స్వల్ప కాలంలోనే కేవలం నిజామాబాద్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు.రూ. 1100 కోట్ల ఆర్థిక సహాయం అందించడం జరిగిందని తెలిపారు. కేవలం మహిళలు అనే కాకుండా అన్ని వర్గాల వారి అభ్యున్నతికి కృషి చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు ప్రతిపక్షాలకు ఎంతమాత్రం లేదన్నారు. ప్రజలు కూడా వాస్తవాలను గమనించాలని, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తమ పిల్లల చక్కటి భవిష్యత్తు కోసం అన్ని వసతులు, నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ బడులలో చేర్పించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను వినియోగించుకోవాలని, తద్వారా అనవసర ఆర్థిక దుబారాను నివారించుకోవాలని హితవు పలికారు. అదేవిధంగా ప్రజలకు ఆరోగ్యాల పరిరక్షణకు దోహద పడే ఆహార ఉత్పత్తులను తయారు చేయాలని సూచించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, మహిళల గౌరవాన్ని మరింతగా ఇనుమడింపజేసేలా ప్రభుత్వం విస్తృత స్థాయిలో కార్యక్రమాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు. ఇందులో భాగంగానే జిల్లాకు 18 అద్దె బస్సులను కేటాయించిందని తెలిపారు. అద్దె బస్సుల నిర్వహణను పక్కాగా పర్యవేక్షణ జరపాలని సమాఖ్య ప్రతినిధులకు సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు నిజామాబాద్ జిల్లాలోనే అత్యధికంగా వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సరికొత్త ఆలోచనలతో ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే వ్యాపార పరంగా అద్భుత విజయాలు సాధించవచ్చని అన్నారు. నిజామాబాద్ నగరంలో కలెక్టరేట్ కు ఆనుకుని అన్ని హంగులతో నూతనంగా నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనం త్వరలోనే అందుబాటులోకి రానుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, డాక్టర్ కవితా రెడ్డి, అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఆర్డీఏ సాయన్న, ఆర్టీసీ ఆర్ఎం జ్యోత్స్న, నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేష్ రెడ్డి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు హేమలత, మండల మహిళా సమాఖ్యల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 138 దరఖాస్తులు



- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి, మే 25 (వుదయం ప్రతినిధి):** జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 138 దరఖాస్తులు స్వీకరించినట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతి పత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు ఇస్తూ, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణికి వచ్చిన అర్జీలలో భూ సమస్యలు, పింఛన్లు, ఉపాధి, ధాన్యం కొనుగోళ్లు, కుటుంబ సమస్యలు, సంక్షేమ పథకాలకు సంబంధించిన వినతులు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, ఎన్ వి గిరి, బాన్సువాడ, ఎల్లారెడ్డి ఆర్డీవోలు, జడ్పీ సీఈవో చందర్, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేయాలి

- అన్ లోడింగ్ లో జాప్యం కాకుండా పర్యవేక్షణ చేయాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ధాన్యం కొనుగోళ్లపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్



**రాజన్న సిరిసిల్ల, మే 25 (వుదయం ప్రతినిధి)** జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ శరవేగంగా పూర్తి చేయాలని, అన్ లోడింగ్ లో జాప్యం కాకుండా పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, అన్ లోడింగ్ వేగవంతం చేయడం, గోదాంలలో నిల్వ చేయడం, ఆన్‌లైన్ ట్యాబ్ ఎంట్రీ పురోగతి, తదితర అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, రవాణా, తదితర శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సోమవారం ఉదయం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలాల వారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న పరిస్థితులు, ధాన్యం నిల్వ సామర్థ్యం వివరాలను జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ చేయాలని, నిరంతరం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రైస్ మిల్లులకు టార్గెట్ ఇవ్వాలని ఆదేశించారు. వారం రోజుల్లోగా కొనుగోళ్ల ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని సూచించారు. రైస్ మిల్లులు, గోదాంలు, అపెరల్ పార్క్ లో హమాలీల సంఖ్యను పెంచి, అన్ లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. తుది దశలో ఉన్న కేంద్రాల్లో కొనుగోళ్లు మరింత వేగవంతం చేసి.. పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో గన్నీ బ్యాగుల కొరత లేదని, కేంద్రాల వారీగా ఎన్ని గన్నీ బ్యాగులు అవసరం ఉన్నాయో ముందే తెలుసుకుని, సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. తూకం వేసిన ధాన్యం బస్తాలు తరలించేందుకు సరిపడా వాహనాలను సమకూర్చాలని, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు ఈ దిశగా వాహనాలు సమకూర్చేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.



## భూముల రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువల సవరణ సమావేశం

- జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్

**జగిత్యాల మే 25 (వుదయం ప్రతినిధి)** జగిత్యాల జిల్లా వ్యాప్తంగా మార్కెట్ విలువల ( రివైజ్డ్ మార్కెట్ వాల్యూస్) సవరణలపై నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశం సోమవారం విజయవంతంగా ముగిసింది జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి సంబంధిత అన్ని శాఖల అధికారులు హాజరై మార్కెట్ విలువల పునర్విమర్శపై విస్తృతంగా చర్చించారు సమావేశంలో ప్రభుత్వం జారీ చేసిన జిఓ ఎంఎస్ నెం 41 రెవెన్యూ (రిజిస్ట్రేషన్I) శాఖ తేదీ 25 4 2025 ప్రకారం భూ మార్కెట్ విలువల సవరణకు సంబంధించిన మార్గదర్శకాలు పట్టణ గ్రామీణ ప్రాంతాల వర్గీకరణ వ్యవసాయ వ్యవసాయేతర భూముల విలువల నిర్ణయం ప్రధాన రహదారులకు ఆనుకుని ఉన్న ఆస్తుల ప్రత్యేక విలువల నిర్ణయం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించబడింది అదనంగా పట్టణ ప్రాంతాలు గ్రామపంచాయతీలు మున్సిపాలిటీ ప్రాంతాలలో మార్కెట్ విలువల నిర్ణయానికి సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన కమిటీల బాధ్యతలు విధానాలు స్థానిక స్థాయిలో అనుసరించాల్సిన చర్యలపై అధికారులకు అవగాహన కల్పించబడింది జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ పరిధుల్లో భూముల ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను పరిశీలించి పారదర్శకంగా ప్రజలకు అనుకూలంగా మార్కెట్ విలువల సవరణ ప్రక్రియ చేపట్టాలని అధికారులకు సూచించబడింది ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ బిఎస్ లత ఆర్డీవోలు మధుసూదన్ నరసింహ రావు జీవాకర్ రెడ్డి జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు ఎంపిడివోలు మునిసిపల్ కమిషనర్లు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

## 'ప్రజావాణి' దరఖాస్తులపై నిర్లక్ష్యం వద్దు



- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

**నిర్మల్ జిల్లా ,మే 25 (వుదయం ప్రతినిధి):** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు.

ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## న్యాయవాదుల విధులకు బాయ్‌కాట్

- ధర్మపురి బార్ 'అసోసియేషన్ నిరసన
- అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లును వెంటనే అమలు చేయాలి
- బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బందెల రమేష్ డిమాండ్

**ధర్మపురి,మే 25(వుదయం ప్రతినిధి):** న్యాయవాదులపై పెరుగుతున్న దాడులను అరికట్టాలని,అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లును ప్రభుత్వం వెంట నే పూర్తిస్థాయిలో అమలు చేయా లని డిమాండ్ చేస్తూ ధర్మపురి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం విధులను బహిష్కరించారు.ఇటీవల హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంక్ ప్రాంతంలో సహచర సీనియర్ న్యాయవాది కాజా మొయినుద్దీన్ పై జరిగిన దారుణ హత్యాయత్నాన్ని ధర్మపు రి న్యాయవాదుల సంఘం తీవ్రంగా ఖండించింది.ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు.బార్ అసో సియేషన్ అధ్యక్షుడు బందెల రమేష్ మాట్లాడుతూ సమాజంలో న్యాయం కోసం పోరాడే న్యాయ వాదులకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు.కాజా మొయినుద్దీన్ మరణానికి కార ణమైన బాధ్యులపై ప్రభుత్వం, పోలీసులు తక్షణమే కఠిన చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.న్యాయవాదుల భద్రత కోసం ప్రత్యేక రక్షణ చట్టా న్ని పటిష్టంగా అమలు చేయాల్సి న అవసరం ఎంతైనా ఉందన్నా రు.న్యాయవాదుల హక్కుల కోసం జరిగిన ఈ విధులను బహి ష్కరణ కార్యక్రమంలో బార్ అసో సియేషన్ ప్రధాన కార్యదర్శి రామ దుగు రాజేష్, స్పోర్ట్స్ అండ్ కల్చ రల్ సెక్రటరీ కస్తూరి శరత్ కుమా ర్, సీనియర్ ఈసీ మెంబర్ రౌత్ రాజేష్,జూనియర్ ఈసీ మెంబర్ గొంటి కిరీటి,సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల జిల్లా , మే 25 (వుదయం ప్రతినిధి)** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు.మంచిర్యాల పట్టణానికి చెందిన పొగాకు బుచ్చిబాబు తాము కొనుగోలు చేసిన భూమిలో ఇంటి నిర్మాణం చేపట్టి కొంతమేర చేసి అనివార్య కారణాలతో నిలిపివేయడం జరిగిందని, నిర్మాణ గడువును పొడిగిస్తూ అనుమతి పత్రం జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి పట్టణం ఒర్రెగడ్డ ప్రాంతానికి చెందిన బర్ల సుగుణ తన భర్తకు చెందిన ఆస్తిని ఆయన మరణానంతరం పెద్ద కుమారుడు తన పేరిట మార్పు చేసుకునేందుకు కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఈ క్రమంలో ఆస్తి మార్పిడిపై విచారణ జరిపి తమను రక్షించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మండలం సింగాపూర్ కు చెందిన సల్లూరి పోశమ్మ తన భర్త పేరిట ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ఆయన మరణించారని అట్టి ఇంటిని తనకు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. హాజీపూర్ మండలం నమ్నూర్ గ్రామానికి చెందిన మద్దెల గట్టయ్య తనకు గుడిపేట శివారులో గల భూమి రెవెన్యూ రికార్డులలో తప్పుగా నమోదు అయిందని, సవరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణ రాజీవ్ నగర్ కాలనీకి చెందిన బొల్లం సుజాత తాను ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోగా ఎల్ 1 జాబితాలో ఉండి ఫేజ్ 1, 2 జాబితాలో పేరు రాలేదని, ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం జాఫర్ నగర్ కు చెందిన గెరిక దుర్గ తాము పూల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నామని, రెండు పడక గదుల ఇండ్లలో లక్కీ డ్రా పద్ధతిన ఇల్లు వచ్చిందని, సర్వే చేసి ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ సర్వర్ బి తన భర్త చనిపోయాడని, పిల్లల పోషణ కొరకు తనకు ఆసరా పెన్షన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 91 దరఖాస్తులు వచ్చాయని, ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వుదయం కథనానికి స్పందన



### పోలీస్ తనిఖీల్లో పట్టుబడిన ట్రాక్టర్లు

**మల్హర్ రావు, మే 25 (వుదయం ప్రతినిధి)** తాడిచెర్ల గ్రామ పరిధిలోని మానేరు నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను కొయ్యూరు పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. అక్రమ ఇసుక రవాణాపై వెలువడిన "వుదయం" కథనానికి స్పందించిన పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ఈ చర్యలు చేపట్టారు.

పోలీసుల కథనం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి సమయంలో తాడిచెర్ల గ్రామంలోని మానేరు రివర్ ప్రాంతంలో కొందరు అక్రమార్కులు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం అందడంతో రెండవ ఎస్సై రాజన్ కుమార్ స్పెషల్ టాస్క్ సిబ్బందితో కలిసి పక్కా ప్రణాళికతో మెరుపు దాడులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేశారు. పట్టుబడిన ట్రాక్టర్లలో మూడు తాడిచెర్ల గ్రామానికి చెందినవి కాగా, రెండు మల్లారం గ్రామానికి చెందినవిగా పోలీసులు గుర్తించారు.ఈ ఘటనపై సంబంధిత ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్ కు తరలించి, ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.ఈ దాడుల్లో రెండవ ఎస్సై రాజన్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ మల్లారెడ్డి, పీసీ మధు, స్పెషల్ టాస్క్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కొయ్యూరు ఎస్సై నరేష్ మాట్లాడుతూ మానేరు ప్రాంతంలో అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలించినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రకృతి వనరులను అక్రమంగా కొల్లగొట్టే వారిపై పోలీసులు, రెవెన్యూ శాఖ సంయుక్తంగా చర్యలు కొనసాగిస్తాయని పేర్కొన్నారు. గ్రామస్తులు కూడా అక్రమ ఇసుక రవాణా సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించాలని సూచించారు.

### చెక్కపెల్లి కుంటలో అరుదైన 'గ్రేటర్ పెయింటెడ్ స్నైప్' పక్షి నమోదు



**జన్నారం, మే 25 (వుదయం విలేకరి)** వన్యప్రాణి పరిశోధకుడు డా.ఏనగందుల వెంకట్ జన్నారం శివారులోని చెక్కపెల్లి కుంటలో అరుదైన 'గ్రేటర్ పెయింటెడ్ స్నైప్' (Rostratula benghalensis) పక్షిని చిత్రీకరించారు.ఈ చిత్తడి నేలల పక్షిలో ఆడ పక్షి మగ పక్షికంటే పెద్దదిగా, ఆకర్షణీయంగా ఉంటుందని,గుడ్ల పొదిగింపు బాధ్యత మగ పక్షిదేనని, పురుగులు, నత్తలను తిని చిత్తడి నేలల సమతౌల్యాన్ని కాపాడుతుందని వివరించారు. IUCN ప్రకారం "లీస్ట్ కన్సర్న్"లో ఉన్నా, చిత్తడి నేలల విధ్వంసం వల్ల స్థానికంగా ముప్పు ఉందన్నారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, "ఈ నమోదు జన్నారం చిత్తడి నేలల ప్రాధాన్యతను తెలియజేస్తోందని, వీటి పరిరక్షణతో జీవవైవిధ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు.

### వడదెబ్బతో కూలీ మృతి

**జన్నారం, మే 25(వుదయం విలేఖరి)** జన్నారం గ్రామానికి చెందిన యాట ఇందయ్య (60) అనే భవన నిర్మాణ కూలీ వడదెబ్బ తగిలి మృతి చెందాడు. మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం, ఇందయ్య రెండు రోజుల క్రితం భవన నిర్మాణ కూలి పనులకు వెళ్లాడు. పనులు చేస్తుండగా వడదెబ్బ తగిలి స్పృహ కోల్పోయాడు. వెంటనే జన్నారంలోని ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు.మృతుడు ఇందయ్యకు భార్య దుబ్బరాజు,కుమారులు గంగాధర్, జగన్ ఉన్నారు. వారికి వివాహం అయ్యింది. నిరుపేద కుటుంబానికి చెందిన ఇందయ్య మృతితో విషాదంలో ఉన్న కుటుంబాన్ని జన్నారం సర్పంచ్ అజ్మీర కళావతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అజ్మీర నందు నాయక్ పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని వారు భరోసా ఇచ్చారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ధాన్యం అన్‌లోడ్‌లో జాప్యం సహించం



**మంత్రి జూపల్లి కృష్ణారావు వరి కొనుగోలులో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరిక**

**నాగర్ కర్నూల్, మే 25 (వుదయం ప్రతినిధి)**

ప్రతి రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని, ధాన్యం అన్‌లోడ్‌లో జాప్యం సహించబోమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు. వరి కొనుగోలు ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సోమవారం జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు మంత్రి ఆకస్మికంగా రైస్ మిల్లులను తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్, జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జీ పాటిల్‌తో కలిసి నాగర్‌కర్నూల్‌లోని సత్యసాయి రైస్ మిల్లు, చందుబట్లలోని శ్రీ వెంకటేశ్వర అగ్రో ఇండస్ట్రీస్‌ను సందర్శించి వరి ధాన్యం కొనుగోలు, నిల్వలు, అన్‌లోడింగ్ ప్రక్రియలను పరిశీలించారు.మిల్లుల వద్ద రోజుల తరబడి ధాన్యం లోడుతో లారీలు నిలిచిపోయి ఉండటాన్ని గమనించిన మంత్రి మిల్లర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం అన్‌లోడ్ ప్రక్రియలో ఎందుకు జాప్యం? రైతుల లారీలు రోజులు తరబడి ఎందుకు నిలుపుతున్నారు? అంటూ యాజమాన్యాలను ప్రశ్నించారు. తాలు, తరుగు పేరుతో జరుగుతున్న అక్రమాలను సహించబోమని, రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలింపులో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. మిల్లుల వద్ద ప్రతి లారీ సమయానికి అన్‌లోడ్ అయ్యేలా పర్యవేక్షించాలని, అవసరమైతే ప్రత్యేక పోలీస్ నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీని ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు, రవాణా, అన్‌లోడింగ్ ప్రక్రియలను వేగవంతం చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లారీల కదలికను రియల్ టైమ్‌లో పర్యవేక్షించేలా వ్యవస్థను బలోపేతం చేస్తామని, అన్‌లోడింగ్‌లో జాప్యం లేకుండా తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందిని ప్రత్యేకంగా నియమిస్తున్నామని వివరించారు. తాలు, తరుగులో పారదర్శకత పాటించాలని, అక్రమాలు జరిగితే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమరేందర్, డీఎస్పీ శ్రీనివాసులు, పౌరసరఫరాల శాఖ అధికారులు, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత – మంత్రి కొండా సురేఖ



**పర్యావరణ పరిరక్షణతోనే భావితరాలకు భద్రమైన భవిష్యత్ – మంత్రి దామోదర రాజనర్సింహ**

**సంగారెడ్డి, మే,25:-- వుదయం జిల్లా ప్రతి నిధి.**

అడవుల నరికివేత, పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో రూ.1.44 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన జిల్లా అటవీశాఖ కార్యాలయ భవనాన్ని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మరియు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, టి జి ఐ సి చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వన మహోత్సవ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా బొంతపల్లి సమీపంలో "అమృతవనం", "హరితవనం" పేర్లతో రెండు ఆధునిక ఎకో పార్కులను అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు.సంగారెడ్డి, పరిసర ప్రాంతాల ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ప్రకృతి అందాలను ఆస్వాదించేలా పార్కుల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించినట్లు మంత్రి తెలిపారు. పర్యాటకుల స్పందన ఆధారంగా 'నైట్ స్టే' సౌకర్యాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అడవుల సంరక్షణ కోసం అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని, రిజర్వ్ ఫారెస్టుల చుట్టూ పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసి అడవి జంతువులు గ్రామాల్లోకి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలోనే నారాయణఖేడ్, జహీరాబాద్‌తో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా ప్రకృతి వనాల ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని సంరక్షించడం ద్వారా ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావాలని ప్రజలకు ఆమె పిలుపునిచ్చారు.ప్రకృతి సంపదను సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణ ద్వారానే భావితరాలకు భద్రమైన భవిష్యత్ అందించగలమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, మరియు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వన మహోత్సవ కార్యక్రమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటడం, ప్రకృతి వనాలను అభివృద్ధి చేయడం జరుగుతోందని తెలిపారు. సంగారెడ్డి జిల్లా బొంతపల్లి వద్ద ఏర్పాటు చేసిన అమృతవనం, హరితవనం వంటి ఎకో పార్కులు ప్రజలకు ప్రకృతి సౌందర్యాన్ని చేరువ చేయడంతో పాటు పర్యావరణ సమతుల్యతకు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పి జి ఐ ఐ సి చైర్ పర్సన్ నిర్మల జయప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్, నారాయణఖేడ్ శాసనసభ్యులు డా. సంజీవరెడ్డి, సంగారెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ వనిత సంతోష్, జిల్లా అటవీశాఖ అధికారి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం: సీఎం రేవంత్ రెడ్డి



**రాష్ట్రవ్యాప్తంగా 8,000 మహిళా సంఘాల భవనాలకు వర్చువల్ శంకుస్థాపన**
**జూన్ 5న మహిళల ఆధ్వర్యంలో నడిచే 553 అద్దె బస్సుల ప్రారంభం**
**కార్పొరేట్ సంస్థల కంటే మిన్నగా 'మహిళా శక్తి సూపర్ బజార్లు**
**సిద్దిపేటలో 34 నూతన భవనాలు; మహిళలకు రూ.57.28 లక్షల చెక్కుల పంపిణీ**

**సిద్దిపేట, మే 25 (వుదయం బ్యూరో ప్రతినిధి)**

తెలంగాణ ఆడబిడ్డల ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం మహిళల ఆర్థిక అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా.. సోమవారం సెక్రటేరియట్ నుంచి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఆయన వర్చువల్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 8,000 స్వయం సహాయక మహిళా సంఘాల భవనాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మహిళలకు అందించే 'చిలుకపచ్చ రంగు ఇందిరమ్మ చీరల' డిజైన్లను సీఎం ఆవిష్కరించారు. ఈ వర్చువల్ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సెర్ప్ సీఈఓ దివ్యరాజన్, మహిళా & శిశు అభివృద్ధి శాఖ డైరెక్టర్ శృతి ఓజా సహా వివిధ జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. దేశంలోనే ఇది ఒక సంచలనం: సీఎం రేవంత్ రెడ్డిశంకుస్థాపన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "ఒకేసారి 8,000 మహిళా భవనాలకు శంకుస్థాపన చేయడం దేశంలోనే ఒక సంచలన నిర్ణయం. 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం" అని ప్రకటించారు. ముఖ్యమంత్రి తన ప్రసంగంలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల్లోనే మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. ఇందుకోసం ఇప్పటివరకు ఆర్టీసీకి రూ. 10,000 కోట్లు చెల్లించాం అన్నారు. మహిళలను బస్సులకు యజమానులను చేసేందుకు 1,000 బస్సులను కొనుగోలు చేయించి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేలా చర్యలు తీసుకున్నాం. జూన్ 5న పరేడ్ గ్రౌండ్‌లో 553 బస్సులను ప్రారంభించబోతున్నాం అన్నారు. సోలార్ ఎనర్జీ అంటే అదానీ, అంబానీలే కాదు.. ఇకపై మన మహిళా సంఘాలు కూడా 1,000 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయబోతున్నాయి. రిలయన్స్ లాంటి సంస్థలు చేసే పెట్రోల్ బంక్ వ్యాపారాన్ని మహిళా సంఘాలకు అప్పగిస్తున్నాం. బ్యాంకు లింకేజీ రుణాల పరిమితిని రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచాం. ఇప్పటివరకు రూ. 60,000 కోట్ల రుణాలు అందించగా, సున్నా వడ్డీ పథకం కింద ప్రభుత్వం రూ. 1,390 కోట్లు చెల్లించింది. పెద్ద వ్యాపారులు అప్పులు ఎగ్గొట్టి పారిపోతుంటే, మహిళలు మాత్రం ప్రతి రూపాయిని నిక్కచ్చిగా చెల్లిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మహిళా సంఘాలు రైస్ మిల్లులు, ప్లాస్టిక్ పార్కులు, మండల కోవాలి. ఇందుకోసం 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉన్నాం. వీటికి సున్నా వడ్డీతో బ్యాంక్ రుణాలు ఇప్పిస్తాం. ఇకపై మహిళా సంఘాలే వడ్లు కొనుగోలు

ముఖ్యమంత్రి వర్చువల్ సమావేశం అనంతరం సిద్దిపేట జిల్లా కలెక్టర్ స్థానిక మహిళా సంఘాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళా స్వయం సమృద్ధి అంటే కేవలం ఒక మహిళ అభివృద్ధి కాదని, అది సమాజ అభివృద్ధి అని కొనియాడారు. సిద్దిపేట జిల్లాలో ఇప్పటికే 300 మహిళా శక్తి భవనాలు ఉండగా, మరో 78 భవనాల నిర్మాణం ప్రగతిలో ఉంది. నేడు ముఖ్యమంత్రి వర్చువల్ గా మరో 34 మహిళా శక్తి భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఒక్కో భవనానికి రూ. 10 లక్షల కేటాయించామని, నిర్మాణాలు నాణ్యతతో జరిగేలా మహిళా సంఘాలు పర్యవేక్షించాలని కోరారు. సీఎం ఆదేశాల మేరకు మొదటగా జిల్లా కేంద్రంలో, ఆ తర్వాత మండలాల వారీగా సూపర్ మార్కెట్ల ఏర్పాటుకు స్థలాలు కేటాయిస్తామన్నారు. ఈ బజార్లలో కల్తీ లేని నాణ్యమైన ఆహార పదార్థాలను 'అమ్మ ప్రేమతో' అందించాలని పిలుపునిచ్చారు. వచ్చే రబీ సీజన్ నాటికి ధాన్యం నిల్వ చేసుకునేలా ప్రతి మండలంలో గోదాముల నిర్మాణానికి స్థలాలను కేటాయించి, త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా మహిళా సంఘాలకు రూ. 21 లక్షల 28 వేల వరి ధాన్యం కొనుగోలు కమిషన్ చెక్కును, అలాగే ఆర్టీసీ అద్దె బస్సు కొనుగోలు అడ్వాన్స్ నిమిత్తం రూ. 36 లక్షల విలువైన చెక్కును (మొత్తం రూ. 57.28 లక్షలు) అందజేశారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో జయదేవ్ ఆర్య, జిల్లా సంక్షేమ అధికారి శారద, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రేణుక, వివిధ మండలాల సమాఖ్యల అధ్యక్షురాళ్లు, అధికారులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఉన్నత స్థానానికి ఎదగాలి ఎమ్మెల్యే జీఎంఆర్



**వనపర్తి మే 25 (వుదయం ప్రతినిధి)**

ఇందిరా మహిళా శక్తితో మహిళలు సంపద సృష్టికర్తలుగా మారి ఆర్థికంగా ఉన్నత స్థానానికి ఎదగాలి: దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలు సంపద సృష్టికర్తలుగా మారి, ఉన్నత స్థాయికి ఎదగాలని సీఎం రేవంత్ ఆశయమని మహిళలు దిశగా ముందుకెళ్లాలని దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కొత్తకోట మండలం విలియం కొండ గ్రామ శివారులోని ఫంక్షన్ హాల్ లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక మహిళా శక్తి వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో కొత్తకోట మండలానికి చెందిన 33 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను అదేవిధంగా ఇద్దరు లబ్ధిదారులకు షాది ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే, కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలు సంపద సృష్టికర్తలుగా మారి, ఉన్నత స్థాయికి ఎదగాలని సీఎం రేవంత్ ఆశయమని మహిళలు దిశగా ముందుకెళ్లాలని సూచించారు. ఇందిరా మహిళా శక్తి ద్వారా కోటి మంది మహిళలని కోటీశ్వరుని చేయడమే సీఎం రేవంత్ లక్ష్యమని తెలిపారు. రాబోయే రోజుల్లో మహిళా సంఘాల ద్వారా సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని తెలిపారు. ఇప్పటికే మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులను, బస్సులను ఏర్పాటు చేయడం జరుగుతుందని, మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే మహిళల కోసం ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, మహిళా సంఘాల సభ్యురాళ్లకు ప్రమాద బీమా, 200 యూనిట్ల ఉచిత కరెంటు సహా ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తుందని తెలిపారు. రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తోందని, అదేవిధంగా రాబోయే రోజుల్లో పాఠశాలల్లో విద్యార్థులకు మార్నింగ్ బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని కూడా అమలు చేయనుందని తెలిపారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మహిళా శక్తి వారోత్సవాల్లో భాగంగా నేడు మీరాశి పల్లి గ్రామ శివారులో మహిళా సంఘాల ద్వారా ఎకరా స్థలంలో రెండు కోట్ల రూపాయల వ్యయంతో పెట్రోల్ బంకు నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా కొత్తకోట మదనాపూర్ మండలం మహిళా సమాఖ్యల ద్వారా రెండు ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేసి నడపడం జరుగుతుందని వాటికి ఈ రోజే ప్రారంభం చేయడం జరిగిందని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల సాధికారతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని లక్ష్యంతో కొత్తకోట మదనాపూర్ మండలాల సమాఖ్యల ద్వారా రెండు బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీలో నడపడం జరుగుతుందని తెలిపారు. ఇదే కాకుండా ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు అనేక ఉపాధి వ్యాపార అవకాశాలు ప్రభుత్వం కల్పిస్తుందని తెలియజేశారు. ఏదైనా వ్యాపారంపై ఆసక్తి కలిగిన మహిళలు ఉంటే వారు ముందుకు వస్తే ప్రభుత్వం శిక్షణ ఇప్పించి వ్యాపారం పెట్టించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో కొత్తకోట మున్సిపల్ చైర్ పర్సన్ అరుణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రశాంత్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ సునీత పల్లవి, డి ఆర్ డి ఓ ఉమాదేవి, ఇతర అధికారులు ప్రజాప్రతినిధులు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## మండే కాలం.. మహిళలపై ప్రభావం!



**వికారాబాద్ మే 25 (వుదయం బ్యూరో)**

తారెత్తిస్తున్న ఎండలకు భూమి విపరీతంగా వేడెక్కుతోంది. పగలు, రాత్రి తేడా లేకుండా వడగాలులు వీస్తున్నాయి. ఈ విపరీతాలన్నీ వాతావరణంలో వస్తున్న మార్పులు మాత్రమే కాదు... ఈ వేడి మహిళల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. మండే ఎండల్లో కుటుంబం గడవడం కోసం కూలీనాలీ చేసుకునే మహిళలు మనచుట్టూ ఎంతోమంది. ఎండల వల్ల ఆ మహిళలు ఎంతో ఒత్తిడిని ఎదుర్కొంటారు. ఈ ప్రభావం వారి పునరుత్పత్తి సామర్థ్యంపై పడుతోంది. ముందస్తు ప్రసవాలు సంభవిస్తున్నాయి. "వడగాలుల ప్రభావం వల్ల కలిగే దీర్ఘకాల ఆరోగ్య సమస్యలకు మహిళలే ఎక్కువశాతం గురవుతున్నారు. ఈ కారణంగా సంభవించే మరణాల్లో కూడా వారి సంఖ్య పెరుగుతోంది" అని 2024లో భారత వాతావరణ శాఖ ప్రచురించిన అధ్యయనంలో తేలింది. ఎండలకు గొంతు తడారిపోతున్నా కాసిన్ని నీళ్లు తాగలేని పరిస్థితి షాపింగ్ మాల్స్‌లో పనిచేస్తున్న మహిళలు ఎదుర్కొంటున్నారు. అలా ఒక వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న నారాయణమ్మ తన అనుభవాన్ని ఇలా చెప్పింది. "ఉదయం పది గంటలకు షాపునకు వెళతాను. అన్నం బాక్సుతో పాటు నీళ్ల సీసా తీసుకెళతాను. బయట భగ్గుమంటున్న వేడికి సీసాలో నీళ్లు కాలిపోతున్నాయి. దాహం వేసినప్పుడు వాటిని తాగలేం. షాపులో ఎక్కడో మంచినీళ్లు ఉంటాయి. పదే పదే అక్కడికి వెళ్లడం కుదరదు. ఎప్పుడో మధ్యాహ్నం భోజనం చేసేటప్పుడు చల్లని నీళ్లు తెచ్చుకుని తాగుతాను" అంటోంది. ఈ పరిస్థితి నారాయణమ్మ ఒక్కదానిదే కాదు; పెద్ద, చిన్నా మాల్స్‌లో పనిచేస్తున్న ఎంతోమంది మహిళలది. ఎండాకాలం వదులైన దుస్తులు ధరించాలి. కానీ షాపింగ్ మాల్స్‌లో పనిచేసే మహిళలకు ఆ సౌలభ్యం ఉండదు. ఈ కారణంగా కూడా వారు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు.మన దేశంలో చాలీచాలని గదులలో, నెత్తికి చూరు తగులుతున్న ఇళ్లల్లో నివసించే వారు అనేకమంది ఉంటారు. అరవై ఏళ్ల విజయమ్మ తాడేపల్లి సుందరయ్య కట్ట మీద ఓ చిన్న రేకుల ఇంట్లో నివసిస్తోంది. "మూడేళ్ల నుండి ఎండలు విపరీతంగా మండిపోతున్నాయి" అంటోంది. "వేడి తట్టుకోలేక పొరుగింట్లోకి వెళ్లి తలదాచుకుంటున్నా" అని

ఇంట్లో, బయటా ఒకేలాంటి పరిస్థితి! మన దేశంలో అనేక చోట్ల మహిళలు ఇంటి అవసరాలకు కిలోమీటర్ల కొద్దీ ఎండలో నడిచి నీళ్లు సేకరిస్తారు. పంట కోయడం, పశువులను సంరక్షించడంలో కూడా మహిళల భాగస్వామ్యం ఎక్కువ. పనులకు వెళ్లే మహిళలే కాదు, ఇంట్లో ఉండే మహిళలు కూడా ఒకేలాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ ఎండల్లో పిల్లల సంరక్షణ, ఇంటి నిర్వహణ మహిళలపై అదనపు భారాన్ని తెచ్చిపెడుతోంది. ప్రపంచవ్యాప్తంగా పలు అధ్యయనాలు ఎక్కువకాలం వేడికి గురవ్వడం ఆందోళన, నిద్రలేమి, భావోద్వేగ ఒత్తిడి, మానసిక క్షోభ పెరగడానికి కారణమవుతుందని చెబుతున్నాయి. ఈ వేడి కారణంగా మహిళలకు ఆరోగ్య పరంగానే కాదు, సన్నిహిత భాగస్వాముల నుండి ఎదుర్కొనే హింస కూడా తీవ్రమవుతోందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ శతాబ్దం చివరి నాటికి నేపాల్ (14.8), పాకిస్తాన్ (5.9) శాతాలతో పోలిస్తే భారత్‌లో (23.5) శాతానికి ఈ హింస పెరుగుతుందని నిపుణులు అంచనా వేశారు. "ఇక నుండి వాతావరణ మార్పు గురించి మాట్లాడేటప్పుడు ఉష్ణోగ్రతల్ని మాత్రమే కాదు, ఆ వేడిని మోస్తున్న మహిళల జీవితాల్ని కూడా చూడాలి" అని ఈ గణాంకాలు చెబుతున్నాయి.

## ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాలను నిర్వహించుకుంటున్నాం



సెక్రటేరియట్ నుంచి వర్చువల్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

వికారాబాద్ మే 25( వుదయం బ్యూరో)ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాలను నిర్వహించుకుంటున్నామని, మహిళలను ఆర్థికంగా నిలబెట్టే అద్భుతమైన కార్యక్రమం ,8000 భవనాలకు ఒకే సారి శంకుస్థాపన చేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. దేశంలోనే ఇది ఒక సంచలన నిర్ణయం,తెలంగాణ ఆడబిడ్డల ఆశీర్వాదంతో ప్రజా ప్రభుత్వం ఏర్పడింది.. మహిళల అభివృద్ధి సాధించినప్పుడు రాష్ట్రం ఆర్థికంగా నిలబడుతుంది.. ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తోందని అన్నారు. సెక్రటేరియట్ నుంచి వర్చువల్ గా 8000 వేల స్వయం సహాయక మహిళా సంఘాల భవనాల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. హాజరైన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క,శ్రీధర్ బాబు,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,రాజ్య సభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణు గోపాల్,ఎంఎల్ ఏ లు, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయ లక్ష్మి , వివిధ కార్పొరేషన్ల చైర్మన్ లు ,సిఎంఒ ముఖ్య కార్యదర్శి శేషాద్రి,పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిశోర్,ఎండోమెంట్స్ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్,మహిళా, శిశు అభివృద్ధి & సామాజిక సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, సెర్ప్ సీఈఓ దివ్య, మహిళా & శిశు అభివృద్ధి శాఖ డైరెక్టర్ శృతి ఓజా. వర్చువల్ గా పాల్గొన్న స్వయం సహాయక సంఘాల మహిళలు, జిల్లా కలెక్టర్లు,ఉన్నతాధికారులు. బటన్ నొక్కి వర్చువల్ గా 8000 ఇందిరా గాంధీ స్త్రీ శక్తి భవనాలకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.2023 డిసెంబర్ 7 న ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండు రోజుల్లోనే ఆర్టీసీలో మహిళలకు ఉచి త ప్రయాణం కల్పించామన్నారు.ఇప్పటి వరకు ఉచిత ప్రయాణం కోసం 10 వేల కోట్ల రూపాయలను ఆర్టీసీకి చెల్లించామని ,మహిళా అభ్యున్నతే రాష్ట్ర అభివృద్ధి అని భావించి ఉచిత బస్సు ప్రయాణం ఇస్తున్నామన్నారు. జూన్ 5 న పరేడ్ గ్రౌండ్ లో 553 బస్సులను ప్రారంభించబోతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 1000 మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్లను మహిళా సంఘాలతో ఏర్పాటు చేయిస్తున్నాం.. రిలయన్స్ వాళ్లు చేసే పెట్రోల్ బంక్ వ్యాపారాన్ని మహిళా స్వయం సహాయ సంఘాలతో చేయిస్తున్నాం.. మారుమూల గ్రామాల్లోని మహిళలు ఆర్థికంగా నిలబడాలన్నదే ప్రభుత్వం యొక్క ప్రయత్నం.5 లక్షల వరకు బ్యాంక్ లింకేజీ లోన్లను 10 లక్షలకు పెంచుతున్నామన్నారు. ఇప్పటి వరకు 60 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ లోన్లు అందించామన్నారు. మహిళా సంఘాలు రైస్ మిల్లులు ఏర్పాటు చేసుకోవాలి.. మండలాల్లో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. వర్చువల్ సమావేశము అనంతరముఏర్పాటు చేసిన సమావేశములో మహిళా సమాఖ్య ప్రతిజ్ఞ తో సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక లో బాగంగా ఈ రోజు నుండి ఈ నెల 30 వరకు మహిళా వారోత్సావాలు జరుపుకుంటున్నామని, జిల్లా లో 406 వి ఓ బిల్డిం ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, డి అర డి ఎ శ్రీనివాస్, మహిళా సమాఖ్య సభ్యులు, జానకి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక



**నారాయణపేట మే 25 (వుదయం ప్రతినిధి)**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదు లను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రియాంక అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత ప్రజా వాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 35 ఫిర్యాదు లు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను,లకు విన్న విస్తూ అర్జీలు సమర్పించా రు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్ర మంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గద్వాల రూపురేఖలు మారనున్నాయా?



**₹100 కోట్ల కోర్టు సముదాయం... భారత్‌మాల కనెక్టివిటీతో ఎర్రవల్లి కారిడార్‌పై అభివృద్ధి ఫోకస్**

**గద్వాల మే 25 (వుదయం బ్యూరో)**

గద్వాల ఒకప్పుడు సాధారణ ప్రభుత్వ భూమిగా కనిపించిన ఎర్రవల్లి కారిడార్ ప్రాంతం... ఇప్పుడు జిల్లా భవిష్యత్ అభివృద్ధికి కేంద్రబిందువుగా మారే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పరిపాలన, న్యాయ, రవాణా రంగాల విస్తరణతో గద్వాల నగరం కొత్త దిశగా అడుగులు వేస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రత్యేకంగా సర్వే సంఖ్య. 368లో ప్రతిపాదిత జిల్లా కోర్టు సముదాయం నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియ వేగం అందుకుంది. రెవెన్యూ, ఆర్&బి శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు స్థల పరిశీలన పూర్తి చేసినట్లు సమాచారం. లొకేషన్ స్కెచ్ మ్యాప్ సిద్ధమై, తుది స్థాయి ప్రణాళికలు కొనసాగుతు న్నాయని అధికార వర్గాల్లో చర్చ జరుగు తోంది. జూన్ తొలి వారంలో శంకుస్థాపన జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.కోర్టు సముదాయం కాదు...భవిష్యత్ అర్బన్ గ్రోత్‌కు కేంద్రం!ప్రతిపాదిత 12 కోర్టుల సముదాయం కేవలం న్యాయ భవనం మాత్రమే కాదు... భవిష్యత్ పట్టణ విస్తరణకు కేంద్రంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సముదాయం ఏర్పడితే జిల్లా స్థాయి న్యాయ సేవలు ఒకేచోట అందుబాటులోకి రానున్నాయి. వేలాది కేసుదారులు, న్యాయవాదులు, సిబ్బంది రాకపోకలు పెరగనున్నాయి.దీంతో పాటు:అడ్వకేట్ కార్యాలయాలునోటరీ & డాక్యుమెంట్ సెంటర్లుబ్యాంకులుహోటళ్లు, సముదాయాలువేగంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని రియల్ ఎస్టేట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.భారత్‌మాల - 4 లైన్ ప్రభావంరాయచూరు-ఎర్రవల్లి 4 లైన్ హైవే, భారత్‌మాల ప్రాజెక్టులు, భవిష్యత్ ORR కనెక్టివిటీ ఈ ప్రాంత ప్రాధాన్యతను మరింత పెంచుతున్నాయి. రోడ్డు కనెక్టివిటీ మెరుగుపడితే రియల్ ఎస్టేట్ విలువలు పెరగడంతో పాటు ట్రాన్స్‌పోర్ట్, లాజిస్టిక్స్ రంగాలు కూడా విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి.కొత్త వ్యాపార సముదాయాలు, గోదాములు, ట్రావెల్ & సర్వీస్ రంగాల విస్తరణతో ప్రస్తుతం ప్రశాంతంగా కనిపిస్తున్న ఈ ప్రాంతం రాబోయే సంవత్సరాల్లో "న్యూ గద్వాల అర్బన్ బెల్ట్"గా మార వచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతు న్నాయి.విద్యా - వైద్య రంగాలకు ఊతం?పట్టణ విస్తరణ, హైవే కోర్టు సముదాయం, హైవేలు, పరిపాలనా విభాగాల విస్తరణ—— ఆల్ కలిసి ఈ ప్రాంతాన్ని భవిష్యత్‌లో ప్రధాన అభివృద్ధి కారిడార్‌గా మార్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.అభివృద్ధి ఒక్కరోజులో కనిపించదు.కానీ ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టులు, రహదారులు, విద్యా-వైద్య సంస్థలు ఒకే ప్రాంతం చుట్టూ కేంద్రీకృతం కావడం ప్రారంభమైనప్పుడు... అక్కడ భవిష్యత్ నగర రూపకల్పన మొదలైన ట్లేనని నిపుణులు చెబుతున్నారు. గద్వాల ఇప్పుడు అలాంటి మార్పు దశలో నిలిచిం దనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## కొనుగోలు కేంద్రాలలో ఎక్కడి వడ్ల కుప్పలు అక్కడే!



**మెదక్ జిల్లా వుదయం ప్రతినిధి**

నిజాంపేట మండలం కల్వకుంట,రజాక్‌పల్లి, సొసైటీ కొనుగోలు కేంద్రంలో కాంటాలు కాకపోవడంతో వడ్ల కుప్పలు ఎక్కడికక్కడే పేరుకుపోయాయి.ధాన్యం తెచ్చి 45 రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. కొనుగోలు కేంద్రం ఇన్‌ఛార్జ్, సీఈవో గత 20 రోజుల నుండి సెంటర్ వైపు వచ్చిన దాఖలాలే లేవని, తమ గోడు వినేవారే కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు రైతుల నుండి కాంటా చేసుకొని రైస్ మిల్లులకు లారీలో తరలించిన ధాన్యం తక్కువ వస్తున్నాయని రైతుల భయ భ్రాంతులకు గురి చేసి వారిని డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. నెలల నుండి రైతులు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి కుప్పలు పోసి తిప్పలు పడుతున్న ఎవరు పట్టించుకున్న పాపనా పోలేదు.ఈ అకాల వర్షాలకు వడ్లు ఎక్కడ తడిసిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని రైతులు ప్రభుత్వ అధికారులకు వేడుకుంటున్నారు.

## ప్రజావాణికి 99 ఫిర్యాదులు

**జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్**

**గద్వాల మే 25 (వుదయం ప్రతినిధి)**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 99 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) తో పాటు, అదనపు కలెక్టర్ నర్సింగరావు, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మధుమోహన్ అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రం సందర్భంగా భక్తి భావంతో అన్నప్రసాద వితరణ



**సంగారెడ్డి వుదయం**

సంగారెడ్డి జిల్లా కేంద్ర ఆసుపత్రి ఆవరణలో అయ్యప్ప స్వామి వారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని భక్తి శ్రద్ధలతో అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ సాహితీ రాము సాహితి హాస్పిటల్ ఎండీ ఆధ్వర్యంలో నిర్వహించగా, భక్తులు, రోగుల బంధువులు, ఆసుపత్రి సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అయ్యప్ప స్వామి కృపతో ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యాలు నెలకొనాలని ఆకాంక్షిస్తూ భక్తి భావంతో అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆసుపత్రికి వచ్చిన పలువురు రోగులు, వారి కుటుంబ సభ్యులు ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, సేవే మాధవ సేవ అనే భావనతో సమాజ సేవలో భాగంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ శాంతులతో ఉండాలని కోరుకున్నారు.

# మీ బ్యాంక్ ఖాతాకు 'నామినీ' ఉన్నారా? మీ కుటుంబ ఆర్థిక భద్రత మీ చేతుల్లోనే!



**జహీరాబాద్ మే 25 (వుదయం ప్రతినిధి)**

కోహీర్ మండలం పరిధిలోని ఆయా గ్రామ లో నామిని ఆర్థిక భద్రత కార్యక్రమం నిర్వహించడం జరిగింది దన్ పౌండషన్ సీ ఎఫ్ ఎల్ కోఆర్డినేటర్ సంపూర్ణ మాట్లాడుతూ క్రమశిక్షణ అంటే కేవలం డబ్బు దాచుకోవడం మాత్రమే కాదు, ఆ డబ్బు మన తర్వాత మన కుటుంబానికి సులభంగా అందేలా చూడటం కూడా. అందుకే RBI ఇప్పుడు నామినేషన్ ప్రక్రియను మరింత సరళతరం మరియు తప్పనిసరి చేసింది.ముఖ్యమైన RBI అప్‌డేట్స్ (2025-26):నలుగురు నామినీలు:ఇప్పుడు ఒకే ఖాతాకు గరిష్టంగా నలుగురు (4) నామినీలను నియమించుకోవచ్చు. (గతంలో ఒకరికే మాత్రమే అవకాశం ఉండేది.)వాటా నిర్ణయం (Share %):నలుగురు నామినీలకు ఎంత శాతం చొప్పున వాటా ఇవ్వాలనేది మీరు నిర్ణయించుకోవచ్చు.అన్నారు ఈ కార్యక్రమం లో అసోసియేట్ స్వప్న తదితరులు పాల్గొన్నారు

# ప్రైవేట్ పాఠశాలల దోపిడీపై చర్యలు తీసుకోవాలి



**ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయానికి వినతిపత్రం**

**ముషీరాబాద్,మే25( వుదయం)**

ముషీరాబాద్ మండలం పరిధిలోని పలు ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వం నిర్దేశించిన విద్యా నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నాయని స్థానిక తల్లిదండ్రులు, ప్రజాసంఘాల నాయకులు ఆరోపించారు. ఈ మేరకు యాడ్ ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ముషీరాబాద్ జోన్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ లక్ష్మణ్ సింగ్‌కు వినతిపత్రం సమర్పించారు.పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, యూనిఫార్ములు మరియు ఇతర విద్యా సామగ్రిని తమ వద్దనే కొనుగోలు చేయాలని బలవంతం చేస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తల్లిదండ్రులు తమకు నచ్చిన దుకాణాల్లో పుస్తకాలు, యూనిఫార్ములు కొనుగోలు చేసుకునే హక్కు ఉన్నప్పటికీ, కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ఆ హక్కును కాలరాస్తూ అధిక ధరలకు సామగ్రిని విక్రయిస్తున్నాయని విమర్శించారు. దీంతో సాధారణ, మధ్య తరగతి మరియు పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.అలాగే ఎస్.సి,ఎస్.టి,బి.సి మరియు మైనారిటీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు ప్రభుత్వం అందించాల్సిన ఉచిత విద్య, పుస్తకాలు, యూనిఫార్ములు, రవాణా తదితర సంక్షేమ సదుపాయాలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని ఆరోపించారు. విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి ప్రైవేట్ పాఠశాలలు దోపిడీకి పాల్పడుతున్నాయని మండిపడ్డ నాయకులు, ఈ వ్యవహారంపై జిల్లా విద్యా శాఖ అధికారులు ప్రత్యేక విచారణ చేపట్టి నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే పేద విద్యార్థులకు ప్రభుత్వం కల్పించిన అన్ని విద్యా హక్కులు సమర్థవంతంగా అమలు అయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు మరియు ప్రజాసంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యాడ్ ధర్మ సమాజ్ పార్టీ ముషీరాబాద్ అధ్యక్షుడు గూడపర్తి సంతోష్ కుమార్, నాయకులు శివ ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు వరంగా మారిందని ఎల్ వో సి



**మెదక్ జిల్లా వుదయం ప్రతినిధి**

నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ గ్రామానికి చెందిన పిట్ల కృష్ణ కు అనరోగ్యరీత్యా కార్పొరేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం వెళ్లడం జరిగింది. కుటుంబార్థిక పరిస్థితి బాగా లేనందున వైద్య సౌకర్యాల కొరకు స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సహకారంతో రెండు లక్షల రూపాయల ఎల్ఓసిని గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో వారికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు వైద్య సౌకర్యాలు కొరకై స్థానిక ఎమ్మెల్యేకు విన్నవించగా వెంటనే స్పందించి రెండు లక్షల రూపాయల ఎల్ఓసిని మంజూరు చేసిన ఎమ్మెల్యే రోహిత్ రావుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు నాతి లక్ష్మ గౌడ్, బక్కన్నగారి లింగం గౌడ్, శ్రీనివాస్, బక్కన్న గారి నర్సాగౌడ్, ఎండి సలీం, కృష్ణ గౌడ్, యాదవ రెడ్డి, రమేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగ సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

**దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు,**
**ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులపై దివ్యాంగుల వినతి,**
**జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ హామీ,**

**నాగర్ కర్నూల్ మే 25 (వుదయం ప్రతినిధి)**



జిల్లాలో దివ్యాంగుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ హామీ ఇచ్చారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసిన దివ్యాంగుల ప్రతినిధులు తమ సమస్యలను వివరించి పలు కీలక డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ వారిని తన ఛాంబర్‌లోకి ఆహ్వానించి కూర్చోబెట్టి వారి సమస్యలను ఓపికగా విన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో దివ్యాంగులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని ప్రతినిధులు కోరారు.ప్రధానంగా ఇందిరమ్మ ఇండ్లలో 5 శాతం రిజర్వేషన్, డబుల్ బెడ్‌రూమ్ గృహాల కేటాయింపులో 5 శాతం వాటా, అలాగే ఆర్థికంగా వెనుకబడిన దివ్యాంగ కుటుంబాలకు అంత్యోదయ రేషన్ కార్డులు మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు.

దివ్యాంగుల సమస్యలు సాధారణ ప్రజావాణిలో పూర్తిగా వినిపించుకునే అవకాశం లేకపోవడంతో, ప్రత్యేకంగా దివ్యాంగుల ప్రజావాణి కార్యక్రమం నిర్వహించాలని కూడా ప్రతినిధులు కలెక్టర్‌ను అభ్యర్థించారు. సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న ఇబ్బందులను వారు నేరుగా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను శ్రద్ధగా విన్న కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. వారికి అందాల్సిన హక్కులు, సౌకర్యాలు చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దివ్యాంగులు సమాజంలో ఆత్మగౌరవంతో జీవించేందుకు అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రంలోని అంశాలను సంబంధిత శాఖాధికారులతో సమీక్షించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్‌రూమ్ గృహాల కేటాయింపులో దివ్యాంగులకు ప్రాధాన్యత కల్పించే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అలాగే అంత్యోదయ కార్డుల మంజూరుపై కూడా పరిశీలన చేపడతామని చెప్పారు.

ప్రత్యేక ప్రజావాణి నిర్వహణ అంశంపై కూడా సానుకూలంగా స్పందించిన కలెక్టర్, దివ్యాంగుల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.కలెక్టర్ స్పందనపై దివ్యాంగుల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ, తమ సమస్యలను ఓపికగా విని భరోసా కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో దివ్యాంగ ప్రతినిధులు రాజశేఖర్ కృష్ణయ్య, నారాయణమ్మ, మంగమ్మ, దేవేందర్ శంకర్, విజయ్ రామస్వామి తదితరులు పాల్గొన్నారు

# మే 30లోగా పెన్షనర్ల లైవ్ ఆథెంటికేషన్ పూర్తి చేయాలి



**జూన్ 9లోగా 100% జనగణన ఎన్యుమరేషన్ లక్ష్యం**
**జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**

**నాగర్ కర్నూల్, మే 25 (వుదయం ప్రతినిధి)**

రాష్ట్ర ప్రభుత్వం అందించే చేయూత పెన్షనర్ల లైవ్ ఆథెంటికేషన్ ప్రక్రియను మే 30లోగా పూర్తి చేయాలని, జూన్ 9లోగా 100 శాతం జనగణన ఎన్యుమరేషన్ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ స్పష్టం చేశారు.సోమవారం నాగర్‌కర్నూల్ పట్టణంలో పెన్షనర్ల లైవ్ ఆథెంటికేషన్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు ఈ ప్రక్రియ అత్యంత కీలకమని పేర్కొన్నారు. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి సేవలు అందించాలని సూచించారు. ఎవరూ పెన్షన్‌కు దూరం కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని, బయోమెట్రిక్ ధృవీకరణలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం అంబేద్కర్ కాలనీలో జనగణనలో భాగంగా కొనసాగుతున్న హౌస్ లిస్టింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు గుర్తింపు కార్డులు ధరించారా లేదా అన్నది గమనించి, ఇప్పటివరకు హౌస్ లిస్టింగ్ ఎంత శాతం పూర్తయ్యిందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్వీయ గణన చేసుకున్న వారి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి పక్కాగా నిర్ధారణ చేసుకోవాలని సూచించారు.జనగణన ప్రక్రియ అత్యంత బాధ్యతాయుతమైన కార్యక్రమమని, ప్రతి ఇంటి వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని, తప్పిదాలకు అవకాశం లేకుండా జాగ్రత్తగా జరపాలని కలెక్టర్ తెలిపారు. జనగణన ప్రగతిపై రోజువారీ నివేదికలు పంపాలని ఆదేశించారు. భవిష్యత్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రణాళికలు, నిధుల కేటాయింపులో జనగణన గణాంకాలే ఆధారమని పేర్కొంటూ, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను గడువులోపు పూర్తి చేయాలని సూచించారు.కలెక్టర్ వెంట నాగర్‌కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, రెవెన్యూ అధికారులు, జనగణన సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌టీపీ పనులు వేగవంతం చేయాలి



**పట్టణ పారిశుధ్యానికి ప్రాధాన్యం..**
**ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం..**
**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**

**నాగర్ కర్నూల్ మే 25 (వుదయం ప్రతినిధి)**

సోమవారం నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, జనగణన ప్రక్రియ పురోగతిపై విస్తృత స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలను పరిశీలిస్తూ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, అధికారులకు పలు సూచనలు చేశారు.మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న రెండు సేవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) పనులను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. పనుల పురోగతి, నిర్మాణ నాణ్యత, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పట్టణ పారిశుధ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో మురుగు నీటి శుద్ధి కేంద్రాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొంటూ, నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.అలాగే నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిధులు సద్వినియోగం అయ్యేలా పర్యవేక్షణ చేపట్టాలని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో ఎస్‌టీపీలు సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.తనిఖీల సందర్భంగా పట్టణంలోని వెజ్ మరియు నాన్‌వెజ్ మార్కెట్లను కూడా పరిశీలించారు. మార్కెట్లలో పరిశుభ్రత, వ్యాపారులకు అందుతున్న సౌకర్యాలు, ప్రజలకు అందుబాటులో ఉన్న మౌలిక వసతులపై వివరాలు సేకరించారు. ముఖ్యంగా నాన్‌వెజ్ మార్కెట్ భవనాన్ని మున్సిపల్ టౌన్ హాల్‌గా అభివృద్ధి చేసే ప్రతిపాదనలపై మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డితో చర్చించారు.

ప్రజలకు సామాజిక, సాంస్కృతిక, అధికారిక కార్యక్రమాలకు ఉపయోగపడే విధంగా టౌన్ హాల్‌ను అభివృద్ధి చేయాలని సూచించిన కలెక్టర్, భవనంలో పార్కింగ్ సౌకర్యం, తాగునీటి వసతి, పరిశుభ్రత, సమావేశాల నిర్వహణకు అనువైన హాల్, విద్యుత్ వంటి సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఉపయోగపడే ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని వేగంగా పూర్తి చేసి, ప్రభుత్వ సేవలు సమర్థవంతంగా అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర,నాగర్ కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు, జనగణన సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

# గజ్వేల్ జిల్లా ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స విజయం : ఒకరి ప్రాణం కాపాడిన వైద్యులు



**గజ్వేల్, 25 మే 2026 : వుదయం**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ప్రధాన ఆసుపత్రి వైద్యులు మరో అరుదైన ఘనత సాధించారు. అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్న ఒక యువతికి అత్యవసర శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా చింతలచెరువు గ్రామానికి చెందిన అశ్విని (29) అనే యువతి తీవ్రమైన "అబ్స్ట్రక్టెడ్ ఇన్సిషనల్ హెర్నియా" సమస్యతో ప్రాణాపాయ స్థితిలో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. బాధితురాలికి పేగులకు రక్తప్రసరణ ఆగిపోవడంతో పాటు గ్యాంగ్రీన్ (కణజాలం కుళ్ళిపోవడం) వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు గుర్తించారు. పరిస్థితి తీవ్రతను గమనించిన ఆసుపత్రి వైద్య సిబ్బంది తక్షణమే స్పందించి అత్యవసర శస్త్రచికిత్సను ప్రారంభించారు. జనరల్ సర్జన్ డాక్టర్ ప్రేమ్, అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ మహిపాల్ నేతృత్వంలోని బృందం ఈ క్లిష్టమైన ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. పేగులు ఎలాంటి నష్టం వాటిల్లకుండా సురక్షితంగా కాపాడగలిగారు. ప్రస్తుతం రోగి కోలుకుంటున్నారని, ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని సూపరింటెండెంట్ వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో నర్సింగ్ ఆఫీసర్ సునీల్, ఓటీ టెక్నీషియన్లు వెంకట్, రాజ్‌కుమార్, పేషెంట్ కేర్ సిబ్బంది రాజు, స్రా, సపోర్టింగ్ స్టాఫ్ యాదమ్మ సమయస్ఫూర్తితో వ్యవహరించి సేవలందించారు. అరుదైన సర్జరీని విజయవంతం చేసిన వైద్య బృందాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ, ఆర్ఎంఓ డాక్టర్ రాము ప్రత్యేకంగా అభినందించారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ అత్యవసర, క్లిష్టమైన కేసులకు నాణ్యమైన వైద్యం అందుతుందనడానికి ఈ ఘటనే నిదర్శనమని వారు పేర్కొన్నారు.

# మహిళా గ్రామ సంఘ భవనాలకు వర్చువల్ గా భూమి పూజ చేసిన

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
**కలెక్టరేట్లో వీసీ ద్వారా వీక్షించిన జిల్లా అధికారులు, మహిళా సంఘాల సభ్యులు**

**గద్వాల మే 25 (వుదయం ప్రతినిధి)**



కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు పెద్ద ఎత్తున రుణాలను ఇచ్చి మహిళల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం చేయూతనిస్తున్నట్లు అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల్లో భాగంగా సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలువురు మంత్రులతో, సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది వేల మహిళ గ్రామ సంఘాల భవనాలకు వర్చువల్ గా భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ మహిళలు తమ గ్రామ సంఘాల సమావేశాలు నిర్వహించు కునేందుకు, ఉపాధి ఆర్టీసీకి అద్దెకిచ్చేందుకు బస్సుల కొనుగోలుకు, సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం సహకరిస్తుందని ఫలితంగా మహిళా సంఘాల సభ్యులు మంచి ఆదాయాన్ని అర్జించవచ్చన్నారు. ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అనేక కార్యక్రమాల నిర్వహిస్తోందని, అందులో భాగంగానే తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. నాణ్యమైన ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీతో మహిళ సంఘాల సభ్యులకు ఒక గుర్తింపును ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పలు జిల్లాల మహిళా సంఘాల సభ్యులు ప్రసంగించారు. గద్వాల ఐడిఓసి సమావేశపు మందిరంలో వీసీ ద్వారా ముఖ్యమంత్రి ప్రసంగాన్ని జిల్లా అధికారులు, మహిళా సంఘాల సభ్యులు తిలకించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ ముషాహిదా బేగం, ఏపీడి శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ప్రభావతమ్మ, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంఘం వివో భవనానికి భూమి పూజ



**మరికల్ మే 25 (వుదయం ప్రతినిధి)**

ధన్వాడ మండలం కేంద్ర పరిధిలోని రామకృష్ణయ్య పల్లి గ్రామంలో సోమవారం మహిళా సంఘం వివో భవనానికి భూమి పూజ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి ఆదేశాల మేరకు చిట్టెం మాధవరెడ్డి వ్యక్తిగత సహాయకులు మరియు రామ కృష్ణ పల్లి గ్రామ సర్పంచ్ కవిత భూమి పూజ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఏపీ ఓ వెంకటేశ్వర రెడ్డి మరియు గ్రామస్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# పాలిసెట్ లో శ్రీ సాయి స్కూల్ విద్యార్థి ప్రతిభ



**నారాయణపేట మే 25 (వుదయం ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్రంలో పాలి టెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన రాష్ట్రస్థాయి ప్రవేశ పరీక్షల్లో శ్రీ సాయి స్కూల్ విద్యార్థి ఆది త్య దత్త ప్రతిభ కనబరిచి ఎంపీసీ విభాగం లో రాష్ట్రస్థా యి 491 వ ర్యాంక్ సాధించారని పాఠశాల ప్రధాన కార్య దర్శి యం. గోవర్ధన్ రెడ్డి, పాఠ శాల సలహాదారులు ముర ళీధర్ తెలిపారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ 120 మార్కులకు 113 మార్కులు సాధించారని అన్నారు. రాష్ట్రస్థాయి లో ర్యాంక్ సాధించినందుకు పాఠశాల ఆవరణంలో శాలు వాతో సన్మానం చేసి మిఠా యి తినిపించి అభినందన లు తెలిపారు. భవిష్యత్తులో మంచిగా చదువుకొని గొప్ప ఉద్యోగం సాధించాలని సూచించారు. ఈ కార్య క్రమం లో ఉపాధ్యాయులు హెచ్.నర్సింహా, రాధా కిషన్, రోహన్ తదితరులు పాల్గొన్నారు.

# రాచూరులో ఘనంగా స్వేరోస్ విక్టరీ డే



**మలావత్ పూర్ణ విజయం అమ్మాయిలకు స్ఫూర్తి.**
**పేద విద్యార్థుల ఆశల కలలకు రెక్కలు తొడిగిన ఘనత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ దే**
**జ్ఞాన సమాజ నిర్మాణం లక్ష్యంగా స్వేరోస్ ముందడుగు**
**సీనియర్స్ స్వేరో నాగేష్.**

**వెల్దండ మే 25 (వు దయం)**

లక్షలాదిమంది పేద బడుగు బలహీన వర్గాల బిడ్డల కలలకు రెక్కలు తొడిగిన ఘనత డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ దని సీనియర్ స్వేరో దుబ్బ నాగేష్ సోమవారం వెల్దండ మండలంలోని రాచూరు గ్రామంలో స్వేరోస్ ఆధ్వర్యంలో విక్టరీ డేను నిర్వహించారు. రాచూర్ స్వేరో నాయకులు గోకమళ్ళ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన విక్టరీ డే కార్యక్రమానికి సీనియర్స్ స్వేరో దుబ్బ నాగేష్‌హాజరయ్యారు. ఈ సందర్భంగా దుబ్బ నాగేష్ మాట్లాడుతూమలావత్ పూర్ణ విజయం వెనుక డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ త్యాగస్ఫూర్తి చిరస్మరణీయమన్నారు ప్రపంచంలోనే అతి చిన్న వయసులో ఎరెస్టు శిఖరాన్ని అధిరోహించిన గిరిజన బాలిక మలావత్ పూర్ణ చారిత్రాత్మక విజయానికి గుర్తుగా ప్రతి సంవత్సరం మే 25న స్వేరోస్ విక్టరీ డే నిర్వహిస్తున్నట్లు నాగేష్ అన్నారు. మారుమూల తండాలో జన్మించిన ఒక గిరిజన బిడ్డ ఖ్యాతి ప్రపంచ పటంపై నిలబెట్టిన ఘనత RS ప్రవీణ్ కుమార్ ధని అన్నారు. అక్షరం ఆర్థికం ఆరోగ్యం ఆత్మగౌరవంలో వెనుకబడ్డ వర్గాల అభ్యున్నతి జరగాలంటే జ్ఞాన సమాజం నిర్మాణమే శరణ్యమని పేర్కొన్న గొప్ప దూరదృష్టి గల నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అని కొనియాడారు. గురుకుల కార్యదర్శిగా సమయంలో వేలాది పేద, అణగారిన వర్గాల పిల్లల జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు.

అనేక ఒడిదుడుకులు, విమర్శలు , ఆటంకాలు ఎదుర్కొంటూనే డాక్టర్ ప్రవీణ్ కుమార్ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపి "స్వేరో" అనే భావజాలాన్ని ఉద్యమంగా తీర్చిదిద్దారని తెలిపారు. హిమాలయాలపై స్వేరోస్ జెండాతో

# అకాల వర్షాలతో మక్క రైతుల్లో ఆందోళన



**కొనుగోలు కేంద్రాల్లో తడిసిన మక్కజొన్న..**
**మద్దతు ధరపై రైతుల భయం**
**"₹2,400 మద్దతు ధర తప్పకుండా అందిస్తాం" – మార్కెటింగ్ శాఖ హామీ**

**గద్వాల మే 25 (వుదయం బ్యూరో)**

జోగులాంబ గద్వాల్ జిల్లాలో కురిసిన అకాల వర్షాలు మక్కజొన్న రైతుల్లో ఆందోళన రేకెత్తిస్తున్నాయి. ముందస్తుగా నైరుతి రుతుపవనాలు అండమాన్ దీవులకు చేరిన ప్రభావంతో శనివారం, ఆదివారం పలుచోట్ల వర్షాలు కురిశాయి. ఈ వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన మక్కజొన్న సంచులు తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి రాకముందే వర్షాల బారిన పడటంతో రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. ప్రభుత్వం ప్రకటించిన క్వింటాల్‌కు ₹2,400 మద్దతు ధర పూర్తిగా అందుతుందా..? లేక తడిసిందనే కారణంతో ధర తగ్గిస్తారా..? అనే ఆందోళన రైతుల్లో కనిపిస్తోంది. కొనుగోలు కేంద్రాల్లోనే వర్షానికి తడిసిన మక్కజిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో వేలాది సంచుల మక్కజొన్న నిల్వ ఉంది. కొన్ని కేంద్రాల్లో సరిపడా షెడ్లు లేకపోవడంతో సంచులను బహిరంగ ప్రదేశాల్లోనే ఉంచినట్లు తెలుస్తోంది. అకాల వర్షాలతో వాటిలో కొంత భాగం తడిసిపోయింది. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే ఖర్చులు పెరిగి ఇబ్బందులు పడుతున్న కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోడౌన్లకు తరలించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు.కొన్ని కేంద్రాల్లో వర్షానికి నానిన సంచులను ఎండలో ఆరబెట్టి గోడౌన్లకు తరలిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా షెడ్లు లేని నాలుగు కొనుగోలు కేంద్రాల్లో కొంత మేర ఎక్కువగా తడిసినట్లు పేర్కొన్నారు. డీబీటీ ద్వారా రైతుల ఖాతాల్లోకి నగదు కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులను ప్రభుత్వం విడుదల చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డీబీటీ ద్వారా జమ చేస్తామని అధికారులు వెల్లడించారు.అకాల వర్షాలు రైతుల్లో ఆందోళన కలిగించి నప్పటికీ, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర విషయంలో ఎలాంటి అన్యాయం జరగదని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు కొంత ఊరట చెందుతున్నారు.

# పరగడుపునే కీరా తినొచ్చా..!?



చవకగా దొరికేది అన్ని వేళలా లభించే కీరా దోసకాయతో కలిగే లాభాలు అన్ని ఇన్ని కావని చెబుతున్నారు ICAR–నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (CEO) డా. ఆదర్శ గౌడ. అందరికి దొరికే కీరాను పరగడుపున తింటే చాలామంచిదని చెబుతున్నారు. ముఖ్యంగా ఈ సమ్మర్ ఉష్ణోగ్రతలకు ఇది ఎంతో పోషకవంతమైనదని అన్నారు. దీన్ని ఉదయమే అల్పాహారంగా తీసుకుంటే ఆరోగ్యానికి ఏంతో మేలని తెలిపారు. అంతేగాదు దీనిలో ఉండే పోషక విలులు, ఉపయోగాలు గురించి సవివరంగా వెల్లండించారు. ప్రతిరోజు ఉదయం పరగడుపునే కీరా దోసకాయ లేదా కీరా జ్యూస్ తీసుకుంటే శరీరంలోని వ్యర్థాలన్నీ బయటకి వెళ్లిపోయి మలబద్ధకం సమస్య తగ్గుతుందని చెబుతున్నారు. ముఖ్యంగా వ్యాధుల బారిన పడకుండా రక్షిస్తుందని అన్నారు. అధిక బరువుతో బాధపడే వాళ్లకు ఎంతో మేలని అంటున్నారు. ముఖ్యంగా పొట్ట భాగంలో ఉన్న కొవ్వు ఇట్టే కరిగిపోతుందని చెబుతున్నారు. ముఖ్యంగా వేసవి తాపాన్ని తగ్గిస్తుంది, వడదెబ్బ బారిన పడకుండా కాపాడుతుందని చెబుతున్నారు.

అలాగే మధుమేహులు దీన్ని తీసుకోవడం వల్ల చక్కెర, కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచుతుంది. తద్వారా గుండె ఆరోగ్యం మెరుగ్గుఉంటుందని అన్నారు. కీరలక్ష అధికంగా ఉండే ఫైబర్ జీర్ణ సంబంధిత సమస్యలను తగ్గిస్తుందని అన్నారు. దీనిలో ఉండే విటమిన్ సీ ఇమ్యూనిటీని పెంచి వ్యాధులు దరిచేరకుండా చేస్తుందని చెబుతున్నారు. శరీరానికి తేమ: కీరాలో సుమారు 95% నీరు ఉండటం వల్ల ఉదయాన్నే శరీరాన్ని డిహైడ్రేషన్ నుంచి కాపాడుతుంది. ఇందులో ఉండే ఫైబర్ మలబద్ధకం సమస్యను నివారించి, ప్రేగు కదలికలను మెరుగుపరుస్తుంది. కేలరీలు చాలా తక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది మంచి అల్పాహారం. రోగనిరోధక శక్తి: దీనిలోని విటమిన్ సీ, ఇతర యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అలాగే ఫైబ్రాయిడ్లు లేదా ఈస్ట్రోజెన్ ఆధిపత్యాన్ని ఎదుర్కొంటున్న మహిళలకు, ఇందులోని ఫైటోన్యూట్రియెంట్లు తేలికపాటి యాంటీ–ఈస్ట్రోజెనిక్ ప్రభావాన్ని కలిగి ఉంటాయి. బ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకుంటే..రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉంటాయని చెబుతున్నారు. చర్మం, కళ్ళు, జుట్టు ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటుంది. రక్తపోటుని తగ్గిస్తుంది, చర్మ ఆరోగ్యానికి మేలు చేస్తుంది కూడా.

దోసకాయ చల్లబరిచే ప్రభావాన్ని కలిగి ఉంటుంది. అందువల్ల ఇది శరీరంలో కఫ దోషాన్ని తీవ్రతరం చేస్తుంది. తరచుగా జలుబు, దగ్గు, శ్లేష్మం, సైనస్ సమస్యలు, ఉబ్బసం లేదా కఫంతో బాధపడేవారు కీరాను పూర్తిగా నివారించాలి. ఇరిటబుల్ బోవల్ సిండ్రోమ్ (IBS), జీర్ణ సమస్యలు ఉన్నవారికి మంచిది కాదు. కీళ్ల నొప్పులు ఉంటే తినకపోవడమే మేలు. మూత్ర విసర్జనకి సంబంధించిన సమస్యలతో బాధపడుతుంటే వైద్యులను సంప్రదించే తీసుకుంటే మంచిది. గ్లూకోజ్‌ని తగ్గించే మందలు ఉపయోగించే వాళ్లు కూడా వైద్యులను సంప్రదించే తీసుకోవాలని చెబుతున్నారు.

## ఛాతీలో మంట వేధిస్తుందా? అయితే ఇలా చేయండి!

ఏం తిన్నా ఛాతీలో మంట వేధిస్తుంటే దాన్ని అసిడిటీగానే పరిగణించాలి. అయితే ఈ సమస్యను అధిగమించగలిగే యోగాసనాలు ఉన్నాయి. అవేంటంటే.... వెన్ను, పొత్తికడుపు మీద ప్రభావం చూపించే ఆసనమిది.



జీర్ణవ్యవస్థకు రక్తప్రసరణను పెంచి, జీర్ణసంబంధ అవయవాలకు ఈ ఆసనంతో వ్యాయామం దక్కుతుంది. సున్నితమైన మర్దన జరిగి జీర్ణవ్యవస్థ క్రమబద్ధమై, అసిడిటీ నుంచి విముక్తి లభిస్తుంది. ఈ ఆసనం ఎలా వేయాలంటే.....

చేతులు, మోకాళ్ల మీద బల్ల ఆకారంలో నేల మీద కూర్చోవాలి. ఈ భంగిమలో మోకాళ్లు అరడుగు దూరంలో, చేతులు నిటారుగా నేల మీద ఆనించి ఉంచాలి. ఊపిరి పీల్చుతూ, తలను నెమ్మదిగా పైకి లేపి వెనక్కి వాల్చాలి. ఇలా చేస్తూ వీపును పైకి లేపి విల్లు ఆకారంలో వంగాలి. ఈ భంగిమలో కొన్ని క్షణాలు ఉండి, నెమ్మదిగా వెన్ను వంచుతూ, ఊపిరి వదులుతూ పూర్వ స్థితికి రావాలి. ఆ ఆసనంలో శరీర బరువు చేతులు, కాళ్లపై పడుతుంది. ఈ ఆసనంతో పొత్తికడుపులోకి ప్రాణవాయువు వెళ్లి అసిడిటీ అదుపులోకి వస్తుంది. ఈ ఆసనం వేయడం కూడా సులువే! దీన్ని ఎలా వేయాలంటే.... చేతులు, కాళ్ల ఆసరాతో శరీరాన్ని బల్ల ఆకారంలో వంచాలి. ఊపిరి వదులుతూ నడుమును పైకి లేపి, చేతులు, కాళ్లు నిటారుగా ఉంచాలి. చేతులు, భుజాలకు, కాళ్లు, తుంటికి సమాంతరంగా ఉండాలి. కాలి బొటనవేళ్లు ముందుకు ఉండాలి. ఇప్పుడు చేతులు నేల మీద బలంగా తాకిస్తూ, తలను వంచాలి. ఈ భంగిమలో చెవులు చేతులను తాకాలి. ఈ భంగిమలో కొన్ని క్షణాలు ఉండి, మోకాళ్లను వంచి, శరీరాన్ని పూర్వ స్థితికి తీసుకురావాలి. ఈ ఆసనం శరీరానికి స్వాంతన కలిగించి, జీర్ణవ్యవస్థకు విశ్రాంతిని అందిస్తుంది. ఫలితంగా అసిడిటీ తగ్గుతుంది. ఈ ఆసనం వేసినప్పుడు జీర్ణసంబంధ అవయవాలకు మర్దన జరిగి, బలపడతాయి. ఈ ఆసనం ఎలా వేయాలంటే.... మెకాళ్ల మీద, రెండు పాదాల బొటన వేళ్లు ఒకదానికొకటి తగిలేలా కాళ్లను వెనక్కి వాల్చి కూర్చోవాలి. నడుము పైభాగాన్ని ముందుకు వంచి, పడుకోవాలి. చేతులు రెండూ ముందుకు చాపి, మోకాళ్లకు సమాంతరంగా నేల మీద ఆనించాలి. భుజాలు రెండూ కిందకు వాల్చాలి. ఈ భంగిమలో 30 సెకన్లపాటు ఉండి, నెమ్మదిగా పైకి లేవాలి.

# చక్కని ఆరోగ్యం

సిల్క్‌ప్రో స్ట్రెయిట్ అత్యాధునిక 'ఎయిర్ పవర్డ్' టెక్నాలజీతో పనిచేస్తుంది. ఇది వేడికి బదులుగా గాలి ప్రవాహం ద్వారా జుట్టును స్ట్రెయిట్ చేస్తుంది. దీనివల్ల జుట్టు దెబ్బతినకుండా ఉంటుంది. ఈ పరికరం అందరికీ అనుకూలంగా ఉంటుంది. కర్లీ, కాయిల్డ్, టెక్స్చర్డ్ హెయిర్ ఉన్నవారు కూడా కేవలం నిమిషాల వ్యవధిలోనే మృదువైన, పిన్–షార్ప్ స్ట్రెయిటనింగ్ పొందవచ్చు. దీనికోసం ప్రత్యేకమైన ఇంటర్‌చేంజబుల్ కోంబ్స్ కూడా అందుబాటులో ఉన్నాయి. అలాగే ఇంటిగ్రేటెడ్ హీట్ సెన్సర్ ఉంటుంది. అంటే ఇది సెకనుకు వెయ్యిసార్లు టెంపరేచర్‌ని పర్యవేక్షిస్తూ, జుట్టుకు నష్టం కలగకుండా ఆటోమేటిక్‌గా అడ్జస్ట్ చేస్తుంది. స్నానం చేసిన వెంటనే తడి జుట్టుపై కూడా దీనిని నేరుగా ఉపయోగించవచ్చు. ఇది జుట్టును ఆరబెట్టడంతో పాటు స్ట్రెయిటెనింగ్ కూడా చేస్తుంది.

## ముత్యంలాంటి మెరిసే ముఖం కోసం..



ఖరీదైన క్రీములు మేనిని మెరిపిస్తాయని అనుకుంటుంటారు. కాని, మేని మెరుపు కేవలం మార్కెట్‌లో దొరికే ఉత్పత్తులతోనే సాధ్యం కాదు. మనం పాటించే జాగ్రత్తలతోనే మేని మెరుపును కాపాడుకోవచ్చు. చాలా మంది ఇంటి నుంచి బయలుదేరే ముందు సన్‌స్క్రీన్ రాసుకుని వదిలేస్తారు. చెమట వల్ల అది త్వరగా పోతుంది. అందుకే ప్రతి మూడు గంటలకోసారి సన్ స్క్రీన్ రాసుకోవడం మర్చిపోవద్దు. చాలామంది గంటల తరబడి ఫోన్ చెవి దగ్గర పెట్టుకుని మాట్లాడుతుంటారు. దీని వల్ల వేడి పెరిగి చర్మంపై మొటిమలు వచ్చే అవకాశం ఉంది. వీలైనంత వరకు హెడ్‌సెట్ వాడటం మేలు. తాత్కాలిక మెరుపు కోసం వాడే ఉత్పత్తులు దీర్ఘకాలంలో మీ చర్మానికి హాని చేయవచ్చు. ముఖం పదేపదే కడగడం వల్ల చర్మంపై ఉండే రక్షణ పొర దెబ్బతిని, చర్మం త్వరగా కమిలిపోతుంది. అలసట పోవడానికి వేడి నీళ్ల స్నానం హాయిగానే ఉన్నా, అది మీ చర్మంలోని తేమను హరిస్తుంది. దీనివల్ల చర్మం త్వరగా పొడిబారిపోయి ముడతలు వస్తాయి.

ముత్యాలు అలంకారానికే కాదు, మేనిని మెరిపించడానికీ ఉపయోగపడతాయని ప్రపంచానికి పరిచయం చేసింది చైనా. క్రీస్తుశకం ఏడో శతాబ్దికి చెందిన చైనా మహారాణి వు జెషియన్ అందం కోసం ముత్యాల పొడిని వాడేది. రసాయనాలతో కాకుండా సహజసిద్ధంగా తయారుచేసే ఈ పొడిని ముఖానికి రాసుకోవడం వల్ల చర్మం సహజంగా మెరుస్తుంది. ముఖంపై ముడతలు రాకుండా కాపాడుతుంది. ఒకప్పుడు కేవలం రాజకుటుంబీకులకే పరిమితమైన ఈ ప్రాచీన పద్ధతి, ప్రస్తుతం ఆధునిక చర్మ సంరక్షణ పరిశ్రమలో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందుతోంది. నేడు అనేక ప్రముఖ బ్యూటీ బ్రాండ్లు తమ ఉత్పత్తులలో ఈ ముత్యాల పొడిని ఉపయోగిస్తూ, పురాతన చైనా అందాల రహస్యాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయి.

# మామిడిపండుతో మొటిమలా?!

మామిడి పండ్ల సీజన్‌లో వాటిని చూస్తూ తినకుండా ఎవరైనా ఉన్నారంటే– వాళ్లు కచ్చితంగా టీనేజీ అమ్మాయిలే. వాటిని తినడం వల్లే మొటిమలు వచ్చాయనీ, వేడి చేసిందని చెబుతూ... ఎంత ఇష్టమున్నా కొందరు వాటిని తాకను గాక తాకరు. నిజమే, ఈ కాలంలో కొందరిలో మొటిమలు ఎక్కువ కావొచ్చు. కానీ ఆ పాపం మామిడి పండుది కాదు అంటున్నారు నిపుణులు. దాన్ని సరైన పద్ధతిలో తీసుకోకపోవడమే. మామిడి గుజ్జులో చక్కెర, పాలు కలిపి ఐస్‌క్రీమ్, డెజర్ట్‌లు చేసుకుని తింటుంటారు. అలాగే వీటితోపాటు నూనెపూరిత స్నాక్స్ కూడా ఎక్కువగా తింటుంటారు. ఇవన్నీ కలిసి ఇన్‌ఫ్లమేషన్, మొటిమలకు కారణమవుతాయి. అదే నేరుగా మామిడి పండును తినడం వల్ల ఏ సమస్యా ఉండదు. అయితే కొందరికి మామిడి తొక్కలోని ఉరుషియోల్ అనే రెజిన్ పదార్థం వల్ల అలర్జీ వస్తుంది. జీడిగింజ తొక్కల్లోనూ ఎక్కువగా ఉండే ఈ పదార్థం మామిడి ఆకులు, కాడలు, తొక్కలో కొద్దిపాళ్లలో ఉంటుంది. కానీ గుజ్జులో ఉండదు. దీనివల్ల నోరు, ముఖం, చేతులమీద దురదతో కూడిన దద్దుర్లు వస్తాయి. వీటినే మొటిమలుగా పొరబడుతుంటారు. కానీ ఇది మ్యాంగో డెర్మటైటిస్.. ఇది రాకుండా ఉండాలంటే అలర్జీ ఉన్నవాళ్లు తినే ముందు కాయనూ, తొక్క తీశాక చేతుల్నీ శుభ్రంగా కడగడం... వంటివి పాటించాలి. సాధారణంగా హార్మోన్ల మార్పులు, జిడ్డు చర్మం, నిద్రలేమి, ఒత్తిడి, డీహైడ్రేషన్, సరైన చర్మ సంరక్షణ తీసుకోకపోవడంతోపాటు జన్యు కారణాల వల్ల మొటిమలు వస్తుంటాయి. అంతేతప్ప మామిడి పండు వల్ల రావు. ఇంకా చెప్పాలంటే, మామిడిపండు చర్మ ఆరోగ్యానికి ఎంతో మేలు. వాటిల్లో ఎ, సి విటమిన్లు, ఇతరత్రా యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలం. కాబట్టి మామిడి పండ్లను హాయిగా ఆస్వాదించవచ్చు.



# వేసవిలో జిమ్‌కు వెళ్లేటప్పుడు ఈ పొరపాట్లు చేయకండి



వేసవిలో జిమ్ చేయడం ఆరోగ్యానికి మంచిదే అయినా, కొన్ని జాగ్రత్తలు పాటించకపోతే అది ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. చిన్న తప్పులు కూడా శరీరంపై తీవ్ర ప్రభావం చూపవచ్చు, ముఖ్యంగా గుండెపై ఒత్తిడి పెంచే ప్రమాదం ఉంటుంది. ఇప్పుడు వేసవిలో జిమ్‌కి వెళ్లేవారు తప్పక నివారించాల్సిన కొన్ని పొరపాట్లు చూద్దాం.. వేసవిలో ఎక్కువసేపు ట్రెడ్‌మిల్‌పై పరుగెత్తడం లేదా అధిక తీవ్రతతో కార్డియో చేయడం వల్ల శరీర ఉష్ణోగ్రత వేగంగా పెరుగుతుంది. దీని వల్ల గుండెపై అదనపు ఒత్తిడి పడుతుంది. ఇప్పటికే రక్తపోటు లేదా గుండె సమస్యలు ఉన్నవారికి ఇది మరింత ప్రమాదకరం. తగినంత నీరు తాగకపోవడం వేడిలో ఎక్కువగా చెమట పడటం వల్ల శరీరంలో నీరు, ఎలక్ట్రోలైట్లు తగ్గిపోతాయి. వ్యాయామం సమయంలో సరైన పరిమాణంలో నీరు తాగకపోతే డీహైడ్రేషన్ వచ్చే అవకాశం ఉంది. ఇది రక్తప్రసరణను ప్రభావితం చేసి గుండెపై ఒత్తిడిని పెంచుతుంది. బరువు తగ్గాలనే ఉద్దేశంతో కొంతమంది ఏమీ తినకుండా జిమ్‌కు వెళ్తారు. కానీ ఇలా చేయడం వల్ల శరీరానికి శక్తి తగ్గిపోతుంది. ఫలితంగా తల తిరగడం, అలసట, తక్కువ రక్తపోటు వంటి సమస్యలు రావచ్చు. వ్యాయామానికి ముందు వార్మప్ చేయకపోతే శరీరంపై అకస్మాత్తుగా ఒత్తిడి పడుతుంది. ఇది గుండె వేగంగా కొట్టుకునేలా చేస్తుంది. అందుకే కనీసం 10 నిమిషాల వార్మప్ చేయడం చాలా అవసరం. త్వరగా ఫలితాలు రావాలనే ఉద్దేశంతో కొంతమంది ప్రొటీన్, ప్రీ–వర్కౌట్ సప్లిమెంట్లు ఎక్కువగా తీసుకుంటారు. వీటిలో ఉండే కెఫిన్ వంటి పదార్థాలు గుండె స్పందనను పెంచవచ్చు. అందుకే వేసవిలో జిమ్‌కి వెళ్లేవారు ఈ పొరపాట్లను తప్పించుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు, గుండె సంబంధిత ప్రమాదాలను తగ్గించుకోవచ్చు.

# పుల్లపుల్లటి ఆమ్లాతో వంటలు

రుచిగానూ ఉంటాయి, ఔషధంగానూ పని చేస్తాయి. ఉసిరితో ఊరగాయ, రోటిపచ్చడి, జామ్, జ్యూస్, మిఠాయి, సబ్జీ, రసం, రైతా, క్యాండీ, ఫ్రైస్, పులిహోర, చాయ్.. ఇలా ఎన్నెన్నో చేయొచ్చు. మీ కోసం మరికొన్ని వెరైటీలు.. కావలసినవి: ఉసిరికాయలు – అర కిలో, అల్లం – 200 గ్రాములు, పంచదార పొడి – 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు – రుచికి తగినంత, మిరియాల పొడి – స్పూన్, ఛాట్ మసాలా – 2 స్పూన్లు, తయారీ: నాణ్యమైన, పెద్ద ఉసిరికాయలను ఎంచుకోవాలి. వాటిని కడిగి, తడి లేకుండా తుడిచి తురమాలి. అల్లం పొట్టు తీసి సన్నగా, పొడుగ్గా ముక్కలు కోసి.. ఉసిరి తురుములో కలపాలి. అందులో ఉప్పు, పంచదార పొడి, మిరియాల పొడి, ఛాట్ మసాలా జతచేసి కలియబెట్టాలి. ఈ పాత్రకు మూత పెట్టేసి.. రాత్రంతా అలా ఉంచేయాలి. ఉదయం వాటిని తీసి పళ్లెంలో పరిచినట్టుగా అమర్చి.. బాగా ఎండ తగిలేచోట ఉంచాలి. అవసరమైతే మర్నాడు కూడా ఎండబెట్టాలి. అంతే.. 'ఆమ్లా ముఖ్వాస్' తయారైపోతాయి. కావలసినవి: ఉసిరికాయలు – పావు కిలో, బెల్లం – పావు కిలో, మిరియాల పొడి, వాము – స్పూన్ చొప్పున, జీలకర్ర పొడి – 2 స్పూన్లు, ఉప్పు – రుచికి తగినంత, ఇంగువ – అర స్పూన్, ఆమ్‌చూర్ పొడర్ – ముప్పావు స్పూన్, పంచదార పొడి – 2 స్పూన్లు, తయారీ: ఉసిరికాయల్లో కొన్ని నీళ్లు పోసి.. కుక్కర్‌లో రెండు విజిల్స్ వచ్చే వరకూ ఉడికించాలి. మిగిలిన నీళ్లను వార్చేసి.. గింజలు తీయాలి. వాటిని మిక్సీజార్‌లో వేసి.. మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ ఉసిరి ముద్దను కడాయిలో వేసి.. కొన్ని నీళ్లు, బెల్లం చేర్చి వేడిచేయాలి. రెండు మూడు నిమిషాల తర్వాత.. మిరియాల పొడి, వాము, జీలకర్ర పొడి, ఉప్పు, ఇంగువ, ఆమ్‌చూర్ పొడర్ జోడించాలి. అడుగంటకుండా కలియతిప్పుతూ చిక్కబడే వరకూ ఉంచి.. సెగ తీసేయాలి. చల్లారాక.. చిన్న ఉండల్లా చేయాలి. వాటి మీద పంచదార పొడి చల్లితే ఒకదానికొకటి అంటుకోవు. ఇవి చిన్నా పెద్దా అందరికీ నచ్చేస్తాయి. కావలసినవి: ఉసిరికాయలు – అర కిలో, తేనె – మూడు కప్పులు, కుంకుమ పువ్వు – కొద్దిగా, ఉప్పు – చిటికెడు, మిరియాల పొడి – ముప్పావు స్పూన్, డ్రై జింజర్ పొడర్, యాలకుల పొడి – అర స్పూన్ చొప్పున, తయారీ: పక్వానికి వచ్చిన మంచి ఉసిరికాయలను కడిగి, తుడిచి.. ఫోర్క్‌తో దగ్గరదగ్గరగా, లోతుగా రంధ్రాలు చేసి.. పది నిమిషాలు ఉడికించాలి. ఆ నీళ్లు వార్చేసి.. ఐదు గంటలు ఎండబెట్టాలి. వాటిని తడి లేని సీసాలో వేసి.. తేనె పోయాలి. అందులో మిరియాల పొడి, కుంకుమ పువ్వు, ఉప్పు, డ్రై జింజర్ పొడర్, యాలకుల పొడి జోడించాలి. సీసా మూత పెట్టేసి.. వస్త్రం చుట్టి ఎండలో ఉంచాలి. సాయంత్రం లోనికి తెచ్చి.. మర్నాడు మళ్లీ ఎండలో ఉంచాలి. ఇలా పది రోజులు ఎండబెడితే.. 'ఆమ్లా మురబ్బా' తయారవుతుంది. ఉసిరికాయలు ఉబ్బుతాయి కనుక.. లోపల కొంత ఖాళీ ఉండేలా పెద్ద సీసాను తీసుకోవాలి. కావలసినవి: ఉసిరికాయల తరుగు – 2 కప్పులు, ఎండుమిర్చి – 25 నుంచి 30 వరకూ, ఉప్పు – రుచికి తగినంత, శనగపప్పు – ఒక కప్పు, మినపప్పు – అర కప్పు, ఎండుకొబ్బరి తురుము – 2 కప్పులు, కరివేపాకు – ముప్పావు కప్పు, పసుపు – స్పూన్, నూనె – 3 స్పూన్లు, ఆవాలు – ఒకటిన్నర స్పూన్, జీలకర్ర – స్పూన్, ఇంగువ – పావు స్పూన్, తయారీ: ఉసిరి తురుమును అందులో ఉన్న చెమ్మ పోయే వరకూ సన్న సెగ మీద వేయించాలి. శనగపప్పు, మినపప్పు, ఎండుమిర్చి, కొబ్బరి, కరివేపాకులను విడివిడిగా వేయించాలి. పూర్తిగా చల్లారాక.. మిక్సీ జార్‌లో వేసి.. గ్రైండ్ చేయాలి. అందులో ఉసిరి తురుము, ఉప్పు, పసుపు వేసి కలపాలి. కడాయిలో నూనె వేడయ్యాక ఆవాలు.. అవి చిటపటలాడుతున్నప్పుడు జీలకర్ర, ఇంగువ వేయాలి. ఈ తాలింపును గ్రైండ్ చేసిన మిశ్రమంలో వేసి కలియబెట్టాలి. అంతే.. రుచికరమైన 'ఉసిరి కారం' సిద్ధం. దీన్ని తడి లేని సీసాలో భద్రం చేసుకోవాలి. వేడన్నంలో కాస్తకారం, కొద్దిగా నెయ్యి వేసు కుని తింటే సూపర్‌గా ఉంటుంది. కావలసినవి: ఉసిరికాయలు – ముప్పావు కిలో, ఉప్పు – రుచికి తగినంత, బెల్లం – అర కిలో, డ్రై జింజర్ పొడర్ – ఒకటిన్నర స్పూన్, కారం, మిరియాల పొడి – స్పూన్ చొప్పున, నిమ్మరసం – ముప్పావు స్పూన్, తయారీ: ఉసిరికాయలను ఉడకబెట్టాలి. చల్లారాక.. గింజలు తీసేసి, తొనల్లా కోయాలి. బెల్లంలో పావు కప్పు నీళ్లు పోసి మరిగించా లి. అందులో ఉసిరి తొనలు జతచేసి.. సన్న సెగ మీద ఉడికించాలి. ఐదు నిమిషాల తర్వా త... డ్రై జింజర్ పొడర్, కారం, మిరి యాల పొడి, నిమ్మరసం జోడించి కలియ తిప్పాలి.



# రుచికరమైన సోల్కడి

చెయ్యని కుండ, పొయ్యని నీళ్లు– అనగానే తియ్యటి కొబ్బరి నీళ్లని అర్థమైపోతుంది కదా! ఆ నీళ్లు తాగేశాక.. కొబ్బరితో 'సోల్కడి' చేసి చూడండి. రుచిగానూ ఉంటుంది, ఆరోగ్యం కూడా.

ఇందుకోసం కొబ్బరికాయ – 1, వంగ మామిడి పండ్లు (పర్పుల్ మ్యాంగోస్టీన్) – 2, వెల్లుల్లి రెబ్బలు – 2, అల్లం – అరంగుళం ముక్క, పచ్చిమిర్చి – 1, బీట్‌రూట్ – 1, జీలకర్ర పొడి – చెంచా, ఛాట్ మసాలా – అర చెంచా, ఉప్పు – చిటికెడు, కొత్తిమీర తరుగు – 2 చెంచాలు తీసుకోవాలి. ఎలా



చేయాలంటే.. కొబ్బరిని చిన్న ముక్కలుగా కోయాలి. బీట్‌రూట్ చెక్కు తీసి సన్నగా తరగాలి. వంగ మామిడి ముక్కలను వేడి నీళ్లలో 20 నిమిషాలు నానబెట్టాలి. మిక్సీజార్‌లో కొబ్బరి ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు, అల్లం, పచ్చిమిర్చి, బీట్‌రూట్, జీలకర్ర పొడి, ఛాట్ మసాలా, ఉప్పు, నానిన వంగ మామిడి ముక్కలు వేసి గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని పల్చని వస్త్రంతో వడకట్టాలి. మిగిలిన పిప్పిలో కొన్ని నీళ్లు పోసి.. మరోసారి వడకట్టి.. కొత్తిమీర తరుగు చల్లితే రుచీ ఆరోగ్యాల 'సోల్కడి' తాగి ఆనందించవచ్చు. ఇది ఊబకాయం రానివ్వదు, ఒంట్లో వేడిని తగ్గించి చలవ చేస్తుంది.

# అల్లం షర్బత్ క్షణాల్లో..

ఎండాకాలం ఇంటికెవరైనా వస్తే షర్బత్‌తో ఆతిథ్యం మొదలవుతుంది. అప్పటికప్పుడు నిమ్మరసం తీసి పానీయం చేయాల్సిన అవసరం లేకుండా ఇలా లెమన్ జింజర్ కాన్‌సన్ట్రేట్ చేసి ఉంచితే.. క్షణాల్లో కలిపి ఇవ్వొచ్చు..

కావలసినవి: నిమ్మరసం – కప్పు, అల్లం – 100 గ్రాములు, తేనె – ఒకటిన్నర కప్పులు, బెల్లం పొడి – అర కప్పు, ఉప్పు – రుచికి తగినంత, మిరియాల పొడి – అర స్పూన్, నిమ్మ తొక్క తురుము (లెమన్ జెస్ట్) – స్పూన్

తయారీ: అలాన్ని శుభ్రంగా కడిగి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ అల్లం ముద్దను అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో వేసి.. నిమ్మరసం, బెల్లం జతచేసి సన్న సెగ మీద కలుపుతూ ఉడికించాలి. తర్వాత స్టవ్ ఆఫ్ చేయాలి. చల్లారిన తర్వాత తేనె, ఉప్పు, మిరియాల పొడి, నిమ్మ తొక్క తురుము వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని శుభ్రమైన, గాలి చొరబడని గాజు సీసాలోకి తీసి రిఫ్రిజిరేటర్‌లో భద్రం చేసుకుంటే నెల రోజులు నిలవుంటుంది. తాగదలచినప్పుడు.. గ్లాసు నీళ్లలో రెండు స్పూన్ల కాన్‌సన్ట్రేట్ కలిపితే సరిపోతుంది. నాలుగు పుదీనా ఆకులు, ఐస్ క్యూబ్స్ జోడిస్తే అల్లం షర్బత్ ఇంకా రుచిగా ఉంటుంది. బెల్లం ఇష్టం లేకుంటే పంచదార వేసుకోవచ్చు.



## మరోసారి స్మార్ట్‌ఫోన్ ధరలు పెంచేసిన రెడ్‌మీ



మెమొరీ చిప్‌ల కొరత, విడిభాగాల తయారీ ఖర్చు పెరుగుతుండటంతో పలు కంపెనీలు స్మార్ట్‌ఫోన్ ధరలను పెంచేస్తున్నాయి. తాజాగా ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ రెడ్‌మీ మరోసారి ఫోన్ ధరలను పెంచేసింది. రెడ్‌మీ 15 (Redmi 15 5G), రెడ్‌మీ నోట్ 15 (Redmi Note 15 5G) ధరలను రూ. 2 వేల వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. పెరిగిన ధరలు నేటి నుంచే అమల్లోకి వచ్చాయి. సవరించిన ధరలతో.. రెడ్‌మీ నోట్ 15 స్మార్ట్‌ఫోన్ 8GB + 128GB వేరియంట్ ధర రూ.24,999 నుంచి రూ.26,999కు చేరింది. జనవరిలో విడుదలైన ఈ ఫోన్ ప్రారంభ ధర రూ.22,999తో పోలిస్తే ఇప్పటివరకు రూ.4 వేలు పెరగడం గమనార్హం.




# సెన్సెక్స్ 1,073 పాయింట్లు పైకి

దేశీయ మార్కెట్లు సోమవారం భారీ లాభాల్లో ట్రేడయ్యాయి. పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు తొలగిపోతాయనే అంచనాల మధ్య సూచీలు లాభాల్లో కదలాడాయి. దాంతో సెన్సెక్స్ 1100 పాయింట్లు వరకు పెరిగింది. సెన్సెక్స్ నేటి ట్రేడింగ్‌లో 76,135 వద్ద మొదలైంది. చివరకు 1,073 పాయింట్ల లాభంతో 76,488 వద్ద ముగిసింది. నిఫ్టీ 312 పాయింట్లు ఎగబాకి, 24వేల పైన స్థిరపడింది. నిఫ్టీ సూచీలో ఐషర్ మోటార్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, బజాజ్ ఫైనాన్స్, టీఎంపీవీ, లార్సెన్ షేర్లు రాణించాయి. మ్యాక్స్ హెల్త్‌కేర్, ఓఎన్‌జీసీ, హిందాల్కో, నెస్లే, బజాజ్ ఆటో స్టాక్స్ నష్టపోయాయి. యుద్ధం ముగించే విషయమై అమెరికా – ఇరాన్ మధ్య శాంతి చర్చలు ఓ కొలిక్కి వస్తున్నాయనే వార్తలతో అంతర్జాతీయ మార్కెట్ లో ముడి చమురు ధరలు కాస్త దిగొచ్చాయి. ఒక బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధర 5.58 శాతం తగ్గి, 97.76 డాలర్లకు వచ్చింది. చమురు ధరలు తగ్గడంతో బ్యాంక్ షేర్లు పెరిగాయి. ఆయిల్ ధరల తగ్గుదల కారణంగా ద్రవ్యోల్బణం అదుపులో ఉంటుందని, వడ్డీ రేట్లలో స్థిరత్వం వస్తుందని మదుపర్లు భావిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు నేటి లాభాలకు ఓ కారణం. అమెరికా–భారత్ మధ్య చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందం త్వరలోనే ఖరారవుతుందని ఆశిస్తున్నామని యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో వెల్లడించడం మరో కారణం. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 35 పైసలు మేర కోలుకుంది. ప్రస్తుతం 95.25 వద్ద స్థిరపడింది.




# రూపాయి విలువపై ఎలాంటి టార్గెట్ లేదు: ఆర్‌బీఐ గవర్నర్

అంతర్జాతీయ ఉద్రిక్తతలు, చమురు మంటలు తదితర కారణాలతో ఇటీవల మన దేశీయ కరెన్సీ రూపాయి విలువ భారీగా పడిపోయింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి (Rupee Value) దాదాపు 100 మార్క్ దిశగా పతనమై ఆందోళన కలిగించింది. దీనిపై తాజాగా ఆర్‌బీఐ (RBI) గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. రూపాయి ఓవర్ వ్యాల్యూగా ఉందని అనలేమని, వాస్తవిక విలువ కంటే తక్కువగా ట్రేడ్ అవుతోందని మాత్రం చెప్పగలమని అన్నారు.

ఇక, రూపాయి విలువకు సంబంధించి ఎలాంటి నిర్దిష్ట మారకపు రేటు స్థాయిని ఆర్‌బీఐ లక్ష్యంగా పెట్టుకోదని సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. అసలు అలాంటి విషయాల్లో కేంద్రబ్యాంకు ఎలాంటి జోక్యం చేసుకోబోదని తెలిపారు. అయితే, ఊహాజనిత కదలికలు లేదా అధిక అస్థిరతను అరికట్టడానికి మాత్రమే విదేశీ మారక ద్రవ్య ఎక్స్ఛేంజీ మార్కెట్‌లో ఆర్‌బీఐ జోక్యం చేసుకుంటుందని స్పష్టంచేశారు. మన రూపాయికి ఒక నిర్దిష్ట విలువను సెట్ చేయడం కంటే.. కరెన్సీ మార్కెట్‌ను స్థిరంగా ఉంచడానికే తాము ప్రాధాన్యమిస్తామని ఆర్‌బీఐ గవర్నర్ వివరించారు. ఇక, అంతర్జాతీయంగా అస్థిరత, చమురు ధరల్లో పెరుగుదల ఉన్నప్పటికీ.. మన దేశ బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ స్థిరంగా ఉన్నాయని సంజయ్ మల్హోత్రా తెలిపారు. విదేశీ సంస్థాగత మదుపర్ల నుంచి రికార్డు స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయని పేర్కొన్నారు. మన కరెన్సీ విలువను స్థిరంగా ఉంచేందుకు దిగుమతులను తగ్గించి.. ఎగుమతులను పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇదిలాఉండగా.. ఇటీవల భారీస్థాయిలో పతనమైన రూపాయి విలువ సోమవారం కాస్త కోలుకుంది. నేటి ట్రేడింగ్‌లో 40 పైసలు పెరిగి 95.20గా ట్రేడ్ అవుతోంది. అమెరికా–ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం ఖరారయ్యే అవకాశాలున్నట్లు వార్తలు రావడంతో చమురు మంటలు కాస్త చల్లారాయి. దీంతో మన కరెన్సీ కాస్త బలపడింది.




## వినియోగం చెంతనే సింగ్యాస్ ఉత్పత్తి



పశ్చిమాసియా పరిణామాల్లో, అంతర్జాతీయంగా సహజవాయువు సరఫరాలో తీవ్ర అంతరాయాలు తలెత్తాయి. మన దేశానికీ గ్యాస్ దిగుమతులు రావడంలో అవరోధాలు ఏర్పడిన నేపథ్యంలో.. ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియా సరికొత్త వ్యూహాలు సిద్ధం చేసింది. గ్యాస్ ఆధారిత విద్యుత్ ప్లాంట్‌లు, డైరెక్ట్ రెడ్యూస్డ్ ఐరన్ పరిశ్రమలు, ఎరువుల తయారీ యూనిట్లకు గ్యాస్ అవసరాలను తీర్చడానికి బొగ్గు గనుల వద్ద లేదా ఆయా పరిశ్రమల పక్కనే 'బొగ్గు నుంచి సింథటిక్ గ్యాస్ (సింగ్యాస్)' ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయాల ని కోల్ ఇండియా యోచిస్తోంది. జాతీయ బొగ్గు గ్యాసిఫికేషన్ మిషన్, రసాయనాల ఉత్పత్తి పెంచాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా కోల్ ఇండియా ఈ అడుగులు వేస్తోంది. ఈ కేంద్రాలను బిల్డ్–ఓన్–ఆపరేట్ (బీఓఓ)/బిల్డ్–ఆపరేట్–మెయింటైన్ (బీఓఎం) పద్ధతిలో డెవలపర్లు, కన్సార్షియంల ద్వారా అభివృద్ధి చేయడానికి కోల్ ఇండియా ఆసక్తి వ్యక్తీకరణ పత్రాలను ఆహ్వానించింది. దీని కోసం రెండు రకాల మోడళ్లను ప్రతిపాదించారు. మొదటి విధానంలో బొగ్గు గనుల సమీపంలో ఉన్న కోల్ ఇండియా స్థలంలోనే సింగ్యాస్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. ఇక్కడినుంచి పైప్‌లైన్‌నెట్‌వర్క్ ద్వారా సమీపంలోని పారిశ్రామిక క్లస్టర్‌లకు గ్యాస్ సరఫరా చేస్తారు. రెండో విధానంలో ఇప్పటికే ఉన్న ఏదైనా పెద్ద గ్యాస్ ఆధారిత విద్యుత్ ప్లాంట్, ఎరువుల ఫ్యాక్టరీ, స్టీల్ ప్లాంట్ పక్కనే నేరుగా సింగ్యాస్‌కేంద్రాన్ని నిర్మిస్తారు. దీని వల్ల పైప్‌లైన్ రవాణా దూరం తగ్గి, సదరు పరిశ్రమకు ఎటువంటి అంతరాయం లేని స్థిరమైన గ్యాస్ లభిస్తుంది.

# విదేశీ ప్రయాణ వ్యయాలు తగ్గాయ్



భారతీయుల విదేశీ ప్రయాణ వ్యయాలు (విహార యాత్రలతో కలిసి) 1.09 బిలియన్ డాలర్ల (సుమారు రూ.10,400 కోట్ల)కు పరిమితమయ్యాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వెల్లడించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో విదేశీ ప్రయాణాల వ్యయాలు 1.3 బి.డాలర్లు కాగా, మార్చిలో 212.43 మిలియన్ డాలర్లు (రూ.2,000 కోట్లు) తగ్గినట్లయ్యింది. జనవరిలో ఈ వ్యయాలు 1.65 బి.డాలర్లుగా నమోదయ్యాయి. 'నివాస వ్యక్తుల కోసం సరళీకృత చెల్లింపుల పథకం (ఎల్‌ఆర్‌ఎస్) కింద విదేశాలకు పంపే చెల్లింపుల' వివరాలనూ ఆర్‌బీఐ తెలిపింది. ప్రయాణాలు, దగ్గరి బంధువుల పోషణ, విదేశాల్లో చదువులు, ఈక్విటీ, డెట్‌లో పెట్టుబడుల కోసం విదేశాల్లో మనవారు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఎల్‌ఆర్‌ఎస్ కింద, మైనర్లతో పాటు నివాసితులైన వ్యక్తులు, ఏదైనా అనుమతించిన కరెంట్ లేదా క్యాపిటల్ ఖాతా లావాదేవీ కోసం లేదా రెండింటికి కలిపి ప్రతి ఆర్థిక సంవత్సరంలో 2,50,000 డాలర్ల (సుమారు రూ.2.37 కోట్ల) వరకు పంపించుకోవచ్చు. 2026 మార్చిలో మొత్తం విదేశాలకు పంపిన డబ్బు విలువ 2.59 బి.డాలర్లుగా ఉంది. ఇందులో ప్రయాణానికి సంబంధించిన వాటా 1.09 బి.డాలర్లతో అతి పెద్దదిగా ఉంది.

# సిమెంట్‌కు కలిసొచ్చే కాలం..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ సిమెంటుకు గిరాకీ పెరుగుతుందనే కంపెనీలు ఆశిస్తున్నాయి. పశ్చిమాసియా పరిణామాల వల్ల ఇంధన అధిక ధరల వంటి ప్రతికూలతలున్నా.. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వ వ్యయాలు అధికంగా చేస్తుండటం, గృహ నిర్మాణ గిరాకీ, పట్టణీకరణ.. ఇందుకు కారణంగా పేర్కొంటున్నారు. 2026–27లో పరిశ్రమ 7–8% వృద్ధి సాధిస్తుందన్నది సిమెంటు తయారీదార్ల అంచనా. అల్ట్రాటెక్ సిమెంట్, అంబుజా సిమెంట్స్, శ్రీ సిమెంట్, దాల్మియా సిమెంట్, నువోకో విస్టాస్ వంటి కంపెనీల ఉన్నతాధికారులు.. తాజా ఎర్నింగ్స్ కాల్స్‌లో, మధ్యకాలిక డిమాండ్‌పై ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రీమియం ఉత్పత్తులపై మక్కువ పెరగడం వల్ల, మెరుగైన రాబడులు వస్తాయనే భావనతో.. కంపెనీలు మూలధన వ్యయ ప్రణాళికలనూ వేగవంతం చేస్తున్నాయి.

అధిక ఇంధన ధరలు, రవాణా ఖర్చులు, దిగుమతులకు ఆటంకాల వల్ల సిమెంట్ రంగం స్వల్పకాలిక సవాళ్లను ఎదుర్కొంటోందని అల్ట్రాటెక్ సిమెంట్ ముఖ్య ఆర్థిక అధికారి (సీఎఫ్ఓ) అతుల్ డాగా వెల్లడించారు. పెట్రోల్, డీజిల్ ధర పెరగడాన్ని ప్రస్తావిస్తూ, సిమెంట్ కంపెనీల మొత్తం నిర్వహణ వ్యయాల్లో 50–55% విద్యుత్, ఇంధన, అమ్మకపు ఖర్చులే ఉంటాయని వివరించారు. తమ కంపెనీ రెండంకెల వృద్ధి ఆశిస్తోందని పేర్కొన్నారు. 2026–27లో తమ ఏకీకృత విక్రయాల పరిమాణం సుమారు 8% పెరిగి, 80 మిలియన్ టన్నులకు చేరుకుంటుందని అంబుజా సిమెంట్స్ సీఈఓ వినోద్ బహేటే అంచనా వేశారు. పరిశ్రమ స్థాయిలో వృద్ధి 5–5.5 శాతంగా ఉండొచ్చని తెలిపారు. ద్రవ్యోల్బణం, బలహీన రుతుపవన అంచనాల వంటివి ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. దాల్మియా భారత్ ఎండీ, సీఈఓ పునీత్ దాల్మియా, శ్రీ సిమెంట్ ఎండీ నీరజ్ అఖౌరీ, నువోకో విస్టాస్ ఎండీ జయకుమార్ కృష్ణస్వామి కూడా భౌగోళిక, రాజకీయ అనిశ్చితులు, పెరుగుతున్న ఇంధన ధరలు, కరెన్సీ ఒడుదొడుకులు, అధిక ముడి పదార్థాల వ్యయాలు – ప్యాకింగ్ మెటీరియల్స్ వంటివి కంపెనీల మార్జిన్లపై ప్రభావం చూపుతాయని, 1–2 త్రైమాసికాలు ఒత్తిడి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వ వ్యయాలు కొనసాగడంతో, సిమెంటు పరిశ్రమలో ఆశావాదం ఉందని వివరించారు. వచ్చే రెండేళ్లలో విస్తరణ కోసం నిర్మా గ్రూప్ సంస్థ నువోకో విస్టాస్ 2026–27లో రూ.900 కోట్లు, 2027–28లో రూ.960 కోట్లు పెట్టుబడులు పెట్టబోతున్నట్లు ప్రకటించింది. దాల్మియా భారత్ రూ.3,200–3,400 కోట్ల పెట్టుబడులు పెట్టే ప్రణాళికలో ఉంది. ఆదిత్య బిర్లా గ్రూప్ సంస్థ అల్ట్రాటెక్ సిమెంట్ ప్రతి సంవత్సరం రూ.10,000 కోట్ల చొప్పున వచ్చే 4–5 ఏళ్లు పెట్టుబడులు పెట్టేం దుకు సిద్ధమైంది. అదానీ గ్రూప్ సంస్థ అంబుజా సిమెంట్స్ 2026–27లో రూ.6,000–6,500 కోట్లు పెట్టుబడి పెట్టబోతోంది.







## ఫ్రెంచి ఓపెన్‌లో సంచలనం సృష్టించిన మనోడు!



ఫ్రెంచి ఓపెన్‌లో భారతీయ మూలాలున్న నిశేష్ బసవరెడ్డి సంచలనం సృష్టించాడు. ఆదివారం పారిస్ వేదికగా ఏడో సీడ్ ఆటగాడు టేలర్ ఫ్రిట్జ్‌పై 7–6(5), 7–6(5), 6–7(9), 6–1 తేడాతో విజయం సాధించాడు. దీంతో నిశేష్ ఒక్కసారిగా వార్తల్లో నిలిచాడు. నిశేష్ 2005 మే 5న కాలిఫోర్నియాలోని న్యూపోర్ట్ బీచ్‌లో జన్మించాడు. సాయిప్రసన్న, మురళీ కృష్ణ అతడి తల్లిదండ్రులు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు వాస్తవ్యులు. వీరు 1999లో అమెరికాలో స్థిరపడ్డారు. 2022లో జరిగిన యూఎస్ ఓపెన్‌లో నిశేష్ బసవరెడ్డి.. ఓజాన్ బారిస్‌తో కలిసి.. బాయ్స్ డబుల్స్ టైటిల్ గెలుచుకున్నాడు. ఇలా.. జూనియర్ సర్క్యూట్‌లో తొలిసారిగా అందరి దృష్టినీ ఆకర్షించాడు. అలాగే ఏటీపీ ఛాలెంజర్ టూర్‌లో 2024 సీజన్‌లోనూ అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. రెండు ఛాలెంజర్ టైటిళ్లను గెలుచుకున్నాడు. నాలుగుసార్లు ఫైనల్స్‌కు చేరుకున్నాడు. విజయాల్లో 41–13 రికార్డు నమోదు చేశాడు.

# ఢిల్లీ ముగించింది విజయంతో..


రాహుల్ 60


కుల్‌దీప్ 3/29

ఈ ఐపీఎల్ సీజన్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ విజయంతో ముగించింది. ముంబయిపై గెలిచి రాజస్థాన్ ప్లేఆఫ్స్ చేరడంతో ప్రాధాన్యత కోల్పోయిన మ్యాచ్‌లో ఢిల్లీ 40 పరుగుల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను ఓడించింది. మొదట ఢిల్లీ 5 వికెట్లకు 203 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (60; 30 బంతుల్లో 5×4, 4×6) టాప్ స్కోరర్. అక్షర్ పటేల్ (39), డేవిడ్ మిల్లర్ (28), అభిషేక్ పోరెల్ (22) కూడా రాణించారు. సౌరభ్ దూబె (2/28) ఆకట్టుకున్నాడు. ఛేదనలో కోల్‌కతా 18.4 ఓవర్లలో 163 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ అజింక్య రహానె (63; 39 బంతుల్లో 4×4, 4×6) మాత్రమే పోరాడాడు. కుల్‌దీప్ యాదవ్ (3/29), ఎంగిడి (3/27), స్టార్క్ (2/26) కేకేఆర్‌ను దెబ్బతీశారు. రహానె బాదినా..: భారీ ఛేదనలో కోల్‌కతా దీటుగా ఆడింది. ఓపెనర్లు రహానె, అలెన్ (20; 13 బంతుల్లో 3×4, 1×6) తొలి వికెట్‌కు 4.2 ఓవర్లలోనే 43 పరుగులు జత చేసి మెరుపు ఆరంభం అందించారు. అకిబ్ నబి వేసిన నాలుగో ఓవర్లో రహానె వరుసగా రెండు సిక్స్‌లు బాదాడు. అలెన్ వెనుదిరిగినా.. మనీష్ పాండే (25; 16 బంతుల్లో 2×4, 2×6) జతగా రహానె దూకుడు కొనసాగించాడు. అక్షర్ పటేల్ వేసిన ఎనిమిదో ఓవర్లో ఈ జంట చెలరేగిపోయింది. ఈ ఓవర్లో రహానె రెండు, పాండే ఒక సిక్స్ బాదడంతో 21 పరుగులొచ్చాయి. 8 ఓవర్లకు 85/1తో కోల్‌కతా లక్ష్యం దిశగా సాగింది. అయితే ఓవర్ తేడాతో పాండే, గ్రీన్ (2) ఔట్ కావడంతో కేకేఆర్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఒకవైపు వికెట్లు పడుతున్నా రహానె ఆగలేదు. 31 బంతుల్లోనే అతడు అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అతడికి తోడు రోమన్ పావెల్ కూడా దూకుడుగా ఆడడంతో కోల్‌కతా 13 ఓవర్లకు 126/3తో నిలిచింది. అయితే తర్వాతి ఓవర్లో రహానె, రింకు సింగ్ (0)లను వరుస బంతుల్లో ఔట్ చేసిన కుల్‌దీప్.. కోల్‌కతాను ఒత్తిడిలోకి నెట్టాడు. ఆపై రోమన్ పావెల్ (29; 21 బంతుల్లో 3×4, 1×6) పోరాటం ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించగలిగింది.

మెరిసిన రాహుల్: మొదట బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీకి అభిషేక్ పోరెల్ తొలి ఓవర్లో రెండు ఫోర్లు బాదేశాడు. గ్రీన్ బౌలింగ్‌లో సిక్స్, ఫోర్‌తో రాహుల్ (60; 30 బంతుల్లో 5×4, 4×6) కూడా లయ అందుకున్నాడు. కానీ అయిదో ఓవర్లో వికెట్ కీపర్ దహియా పట్టిన చక్కటి క్యాచ్‌కు పోరెల్ (22) వెనుదిరగడంతో కేకేఆర్‌కు బ్రేక్ దొరికింది. పవర్‌ప్లేలో 53/1తో పర్వాలేదనిపించింది డీసీ. ఫామ్‌ను కొనసాగిస్తూ రాహుల్ చక్కటి షాట్లతో అలవోకగా పరుగులు రాబట్టాడు. సాహిల్ పరాఖ్ (24) తోడుగా స్కోరు బోర్డును నడిపించాడు.

# వెంకటేశ్ అయ్యర్‌కే నా ఓటు: సైమన్ డౌల్

ఐపీఎల్ 2026 తొలి క్వాలిఫయర్‌లో ఆర్సీబీ, గుజరాత్ తలపడనున్నాయి. మే 26న జరగనున్న ఈ మ్యాచ్‌కు ధర్మశాల ఆతిథ్యమివ్వనుంది. ఇందులో గెలిస్తే నేరుగా ఫైనల్‌కు దూసుకెళ్లొచ్చు. దీంతో ఈ మ్యాచ్‌తోనే టైటిల్ పోరుకు అర్హత సాధించాలని ఇరుజట్లు తమ ప్రణాళికలకు పదును పెట్టాయి. ఈ నేపథ్యంలో డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీకి న్యూజిలాండ్ మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత సైమన్ డౌల్ ఓ సూచన చేశాడు. గాయం నుంచి కోలుకుని అందుబాటులోకి వచ్చిన ఫిల్ సాల్ట్‌ను క్వాలిఫయర్–1లో ఓపెనర్‌గా ఆడించొద్దని అభిప్రాయపడ్డాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన వెంకటేశ్ అయ్యర్ 19 బంతుల్లోనే 44 పరుగులు చేశాడు. దీంతో క్వాలిఫయర్–1లోనూ అతడినే ఓపెనర్‌గానే ఆడించాలని సైమన్ డౌల్ సూచించాడు. "విరాట్ కోహ్లీకితోపాటు ఓపెనర్‌గా నేను వెంకటేశ్ అయ్యర్‌నే ఎంచుకుంటాను. ఫిల్ సాల్ట్ మూడున్నర వారాలుగా జట్టుకు దూరంగా ఉన్నాడు. సుదీర్ఘ విరామం తర్వాత ముఖ్యంగా వేలి గాయం నుంచి కోలుకుని తిరిగి మ్యాచ్ ఆడటం అంత సులభం కాదు. సాల్ట్ నాణ్యమైన ఆటగాడు. ఆర్సీబీ, ఇంగ్లాండ్ తరఫున టీ20లలో బాగా ఆడాడు. కానీ, మ్యాచ్ ఫిట్‌నెస్, షాట్–టైమింగ్ తిరిగి పొందడానికి సమయం పడుతుంది. దానిని పరీక్షించుకోవడానికి ప్లే ఆఫ్స్ సరైన వేదిక కాదు. విరాట్‌తో సాల్ట్‌కు బలమైన భాగస్వామ్య రికార్డు ఉంది. కానీ, క్రికెట్‌లో ఎప్పుడూ ఫామ్‌లో ఉన్న ఆటగాడినే ఎంచుకోవాలి. ముఖ్యంగా నాకౌట్ మ్యాచ్‌లలో, పేరుప్రతిష్ఠల కన్నా ఫామ్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. కొన్ని వారాలుగా పోటీ క్రికెట్ ఆడని ప్లేయర్‌ని జట్టులోకి తీసుకోవడమే అతిపెద్ద రిస్క్. నేనైతే ఓపెనర్‌గా వెంకటేశ్ అయ్యర్‌కే మద్దతు ఇస్తాను" అని సైమన్ డౌల్ పేర్కొన్నాడు. సీజన్ చివర్లో పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ వెంకటేశ్ అయ్యర్ సత్తాచాటాడు. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగి 40 బంతుల్లోనే 73 పరుగులు చేశాడు.




# ట్రావిస్ హెడ్ భార్యకు ఆన్‌లైన్‌లో వేధింపులు

ఐపీఎల్ 2026లో మ్యాచ్ సందర్భంగా ఆర్సీబీ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ ట్రావిస్ హెడ్‌ల మధ్య మాటల యుద్ధం జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మ్యాచ్ అనంతరం విరాట్ కోహ్లీ.. ట్రావిస్ హెడ్‌తో కరచాలనం చేసేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో భారత క్రికెట్ అభిమానులు ఆన్‌లైన్ వేదికగా తనను వేధింపులకు గురి చేస్తున్నారని ట్రావిస్ హెడ్ భార్య.. జెస్సికా హెడ్ ఆస్ట్రేలియన్ మీడియాతో అన్నారు. 'వరల్డ్ కప్ విజయం అనంతరం ఎలాగైతే వేధింపులు ఎదురయ్యాయో.. ప్రస్తుతమూ అలాంటి పరిస్థితే ఉంది. నేను నిద్ర లేచేసరికి నా సోషల్ మీడియా ఖాతాలు కామెంట్లతో హోరెత్తుతున్నాయి. నేను బాగానే ఉన్నాను. కానీ వారు నా స్నేహితులు, కుటుంబసభ్యులనూ వేధింపులకు గురి చేస్తున్నారు' అని ఆమె వాపోయారు. ఇటీవల కాలంలో భారత్‌పై ఆస్ట్రేలియా నెగ్గిన తర్వాత కూడా ఇలాంటి ఆన్‌లైన్ వేధింపులు కొనసాగాయని, వాటిలో 2023 వన్డే ప్రపంచ కప్ ఫైనల్, ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్, 2024 బాక్సింగ్ డే టెస్ట్ కూడా ఉన్నాయని ఆమె వాపోయారు. ఈ వేధింపులలో గతంలో తమ చిన్న కుమార్తెను ఉద్దేశించి ఆందోళన కలిగించే బెదిరింపులు కూడా ఉన్నాయని ఆరోపించారు. అలాగే ఫ్యాన్స్.. ఆన్‌లైన్‌లో ఎలా బాధ్యతాయుతంగా ప్రవర్తించాలో ఆమె సూచించారు. 'ప్రస్తుతం అన్ని క్రీడల్లోనూ మానసిక ఆరోగ్యం, మనం ఒకరితో ఒకరం మాట్లాడుకునే విధానం గురించి ఒక ముఖ్యమైన చర్చ జరుగుతోందని నేను అనుకుంటున్నాను. భావోద్వేగాలు క్రీడల్లో అంతర్భాగమే.. కానీ ఆట వెనుక నిజమైన వ్యక్తులు, కుటుంబాలు ఉన్నాయని కూడా గుర్తించడం అంతే ముఖ్యం. ఒకరిపై మరొకరు దయతో ఉండాలి. ఒకరికొకరు మద్దతుగా ఉండాలి' అని జెస్సికా హెడ్ అభిప్రాయం వ్యక్తం చేశారు.



# ఐపీఎల్ ట్రోఫీ గెలిచేది ఆ జట్టే..: అక్షర్ పటేల్

ఐపీఎల్ 2026 తుది దశకు చేరుకుంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ ప్లే ఆఫ్స్‌నకు క్వాలిఫై అయ్యాయి. టైటిల్ కోసం ఈ నాలుగు జట్ల మధ్య హోరాహోరీ పోరు జరగనుంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ కీలకమైన వ్యాఖ్యలు చేశాడు. టైటిల్ గెలిచే జట్టేదో అంచనా వేశాడు. ఆదివారం కోల్‌కతా నైట్ రైడర్స్‌తో మ్యాచ్ అనంతరం అతడు మాట్లాడాడు. 'సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు చాలా దృఢంగా కనిపిస్తోంది. టాప్ త్రీ బ్యాటర్లు రాణిస్తే.. ఆ టీమ్‌ను అడ్డుకోవడం కష్టం. అందుకే ఐపీఎల్ టైటిల్ విన్నర్‌గా సన్‌రైజర్స్ హైదరాబాద్ నిలుస్తుందని నేను అనుకుంటున్నా' అని అక్షర్ పటేల్ అన్నాడు. ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 9 విజయాలు, 5 అపజయాలను సొంతం చేసుకొని 18 పాయింట్లతో నిలిచింది. అయితే నెట్ రన్‌రేట్‌లో అంతరాల వల్ల పాయింట్ల పట్టికలో.. ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్ తర్వాత మూడో స్థానాన్ని సొంతం చేసుకుంది. హైదరాబాద్ టాప్ బ్యాటర్లైన అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్ 500+ పరుగులతో సత్తా చాటారు. రానున్న నాకౌట్ మ్యాచుల్లో వీరి మీదే ఆ జట్టు ఆశలు పెట్టుకుంది. హైదరాబాద్‌కు ఆర్సీబీతో జరిగిన చివరి మ్యాచ్‌లో ఈ ముగ్గురు బ్యాటర్లు హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్న విషయం తెలిసిందే. అలాగే సన్‌రైజర్స్ జట్టులో ప్రమాదకరమైన ఓపెనర్ ట్రావిస్ హెడ్ కూడా ఉన్నాడు.






# బెంగళూరు నేపథ్యంలో 'బాలక' ఫస్ట్ లుక్ విడుదల



**వుదయం సినిమా :** మంత్ర మూవీ మేకర్స్ , ఫాల్కన్ ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా, మహి రాజ్ ద్వియ దర్శకత్వంలో బెంగళూరు మహానగరంలో బాలక చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇటీవలే మొదటి షెడ్యూల్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం మొదటి లుక్, కథానాయకుడు ప్రియదర్శి విడుదల చేశారు. ఆంధ్ర కుర్రాడు బెంగళూరులో ఎదుర్కొనే కష్టాల నేపథ్యంతో వినోదభరితమైన కథగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా వరంగల్, హనుమకొండ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకుంది. నివేదా థామస్ వారి తమ్ముడు నిఖిల్ థామస్ నటిస్తున్న ఈ చిత్రానికి మల్లా నాయక్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. విశ్వదీప్ సంగీతాన్ని అందిస్తున్నారు , హర్షిత్ కొటా ఏడిటర్ గా చేస్తున్నరు.



# వన్ సైడ్ లవ్ స్టోరీ "దీవాన

**వుదయం సినిమా :** శుభం సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న యంగ్ టాలెంటెడ్ యాక్టర్ హర్షిత్ రెడ్డి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "దీవాన" గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా జూన్ 19 న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ గా థియేటర్లలో విడుదల కానుందని ఈ రోజు మేకర్స్ అనౌన్స్ చేశారు. "దీవాన" పోస్టర్ తో ఇది ఒక వన్ సైడ్ లవ్ స్టోరీ లో ఉన్న మ్యాడ్ నెస్ చూపించబోతున్నారు అని అర్థమవుతోంది. ఈ వన్ సైడ్ లవ్ స్టోరీ ఇప్పటికే సాంగ్, టీజర్ వంటి ప్రమోషనల్ కంటెంట్ తో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. "దీవాన" సినిమా టీజర్ సూపర్బ్ రెస్పాన్స్ తెచ్చుకోగా, సింగర్ కార్తిక్ పాడిన ఇది ప్రేమా .. ఇది ప్రేమా..' సాంగ్ ఛాట్ బస్టర్ గా మారింది. యూత్ ఆడియెన్స్ లో "దీవాన" సినిమా పట్ల మంచి క్రేజ్ ఏర్పడుతోంది. ఈ చిత్రాన్ని అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మిస్తున్నారు. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో హీరోయిన్ స్నేహ మణిమేగలై మరియు దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి పరిచయం కానున్నారు.

# పరిశ్రమ పద్ధతులకు అందరూ కట్టుబడి ఉండాలి: చిరంజీవి

**వుదయం సినిమా :**

విషయాలన్నీ పూర్తిగా విన్న శ్రీ చిరంజీవి పరిశ్రమ లో భాగస్వాములయిన అందరికీ పూర్తి న్యాయం జరిగేలా వుండాలని , ఒక్క సినిమా గురించో , ఒక్క సెక్టార్ గురించో ఈ చర్చ కాదని, అందరికీ ఆమోదయోగ్యంగా వుండాలనే పరిశ్రమ కొన్ని పద్ధతులను ఏర్పరుచుకుంది అన్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ కి హైయెస్ట్ బాడీ తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అన్న విషయాన్ని గుర్తు చేసి, ఆ ఛాంబర్ తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి వుండటం అందరికీ సముచితం అన్నారు. ఒకసారి అందరినీ సంప్రదించి , పర్సెంటేజ్ మోడల్ మీద ఒక కమిటీని ఏర్పాటు చేస్తూ ఛాంబర్ ఒక నిర్ణయాన్ని తీసుకున్న తర్వాత దాన్ని వ్యతిరేకిస్తూ మీడియా ముందు ఏ ఒక్కరూ అభిప్రాయాలు వ్యక్తపరచటం తగదని అన్నారు. ఇలాంటి వాటివల్ల ఇండస్ట్రీ ఒక్కటిగా లేదన్న సందేశం ఇవ్వకూడదని అన్నారు. ఇంతకు ముందు వేసిన వేరే కమిటీ ల పని తీరు , ఫలితాల పట్ల సింగిల్ స్క్రీన్స్ సభ్యులలో కొంత అసంతృప్తి , అపనమ్మకం వుందన్న విషయం అర్థం అయిందన్నారు. ఈ సారి ఛాంబర్ ఏర్పాటు చేసిన కమిటీ అనుకున్న గడువులో అంటే జూన్ 30 వ తేదీ వరకూ , అన్ని విషయాలని పూర్తిగా పరిశీలించి ప్రొడ్యూసర్స్ , డిస్ట్రిబ్యూటర్స్ , ఎక్సిబిటర్స్ అందరికీ న్యాయం జరిగేలా పర్సెంటేజ్ మోడల్ మీద ప్రతిపాదనని చేస్తుందని తనకు నమ్మకం వుందని, ఆ



కమిటీ సకాలంలో తన బాధ్యతలు పూర్తిచేసి నివేదిక ఇవ్వటానికి తనవంతు కూడా పూర్తి ప్రయత్నం చేస్తానని శ్రీ చిరంజీవి హామీ ఇచ్చారు. శ్రీ చిరంజీవి సమయం వెచ్చించి తమకున్న సమస్యలని , భయాలని, ప్రస్తుతం సింగిల్ స్క్రీన్స్ కి వున్న పరిస్థితులని అవగాహన చేసుకుని అందరికీ న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇవ్వటం పట్ల సభ్యులందరూ పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు . వారి అసోసియేషన్స్ లో వున్న మిగతా సభ్యులందరికి ఈ సమావేశం గురించి తెలియచేసి 24 గంటలలో తమ ఆమోదాన్ని తెలియచేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో TFCC ప్రెసిడెంట్ శ్రీ సురేష్ బాబు , శ్రీ అల్లు అరవింద్ , TFDC చైర్మన్. శ్రీ దిల్ రాజు , ప్రముఖ నిర్మాతలు శ్రీ కే ఎల్ నారాయణ, శ్రీ సునీల్ నారంగ్ , శ్రీ భరత్ నారంగ్ , తెలంగాణ ఫిలిం ఛాంబర్ ప్రెసిడెంట్ శ్రీ శేఖర్ , శ్రీ అనుపమ్ , శ్రీ శ్రీధర్ , శ్రీ సదానంద్ గౌడ్ , సుదర్శన్ థియేటర్ ప్రొప్రయిటర్ శ్రీ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# 'మా ఇంటి బంగారం' కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా ఉంటుంది



**వుదయం సినిమా :**

ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. సమంత ప్రధాన పాత్రలో నందినీ రెడ్డి తెరకెక్కించిన ఈ మూవీని జూన్ 19న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో సోమవారం నాడు ట్రైలర్‌ను విడుదల చేశారు. సమంత మాట్లాడుతూ .. "మా ఇంటి బంగారం' ట్రైలర్ అందరికీ నచ్చే ఉంటుందని భావిస్తున్నాను. మా కోసం ఇక్కడికి వచ్చిన ప్రతీ ఒక్క అభిమానికి థాంక్స్.

# మహిళా సాధికారతకు కమర్షియల్ అంశాలు జోడించి చేసిన గొప్ప చిత్రం 'బ్లాస్ట్ జోన్' : యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా



**వుదయం సినిమా :** యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా, ప్రీతి ముకుందన్, అభిరామి ప్రధాన పాత్రల్లో నటించిన మోస్ట్ అవేటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బ్లాస్ట్ జోన్' చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా విడుదల చేస్తోంది. సుభాష్ కె రాజ్ దర్శకత్వంలో ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించిన ఈ చిత్రానికి 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతం అందించడం విశేషం. మే 28న ఈ చిత్రం థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధంగా ఉన్న నేపథ్యంలో, సోమవారం హైదరాబాద్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో చిత్ర యూనిట్ ప్రెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా మాట్లాడుతూ.. "అందరికీ హృదయకపూర్వక నమస్కారాలు. ఈ 'బ్లాస్ట్ జోన్' సినిమా నాకు ఎంతో ప్రత్యేకమైనది.

# 'పెద్ది' వన్ ఆఫ్ ది బెస్ట్ ఫిల్మ్స్ అవుతుంది

**వుదయం సినిమా :** 'పెద్ది' కోసం నిజాయితీగా, ప్రాణం పెట్టి పనిచేశాం. రాసిపెట్టుకోండి..: బెంగళూరు ప్రెస్ మీట్ లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ రామ్ చరణ్ గారితో కలిసి పనిచేయడం ఎంతో ఆనందంగా అనిపించింది. పెద్ది చిత్రం ప్రేక్షకుల మనసులో నిలిచిపోతుంది: కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా 'పెద్ది' దేశవ్యాప్తంగా హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రం ఇప్పటికే అద్భుతమైన గ్లింప్స్, రెండు చార్ట్ బస్టర్ పాటలు, పవర్ ఫుల్ థియేట్రికల్ ట్రైలర్‌తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తోంది. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. పెద్ది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల కానుంది. జూన్ 3న ప్రత్యేక ప్రీమియర్‌లు ప్రదర్శించనున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర బృందం బెంగళూరులో గ్రాండ్ ప్రెస్ మీట్ నిర్వహించింది. బెంగళూరు ప్రెస్ మీట్ లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మాట్లాడుతూ.. కన్నడ ప్రేక్షకులందరికీ నమస్కారం. అభిమానులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. నాకు నచ్చిన పని, తెలిసిన పని చేస్తూ ఇంత ప్రేమను పొందడం అదృష్టంగా భావిస్తున్నాను. మీ అందరికీ, దేవుడికి నమస్కరిస్తున్నాను. దాదాపు రెండున్నర సంవత్సరాల తర్వాత మళ్లీ మీ ముందుకు వస్తున్నాను. ఈ సినిమా కోసం మేమంతా ఎంతో నిజాయితీగా, ప్రాణం పెట్టి పనిచేశాం. రాసిపెట్టుకోండి... ఇది వన్ ఆఫ్ ది బెస్ట్ ఫిల్మ్స్ అవుతుంది. శివన్న నాకు ఒక ఫాదర్, ఒక అంకుల్, ఒక బ్రదర్‌లాంటి వారు. ఆయన భారతీయ సినీ పరిశ్రమలో ఒక లెజెండ్, కన్నడ చిత్రసీమకు చక్రవర్తి. అలాంటి గొప్ప నటుడితో కలిసి పనిచేయడం నా జన్మ ధన్యమైందని భావిస్తున్నాను. ఏఆర్ రెహమాన్ గారు ఈ చిత్రంలో భాగం కావడం చాలా ఆనందంగా ఉంది. జాన్వీ గారు కూడా ఈ సినిమా కోసం ఎంతో నిజాయితీగా పనిచేశారు. మా నిర్మాత సతీష్ గారికి ఇది తొలి చిత్రం. ఆయన హార్ట్ ఫుల్ గా చేశారు. బుచ్చిబాబు లేకపోతే ఈ సినిమా లేదు. అలాగే జగపతిబాబు గారికి, డీవోపీ రత్నవేలు గారికి ధన్యవాదాలు. ఈ సినిమా జరగడానికి ప్రధాన కారణమైన సుకుమార్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. నా జీవితంలో నేను చేసిన మోస్ట్ ఇన్స్పైరింగ్ ఫిలిం 'పెద్ది'. జూన్ 4న మీరందరూ తప్పకుండా థియేటర్లలో ఈ సినిమాను చూస్తారని కోరుకుంటున్నాను. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. రామ్ చరణ్ చాలా కష్టపడి ఈ స్థాయికి వచ్చారు. తన తొలి సినిమా నుంచి ఇప్పటి వరకు ఎంతో నిజాయితీగా పని చేస్తూ వచ్చారు. తల్లిదండ్రులు, పవన్ కళ్యాణ్ గారు, అభిమానుల ఆశీర్వాదాలు ఆయనకు ఎప్పుడూ వుంటాయి. ఒక సందర్భంలో పవన్ కళ్యాణ్ గారు, రామ్ చరణ్ గారు ఒక కార్యక్రమంలో పక్కపక్కనే కూర్చున్నారు. వారి మధ్య ఆప్యాయత నన్ను ఎంతో హత్తుకుంది. నాకు పునీత్‌తో ఉన్న అనుబంధం లాంటిదే. రామ్ చరణ్ అంటే నాకు చాలా ఇష్టం. ఆయనతో కలిసి పనిచేయడం ఎంతో ఆనందంగా అనిపించింది. నిర్మాత సతీష్ గారు, దర్శకుడు



# భారతీయ పురాతన కళల పునరుజ్జీవనం.. కోహినూర్ 3.0 ద్వారా ఒడిశా 'పట్టచిత్ర' వైభవం!



**వుదయం సినిమా :** భారతదేశపు సంపన్న సాంప్రదాయ కళలు మరియు హస్తకళలలో మన సాంస్కృతిక వారసత్వం ఎల్లప్పుడూ ప్రతిబింబిస్తూనే ఉంటుంది. భారతీయ చేనేత కార్మికులను, కళాకారులను మరియు వారసత్వ కళారూపాలను ప్రోత్సహించే ప్రయాణాన్ని కొనసాగిస్తూ... కోహినూర్ 3.0 ఇప్పుడు ఒడిశాకు చెందిన అద్భుతమైన ప్రాచీన కళారూపం 'పట్టచిత్ర' (Pattachitra) ను గర్వంగా ప్రపంచానికి పరిచయం చేస్తోంది ప్రముఖ సెలబ్రిటీ డాక్టర్ సుధా జైన్. హైదరాబాద్ లో జరిగిన ఓ కార్యక్రమంలో Vogue ఫ్యాషన్ వీక్ హైదరాబాద్ సీజన్ 1 పోస్టర్ లాంచ్ కార్యక్రమం కూడా జరిగింది. కాగా ఫ్యాషన్ వీక్ గ్రాండ్ ఫినాలే జూన్ 28న జరుగనుంది. పట్టచిత్ర విషయానికి వస్తే.... : 'పట్టచిత్ర' అంటే "బట్టపై గీసే చిత్రాలు" అని అర్థం. ఇది వెయ్యి సంవత్సరాలకు పైగా కొనసాగుతున్న భారతదేశపు అత్యంత పురాతనమైన, విలువైన జానపద కళా సంప్రదాయాలలో ఒకటి. క్లిష్టమైన డిజైన్లు, పౌరాణిక కథలు, జగన్నాథ స్వామి ఇతివృత్తాలు, 'ట్రీ ఆఫ్ లైఫ్' (జీవన వృక్షం) వంటి కాన్సెప్ట్‌లతో కూడిన ఈ చిత్రాలను టస్సార్ సిల్క్ (Tussar Silk) మరియు తాటి ఆకులపై చేతితో అద్భుతంగా పెయింట్ చేస్తారు.

# వేణు ఉడుగుల చేతుల మీదుగా 'సింగిల్ రాజు'

**వుదయం సినిమా :** టాలీవుడ్‌లో మరో అందమైన గ్రామీణ ప్రేమకథ ప్రేక్షకుల ముందుకు రానుంది. విశ్వస్, మౌనిక, దివ్య ప్రధాన పాత్రల్లో, యువ దర్శకుడు ఎస్.ఎస్. వర్మ తెరకెక్కిస్తున్న చిత్రం 'సింగిల్ రాజు'. విభిన్నమైన టైటిల్‌తో ఇప్పటికే ఆసక్తి రేకెత్తిస్తున్న ఈ సినిమా టైటిల్, గ్లింప్స్ విడుదల కార్యక్రమం 'మా ఈవెంట్స్' (maaa Events) సహకారం(Collaboration)తో హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దర్శకుడు, నిర్మాత వేణు ఉడుగుల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా 'సింగిల్ రాజు' టైటిల్ పోస్టర్‌తో పాటు గ్లిమ్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వేణు ఉడుగుల మాట్లాడుతూ.. "ఎస్.ఎస్. వర్మ, విశ్వస్ ఇద్దరూ నాకు ఎంతో ఇష్టం. ఈ సినిమా కథ వినగానే చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. ఎంతో ధృఢ సంకల్పంతో ఈ సినిమాను ప్రారంభించారు. చాలా బాగా తెరకెక్కిస్తున్నారు. చిత్ర యూనిట్ మొత్తం మంచి కష్టపడి పనిచేస్తోంది. ఈ సినిమా పెద్ద విజయాన్ని అందుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని తెలిపారు.



దర్శకుడు ఎస్.ఎస్. వర్మ మాట్లాడుతూ.. "వేణు ఉడుగుల అన్న సపోర్ట్ లేకపోతే ఈ సినిమా సాధ్యమయ్యేది కాదు. ఈ సినిమా కోసం నాకంటే ఎక్కువగా మా అమ్మానాన్నలు కష్టపడ్డారు. ప్రేక్షకులను తప్పకుండా అలరించే మంచి ఎంటర్‌టైనర్‌గా 'సింగిల్ రాజు' నిలుస్తుందనే నమ్మకం ఉంది" అన్నారు.

దర్శకుడు ఎస్.ఎస్. వర్మ మాట్లాడుతూ.. "వేణు ఉడుగుల అన్న సపోర్ట్ లేకపోతే ఈ సినిమా సాధ్యమయ్యేది కాదు. ఈ సినిమా కోసం నాకంటే ఎక్కువగా మా అమ్మానాన్నలు కష్టపడ్డారు. ప్రేక్షకులను తప్పకుండా అలరించే మంచి ఎంటర్‌టైనర్‌గా 'సింగిల్ రాజు' నిలుస్తుందనే నమ్మకం ఉంది" అన్నారు.

హీరో విశ్వస్ మాట్లాడుతూ.. "దర్శకుడు ఎస్.ఎస్. వర్మ మేము ఎంతో ఫ్యాషన్ తో చేస్తున్న సినిమా. విలేజ్ లో షూటింగ్ జరుగుతున్నప్పుడు అక్కడ అందరూ సపోర్ట్ చేశారు. మా సినిమా ను ప్రతి ఒక్కరు ఆదరించాలని కోరుకుంటున్నాం." అని అన్నారు.



# 'నాగబంధం' ఘనంగా జరిగిన 3D స్టాండీ కర్టెన్ రైజర్ ఈవెంట్

**వుదయం సినిమా :** విరాట్ కర్ణా, అభిషేక్ నామా, నిక్ స్టూడియోస్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'నాగబంధం' ఘనంగా జరిగిన 3D స్టాండీ కర్టెన్ రైజర్ ఈవెంట్ భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న మైథలాజికల్ యాక్షన్‌అడ్వెంచర్ 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' పై రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. దర్శకుడు అభిషేక్ నామా, హీరో విరాట్ కర్ణ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఈ భారీ చిత్రం ప్రతి ప్రమోషనల్ అప్డేట్ తో దేశవ్యాప్తంగా ఆకట్టుకుంటుంది.

భారతీయ పురాణాలు, అడ్వెంచర్, ప్రాచీన రహస్యాలు, దైవిక శక్తులు, హైఆక్టేన్ యాక్షన్ అంశాలతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు ఇప్పటివరకు చూడని సినిమాటిక్ అనుభూతిని అందించనుంది.

Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-3-95,Padmashali Street, Karimnagar-505001 Telangana. Editor : Sirikonda Augustin, RNI No. TELTEL/2013/65079, E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.